ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 473
వెల : రూ.20/-
అక్టోబర్ 2024

ఈ గతి మన కష్టార్జితమంతా
ఎవరో కొందరి భోగతృప్తికై
ఇనుప పెట్టెలో మూల్గుతున్నది
అందరమొకటై ఎదిరించి
న్యాయంగా మనకొచ్చేదంతా
రాబట్టానికి రారండోయ్

\- యూజీన్ పాటియర్



జనసాహితి ప్రచురణ

# జనసాహితి ప్రచురణలు కొన్ని




1/4 క్రౌన్ సైజులో

పేజీలు : 335

వెల : రూ. 450/-




1/8 డెమ్మీ సైజులో

పేజీలు : 134

వెల : రూ. 150/-




1/8 డెమ్మీ సైజులో

పేజీలు : 216

వెల : రూ. 150/-




1/6 డెమ్మీ సైజులో

పేజీలు : 64

వెల : రూ. 80/-




1/8 డెమ్మీ సైజులో

పేజీలు : 83

వెల : రూ. 100/-

ఈ పుస్తకాలు దొరకుచోటు :

**మైత్రీబుక్‌హౌస్,** జలీల్‌వీధి, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2.

సెల్ : 70755 08270

48 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

జనసాహితి ప్రచురణ

473

సంపుటి : 48

సంచిక : 03

అక్టోబర్ 2024

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ❑ ముఖచిత్రం | : | అసమానతలు – చిత్రం (అంతర్జాలం నుండి) | | .....01 |
| ❑ రెండవ అట్ట | : | జనసాహితి ప్రచురణలు | | .....02 |
| ❑ మూడవ అట్ట | : | ఇది లెనిన్ శతవర్ధంతి సంవత్సరం.... – కవిత | – దివికుమార్ | .....35 |
| ❑ నాల్గవ అట్ట | : | చైనా విప్లవంలో లాంగ్‌మార్చ్ చిత్రం (అంతర్జాలం నుండి) | | .....36 |
| ❑ సంపాదకీయం | : | అవివేకులు కాదు జనం! గ్రహిస్తారు ఉన్న నిజం!! | | .....05 |
| ❑ కథ | : | మా పాత యిల్లు – మూలం : లూషన్ | అనువాదం : గౌరీశంకర్ | .....07 |
| ❑ కవితలు | : | ప్రశ్న (**05**); ఉదయ (**16**); గవిడి శ్రీనివాస్ (**24**); లలితానంద్ (**28**) | | |
| ❑ పాట | : | లడ్డమ్మకు దండాలు | – వై. నేతాంజనేయప్రసాద్ | .....21 |
| ❑ ధారావాహిక | : | దేశ విభజన వస్తువుగా సాహిత్యం (23) | | |
| | | 'అమృతసర్ ఆగయా', 'ది ఎస్కేప్', 'ఒక తులసి మొక్క కథ', 'గాంధీజీ' – కథల పరిచయం | | |
| | | | – కొత్తపల్లి రవిబాబు | .....09 |
| ❑ వ్యంగ్యరచన | : | సమ్మిళిత వృద్ధికి జై! దోపిడీ వ్యవస్థ వర్ధిల్లాలి!! | – ప్రొఫెసర్. తోట జ్యోతిరాణి | .....14 |
| ❑ వ్యాసం | : | 'నా సినిమా బంగ్లాదేశ్ నిరంకుశ ప్రభుత్వాగ్రహాన్ని చవిచూసింది' | | |
| | | మూలం : హన్సల్ మెహతా | అనువాదం : దివికుమార్ | .....19 |
| ❑ పుస్తక పరిచయాలు | : | 'బిల్ గేట్సు దాతృత్వ రహస్యం' | పరిచయం : జి.వి.భద్రం | .....17 |
| | : | 'నిఖిల లోకం' | – కొత్తపల్లి రవిబాబు | .....22 |
| ❑ గల్పిక | : | నాయం గావాల | – శంకరం | .....30 |
| ❑ సినిమా సమీక్ష | : | ఒక డ్యాము – రెండు సినిమాలు | – బాలాజీ (కోల్‌కతా) | .....25 |
| ❑ సంతాపాలు | : | కొప్పోలు మోహనరావు; వడ్డెపల్లి కృష్ణ; ఉన్నం నాగేశ్వరరావు; బి. విజయభారతి | | .....31 |
| ❑ వివిధ | : | ముప్ఫై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**04**); వాణిజ్య ప్రకటనలు (**14, 29**); | | |
| | | ఈ పుస్తకాలు అందాయి (**32**); వార్తాసాహితి (**34**) | | |



ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : **9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :
**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
30-7-6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.
ఫోన్ : 70759 57010 prajasahithi1977@gmail.com

రచనలు పంపవలసిన చిరునామా :
**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – 532001
ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com


ISSN 0971-278X

LCCN 94903393

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
*0680101004936*
*IFSC No. CNRB0000680*
**ఫోన్ : 70759 57010**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# ముప్పై ఏళ్ల క్రితం ప్రజాసాహితి

**సంచిక : 03 సంపుటి : 18 అక్టోబర్ 1994**



**చిత్రకారుడు** బాలి గీసిన విప్లవకారిణి, స్త్రీ విముక్తి ఉద్యమ నాయకురాలు అలెగ్జాండ్రా కొల్లంటాయ్ ముఖచిత్రంతో ఈ సంచిక వెలువడింది. రెండవ కవరు పేజీలో అనామకుడు రాసిన 'ధిక్కారస్వరం' కవితనూ, మూడవ నాలుగవ కవరు పేజీల్లో కొండమొదలు గిరిజనోద్యమంతోపాటు పెరిగిన కమలను స్మరించుకుంటూ వై. సుకన్య రాసిన 'విరజిమ్మె వెన్నెలలె మా కమలక్క' పాటనూ ముద్రించారు.

'మద్యంపై మరో ఉద్యమం' సంపాదకీయంలో మద్యం అనే పాలకవర్గాల దోపిడీ మాధ్యమం రద్దయ్యేవరకు పోరాటం కొనసాగుతుందని 'ప్రజాసాహితి' ఆశిస్తోందని తెలియచేశారు. అక్టోబరు విప్లవ వార్షికోత్సవం సందర్భంగా నికొలాయ్ పొగాటిన్ రాసిన "క్రెమ్లిన్ గంటలు" అనే అక్టోబరు విప్లవం విజయవంతమవుతున్న ప్రారంభపు పరిస్థితులను చిత్రిస్తూ రాసిన నాటకంలోని చివరి అంకాన్ని ప్రచురించారు. సోవియట్ రష్యా విప్లవంలోనూ, ప్రభుత్వంలోనూ ప్రముఖ వ్యక్తి అయిన "అలెగ్జాండ్రా మైఖలోవ్నా కొల్లంటాయ్"ని డా॥ కిరణ్మయి పరిచయం చేశారు.

అలెగ్జాండ్రా కొల్లంటాయ్ రాసిన "కమ్యూనిజం – కుటుంబం" వ్యాసాన్ని ప్రశాంత్ అనువాదం చేశారు. "పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ సంకలనం చేసిన కవితా ఓ కవితా – తెలుగు వచన కవితా సంకలనం 1981–90"ను కొత్తపల్లి రవిబాబు సమీక్ష చేశారు. కొప్పుల భానుమూర్తి రాసిన 'కడుపే సెరువయ్యింది' కథను ప్రచురించారు. పాపినేని శివశంకర్, వాసిరెడ్డి నవీన్ సంపాదకత్వంలో వెలువడిన 'కథ–93'ను 'కథాకాలం' అనే శీర్షికతో పాఠక్ పరిచయం చేశారు. అక్టోబర్ 30న అమరులైన శ్రీకాకుళం అమరవీరులు కోరన్న – మంగన్నల స్మృతిలో నిశితాసి రాసిన 'కోరన్న–మంగన్న' జనంపాటను, చందర్ రాసిన 'గరిబోల్ల ఘర్జన' అనే జనంపాటలను అప్పన్నగారి గోపాలరావు రాసిన 'ఎన్‌కౌంటర్ అంటే హత్యేనా', బి. పాండురంగారెడ్డి రాసిన 'కళాఖండం', అల రాసిన "అతడు" కవితలనూ, కత్తెనపల్లి గ్రామంలో పుట్టి, కొండమొదలు గిరిజనోద్యమంతోపాటు పెరిగిన కామ్రేడ్ కమలను స్మరించుకుంటూ గోదావరి రాసిన వ్యాసాన్ని, 'అనుభూతి' శీర్షికలో ఆగస్టు 94 'ప్రజాసాహితి'లో ప్రచురించిన 'సంబంధం' కథపై డా॥ శాంతికుమార్ సమీక్షను అందించారు. పి. చంద్రశేఖర్ అజాద్ నిర్వహిస్తున్న 'పిల్లల శీర్షిక', ఉత్తరాలు, అందుకున్న పుస్తకాల 'స్వీకారం' శీర్షికలను ప్రచురించారు.

1/8 డెమ్మీలో 68 పుటలు. వెల : రూ. 5/–

సంపాదకీయం

# అవివేకులు కాదు జనం ! గ్రహిస్తారు ఉన్న నిజం !!

**వరదలు** ఊళ్ళను ముంచెత్తాయి. వరద ముంపుకు గురైన ప్రాంతాల్లో నివశిస్తున్న అత్యధిక సంఖ్యలో వున్న పేద, మధ్యతరగతి ప్రజానీకం సర్వస్వాన్ని కోల్పోయారు. కుండపోత వానలను, వరదలను ప్రకృతి విపత్తులుగానో, గత పాలకుల నిర్లక్ష్య విధానాల ఫలితాలుగానో ప్రస్తుత అధికారపార్టీలు ప్రచారం చేస్తున్నప్పటికీ, ఇవి దశాబ్దాల తరబడి వివిధ పాలకవర్గాలు అనుసరిస్తూన్న పర్యావరణ వ్యతిరేక విధానాల వల్ల సంభవించిన విపత్తులుగా, శ్రమజీవుల ప్రాణాలపట్ల పాలకవర్గాల చిత్తశుద్ధిలేనితనంగా పర్యావరణ పరిరక్షణ నివేదికలు తెలియచేస్తున్నాయి. మన పాలకులు, దేశ సహజవనరులను విచ్చలవిడిగా బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేయటంతో, వారు ప్రకృతి నియమాలను ఉల్లంఘిస్తూ సాగిస్తూన్న ఆక్రమణలు, అక్రమ కట్టడాలు, ఖనిజాల కోసం తవ్వకాలు, అడవులను, కొండలను బోడి చేయటం వంటి ప్రకృతి విధ్వంస విపత్తులను సృష్టిస్తూ ప్రజల ప్రాణాలను, సహజ సంపదలను హరిస్తున్నారు.

వరదలు వల్ల పంటలన్నీ మునిగిపోవటం, ఉపాధికి అవసరమైన పరికరాలు, వాణిజ్య సామగ్రి బురదలో కూరుకుపోవటం, కుటుంబ సభ్యులను కోల్పోవటం వల్ల, ఉపాధిలేమి వంటి సమస్యలతో సతమతమవుతున్న ప్రజానీకానికి నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల మరో గుదిబండై కృంగదీస్తోంది. వరదసాయం పేరుతో ప్రభుత్వాలు, వివిధరంగాలకు చెందిన సేవా, దాతృత్వాల దిగ్గజాల చాటింపుల మధ్యే కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై సుంకాన్ని భారీఎత్తున పెంచింది. దీనితో నిత్యావసర సరుకుల ధరలకు రెక్కలొచ్చాయి. ఉదాహరణకి వంటనూనెలైన పామ్, సోయా, సన్‌ఫ్లవర్ వంటి ముడిసరుకులపై ప్రస్తుతం 5.5 శాతంగా వున్న దిగుమతి సుంకం నేడు 27.5 శాతానికి పెరిగింది. ఈ సెప్టెంబర్ 14వ తారీఖు నుండి అమలులోకి వచ్చిన ఈ దిగుమతి పన్నుల వల్ల 13.75 శాతంగా వున్న సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై పన్ను 33.75 శాతానికి పెరిగింది. దీనికితోడు రూపాయి విలువ పడిపోవటంతో దిగుమతి సుంకం 60,750 కోట్ల రూపాయల నుండి 1,38,424 కోట్లకు పెరిగింది. పంటలను పండిస్తున్న రైతాంగానికి, వినియోగదారులకు అధిక భారాన్ని పెంచుతూ దళారీ పెట్టుబడిదారులు ప్రజల శ్రమను చివరికంటా పీల్చుకుంటూ సొమ్ముచేసుకుంటున్నారు. అందులో భాగంగానే మన పాలకులు వంటనూనెల వ్యాపారాన్ని అదానీకి, పెట్రోలియం ఉత్పత్తులను అంబానీ కంపెనీలకు అప్పచెప్పారు.

ఇలా పాలకవర్గాల దోపిడీ విధానాలు తమ కష్టాన్ని, శ్రమనూ అన్ని రూపాల్లోనూ కొల్లగొట్టటంతో పేదలు మరింత పేదలౌతున్నారు. జీవన పోరాటంలో ఉక్కిరిబిక్కిరై పోతున్నారు. తాము సృష్టించిన సంపదల నుండి శ్రమజీవులు తమ న్యాయమైన వాటాను కోల్పోతూ సంక్షోభాల సుడిగుండాలలో దీనాతిదీనంగా బ్రతుకులు వెళ్ళమారుస్తున్నారు.

సెప్టెంబర్ 2024లో ఐక్యరాజ్యసమితిలో భాగమైన ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ILO) ఆదాయ అసమానతల రిపోర్ట్‌ను ప్రకటించింది. 2004 నుండి 2024 వరకూ, రెండు దశాబ్దాల కాలంలో సంపదలో శ్రమజీవుల వాటా 1.6% పడిపోయిందని ఈ రిపోర్టు స్పష్టంగా పేర్కొన్నది. 1.6% అనేది సంఖ్యగా చిన్నగా కనిపిస్తున్నా.... దాని విలువ 2.4 ట్రిలియన్ డాలర్లు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశం జిడిపి అంచనాలో సగం కంటే ఎక్కువ. రూపాయల్లోనే చెప్పుకుంటే 20 కోట్ల, 4 లక్షల, 26 వేల కోట్ల రూపాయల సంపద శ్రమజీవుల కష్టం నుండి గుంజి ధనికుల జేబుల్లోకి కుక్కివేయ బడిందన్నమాట. ఈ రిపోర్టు రెండు దశాబ్దాల కాలానిదీ అని చెప్పినా, అందులో 40% లాభాలు 2019-22 నాటి కరోనా కాలంలోనివేనట. అంటే ధనికస్వామ్యం ప్రపంచవ్యాప్తంగా కరోనా కాలంలో ప్రజల ప్రాణాలను గాలిలో దీపంలా నిలిపి విపరీతమైన లాభాలను స్మశానంలో బొగ్గులేరుకున్న చందంగా కార్పొరేట్లకు అప్పగించింది. ఇంకా ఈ రిపోర్టు 2024 నాటికి ప్రపంచవ్యాప్తంగా యువకులు 13.1% నిరుద్యోగులుగా ఉన్నారని, యువతులు వీరికి రెట్టింపును దాటి 28.2%గా నిరుద్యోగులుగా ఉన్నారని తెలుపుతున్నది.

మనదేశంలో 2024 మార్చిలో ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ILO) మరియు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ (IHD) సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం భారతదేశంలో యువజనులు 83% నిరుద్యోగులేనని స్పష్టం చేసింది. కోవిడ్ అనంతరం సెకండరీస్థాయి విద్యార్హతలు కలిగిన యువజనులలో నిరుద్యోగం 35.2 నుండి 62.7 శాతానికి పెరిగిపోయిందని, పేద రాష్ట్రాలలోనూ ఇంకా దళిత, గిరిజన సమూహాలలోనూ ఈ నిరుద్యోగం మరింత ఎక్కువ అని తెల్పింది.

మనదేశ మాజీ ఛీఫ్ ఎకనామిక్ అడ్వయిజర్ కౌశిక్ బసు 2024 మే నెల 29న మాట్లాడుతూ సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (CMIE) సంస్థ మనదేశ యువతరంలో నిరుద్యోగితారేటు 45.4%గా ఉన్నదని తెలిపిందని, ఇది దేశ భవిష్యత్తు ప్రమాదంలో ఉన్నదని సూచిస్తూంది.

కొంత ఆర్థిక వెసులుబాటు వుండి, పెద్ద చదువులున్న యువతరాన్నంతా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు, శారీరక శ్రమజీవులను గల్ఫ్ దేశాలు ఉపాధి పేరుతో వలవేసి ఎత్తుకుపోతున్నాయి. నానాటికి మరింతగా పేదరికంలోకి జారిపోతూన్న కుటుంబాలలోని యువతకు ఉపాధి అవకాశాలు, బ్రతుకుదెరువు చూపించలేని పాలకుల విధానాలు, యువతపై అసాంఘిక కార్యక్రమాల వలను విసురుతుంది. ప్రతిరోజూ ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్‌మీడియాలు విచ్చలవిడిగా వ్యాపిస్తూన్న మద్యం, మాదకద్రవ్యాల నేరాల వార్తలతో నిండి వుంటున్నాయి. సమాజంలో అసమానతలు, నిరుద్యోగాన్ని పెంచుతూ వాటికి పరిష్కారాలుగా కులం, మతం, లింగ, ప్రాంత వివక్షలను సంస్కృతిగా వ్యాప్తిచేస్తూ యువతను వాడుకుంటున్నారు. క్షీణ విలువలకు యువతను ఎరగా మారుస్తున్నారు.

మనదేశంలో ప్రతి రాష్ట్రంలోనూ ప్రతి మారుమూలా స్త్రీలపై అత్యాచారాలు, మరీ ముఖ్యంగా మానవత్వాన్ని కోల్పోతూ క్రూరంగా హింసించి, వేధిస్తూ చేస్తూన్న సామూహిక హత్యాచారాలు మరింతగా పెరుగుతున్నాయి. బలహీనవర్గాలు, దళితులు, ఆదివాసీలపై కులం పేరుతో దాడులు, సాంఘిక బహిష్కరణలు, పరువు హత్యలు పాలక వర్గాల అండదండలతో పెచ్చరిల్లుతున్నాయి. ఇక మతకల్లోలాలకు కారణాలే అవసరంలేనంత వైషమ్యాలను ప్రజల్లో పెంచారు. మూఢత్వం, అంధవిశ్వాసాలే ప్రజల సమస్యలకు పరిష్కారంగా చెలామణి చేస్తున్నారు. తన కళ్ళెదుటే జరుగుతున్న అవినీతిని, అరాచకాలను, అన్యాయాలను తెలుసుకోలేని 'అనాథ రక్షకుడు', 'ఆపద్బాంధవుడు', 'దేవదేవుడు'గా పూజలు పొందే వెంకటేశ్వరుడిని కూడా పాలకులు తమ రాజకీయ కుమ్ములాటల్లో పాచికను చేశారు.

కల్తీ విత్తనాలు, కల్తీ పురుగుమందులు వాడి అన్యాయంగా వేలమంది రైతాంగం ఆత్మహత్యలు చేసుకున్నపుడు, కలుషితమవుతున్న నదులు, నీరు, ఆహారం, వాతావరణంతో నిత్యం అనారోగ్యాలు, అవస్థలు పడుతున్నపుడు, కల్తీ మందులు వేసుకుని పసికూనలు సైతం ప్రాణాలు వదిలినపుడు, కల్తీ మద్యం బారినపడి శ్రమజీవుల కుటుంబాలు ఛిన్నాభిన్నమైనపుడు ఆదుకొనడానికి రాని సనాతన ధర్మం, ఒక లౌకిక రాజ్యంలో స్వయానా ప్రభువర్యులే దేవాలయాల్లో కల్తీ ప్రక్షాళన శుద్ధి కార్యక్రమం చేపట్టటం చూస్తుంటే ఇంకా మనం ఎటువంటి కాలం చెల్లిన సంస్కృతులను ఎదుర్కోవటానికి సిద్ధపడాలో!.

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను పోగుచేసుకోవటం వల్ల పెరుగుతున్న ఆర్థిక అసమానతలు సాంస్కృతిక రూపంలో ప్రపంచీకరణ పుణ్యమా అని మూలమూలలకూ విస్తరించి మన జీవితాలపై పంజా విసురుతోంది. ఆ పంజాను తిప్పికొట్టగలిగే ఒడుపున్న యువతను, శ్రామిక ప్రజలను క్షీణ సాంస్కృతిక విలువలకు దాసోహం చేసి పెట్టుబడిదారులు యధేచ్ఛగా దోపిడీ, పీడనలను కొనసాగిస్తున్నారు. ఇంకానా, ఇకపై చెల్లదని చాటిచెప్తూ ప్రజావ్యతిరేక విధానాలను, ప్రజావ్యతిరేక సంస్కృతిని తిప్పికొట్టటానికి ప్రజానుకూల సాంస్కృతిక శక్తులు సమాయత్తమవ్వాల్సిందే.

**కవిత**

## ప్రాయశ్చిత్తం....

– ప్రశ్న

అభిశంసనీయమే ఎంకన్న లడ్డూ లో కల్తీ
మరి నా పుడ్డు సంగతేంట్రా తింగరి శాల్తీ

పసిగుడ్డుకు తాపుతున్న పాల సంగతేంటి?
ఉసురు నిల్పుకోనికేసుకున్న మందుగోలీల సంగతేంటి?

కూలి పోతున్న వంతెనల్లో ఉన్న సిమెంటు సంగతేంటి?
పార్లమెంట్లో బందుబెట్టి ఊరూరికీ మీరంపుతున్న కోలాల
కోలాటం సంగతేంటి?

గియన్నీ అసుంటవెట్టు

రోజుకో రాజకీయ యేశంతో మమ్మల్ని ఎర్రోళ్ళని చేస్తున్న
మీ సంగతేంటి?

ఎనబై ఏళ్ళ సంది మా ముత్తాతల నుండి మా మనవళ్ళ
దాకా మీ మాయలో పడి కొట్టుకుపోయి
తెల్లోడు మిగిల్చిన చిరుగుల గోచీ కూడా పోగొట్టుకున్నందుకు
మేమూ పడతన్నాం పాయశ్చిత్త దీచ్చ

## ఎల్ పునౌన్ డ్యాన్స్ ట్రూప్

గత 45 సంవత్సరాలుగా పాలస్తీనా సంస్కృతిని పరిరక్షిస్తూ, అభివృద్ధిపరుస్తూ వివిధ నృత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎల్ పునౌన్ డ్యాన్స్ ట్రూప్ (El Funoun Dance Troupe) ఇటీవల అంతర్జాతీయంగా ఒక పిలుపునిచ్చింది. దానిని క్లుప్తంగా PACBI అని అంటున్నారు. అంటే ఇజ్రేల్‌ను విద్యావిషయంగానూ, సాంస్కృతికంగా బహిష్కరించే కార్యక్రమం.

పాలస్తీనీయులతో కూడిన ఈ బృందం కొన్ని సాంస్కృతిక కార్యక్రమాల పరంపరను కొనసాగిస్తోంది. మూకుమ్మడి హత్యాకాండనూ, జాత్యహంకార అమానవీయతనూ, సాధారణ విషయాలుగా గుర్తించడాన్ని తిరస్కరించింది.

న్యూయార్క్ నగరంలో 2024 అక్టోబరు 10–14లలో ఒక గాజాపై దాడులను వ్యతిరేకించే సాంస్కృతిక కార్యక్రమాలతో కార్యశాలను ఈ సంస్థ నిర్వహిస్తోంది.

కథ

చైనా ప్రజారచయిత లూషన్ 88వ వర్ధంతి సందర్భంగా

# మా పాత యిల్లు

మూలం : లూషన్

అనువాదం : గౌరిశంకర్

**ఒక** శీతాకాలం ఇరవై సం॥ల క్రితం నేను వదిలిపెట్టిన మా పాత యింటికి బయలుదేరాను. పడవలో ప్రయాణిస్తున్నాను. మా యింటికి చేరుకునే ముందు నాకు పెద్దగా మనుషులెవరూ సంచరించని పల్లెలు దర్శన మిచ్చాయి. జీవం ఉన్న జాడ ఎక్కడా కనిపించడంలేదు. మనసు వ్యాకులతకు లోనయ్యింది.

యింటికి చేరుకున్నాను. అరె! ఇది మా పాత యిల్లులా లేదే! నాకు బాగా గుర్తుంది. మా పాత యిల్లు దీనికంటే అందంగా ఉండేది. పైకప్పు మీద మొలిచిన గడ్డిపరకలు గాలికి అటూ ఇటూ కదలాడుతున్నాయి. ఎన్నో తరాలను చూసింది ఈ యిల్లు. నిజంగా ఇల్లు మారిందా లేక నా మనసు మారిందా? ఔను! నా ఆలోచనలే మారాయి. ఈసారి ఎటువంటి భ్రమలూ లేకుండా వచ్చాను.

అదిగో మా అమ్మ! గుమ్మంలోకే ఎదురొచ్చింది. పక్కనే నా మేనల్లుడున్నాడు. అమ్మ నన్ను చూడగానే సంతోషంగా కనిపించినా తన విచారాన్ని బయటకు కనబడకుండా ప్రయత్నిస్తోందని అర్థమైంది. నా మేనల్లుడు ఇంతకుముందు ఎన్నడూ నన్ను చూసి ఉండకపోవడంతో నావైపు ఎగాదిగా చూస్తున్నాడు.

తీసుకుపోదగిన ఫర్నిచరు పేకేజీ చేసేసి వుంది. మిగిలించి అమ్మేయాలనుకున్నాము. “ఓ రెండ్రోజులు నువ్వు విశ్రాంతి తీసుకో, ఈలోగా మన బంధువులు కూడా వస్తారు. అందరినీ కలిసి వెళ్ళిపోదాం. మరిచేపోయాను రుంటూ వస్తానన్నాడు. నిన్ను చూడడానికి. ఇక్కడికి వచ్చిన ప్రతిసారీ నిన్ను అడుగు తుంటాడు” అంది అమ్మ.

“రుంటూ”! “ఆ పేరు వినగానే నా మనోఫలకంపై ఒక దృశ్యం ఆవిష్కృతమయ్యింది. నీలి ఆకాశంలో బంగరు రంగులో ప్రకాశిస్తున్న చంద్రుడు, సముద్రతీరంలోని అలలపై పడుతున్న వెన్నెల వెలుగు రేఖలు, కండ్లు చూడగలిగినంత మేరకు పరుచుకున్న ముదురు ఆకుపచ్చని రంగులో పుచ్చకాయలు, వాటి మధ్యలో ఓ పన్నెండేళ్ళ బాలుడు. మెడలో వెండిగొలుసు, చేతిలో ఒక పలుగుతో పందికొక్కుల్ని చంపడానికి వెతికే తీక్షణమైన చూపులు”.

నేను మొదటిసారి అతడిని కలుసు కున్నపుడు – అంటే ముప్ఫై సం॥ల క్రితం – బహుశా పది సం॥ల బాలుడతడు. అప్పటికి మా తండ్రిగారు జీవించే వున్నారు. మా యింట్లో ఏదో సంప్రదాయకమైన క్రతువు జరుగుతోంది. దానికి పెద్ద మొత్తంలో వంటలు చేయాలి. వంటపాత్రలు కావాలి. వాటినన్నిటినీ జాగ్రత్తగా కాపుకాయడానికి ఒక మనిషి అవసరమైంది. మా యింట్లోని పనివాడు ఆరోజు రావడానికి కుదరలేదు. అందువలన అతని కొడుకు రుంటూను పంపించాడు.

వాడు చాలా చురుకైన కుర్రాడు. నా వయసే ఉంటుంది. ఉచ్చులు పన్ని పక్షుల్ని పట్టేవాడు. అప్పటినుండి ప్రతి కొత్త సం॥ము రోజునా మేము కలిసేవాళ్ళం. ఆరోజు ఎప్పుడు వస్తుందా అని నేను ఎదురుచూసేవాడిని ఒక సం॥ము వాడు వచ్చాడని అమ్మ చెప్పింది. వాడికి సిగ్గు ఎక్కువ. వంటగదిలో ఒక మూలన బిడియంగా నిలబడి ఉన్నాడు. తలపై చిన్న ఫెల్ట్ హేట్ కూడా వుంది. మెడలో వెండి గొలుసు. నాతో మాత్రమే కలివిడిగా మాట్లాడేవాడు. అందువలన మేము మంచి స్నేహితులమయ్యాము.

అప్పుడు ఏం మాట్లాడుకున్నామో జ్ఞాపకం లేదుగానీ నాకు మాత్రం అతి చురుకుగా ఉండడం మాత్రం బాగా గుర్తుంది. ఇద్దరం సముద్రపు ఒడ్డుకు వెళ్ళి చేపలు పట్టేవాళ్ళం. నాకు అందమైన రంగురంగుల గవ్వలు తెచ్చి ఇచ్చేవాడు. నేను కూడా ఏవో బహుమతులు ఇచ్చేవాడిని. “నువ్వు వేసవిలో ఇక్కడికి వస్తే ఇంకా బాగుంటుంది. రకరకాల గవ్వలు దొరుకుతాయి. అంతేకాదు సాయంత్రం మా నాన్న పుచ్చకాయలను చూడడానికి వెళ్ళినపుడు నువ్వు కూడా రావచ్చు” అన్నాడు.

ఎందుకు, పుచ్చకాయలను ఎవరూ దొంగతనం చేయకుండా చూడడానికా? అని అడిగాను. దానికి వాడు చెప్పిన సమాధానం విని నాకు చాలా ఆశ్చర్యం వేసింది. “ఇక్కడ బాటసారులు ఎవ్వరైనా దాహం వేసి పుచ్చకాయలు తీసుకుంటే దానిని దొంగతనం అనుకోము” అన్నాడు.

నా పాత స్నేహితులందరి కంటే రుంటూ చాలా తెలివైనవాడు. వాడికి ఎన్ని విషయాలు తెలుసో!? బహుశా సముద్రం ఒడ్డున నివసిస్తూ ఉండటంవల్లనే కాబోలు. నాకూ, నా పాత స్నేహితులకూ మా ఇళ్ళ నాలుగు గోడల మధ్య నుండి కనిపించే ఆకాశం గురించి తప్ప వేరేమీ తెలియవు.

దురదృష్టవశాత్తు మేము కలుసుకున్న నెలరోజులకే రుంటూ వాళ్ళ ఊరు వెళ్ళిపోవాల్సి వచ్చింది. ఒకరినొకరు పట్టుకొని ఎంతగానో ఏడ్చాం. చివరికి వాళ్ళనాన్న వచ్చి వాడిని ఎత్తుకొని తీసుకువెళ్ళిపోయాడు. తరువాత కూడా వాడు నాకు రంగురంగుల గవ్వలు పంపించాడు.

ఇపుడు అమ్మ వాడి ఊసెత్తగానే ఈ మధురానుభూతులు నన్ను చుట్టుముట్టాయి. బాల్యం ఎంత మధురమైందో కదా!

ఎవరో ఫర్నిచరు కొనడానికి వచ్చారని అమ్మ బయటకు వెళ్ళింది. నేను, మేనల్లుడు మాట్లాడుకుంటున్నాం.

"ఓహో! అలా వెళ్లారన్నమాట" అంటూ అకస్మాత్తుగా ఒక గంభీరమైన స్వరం వినిపించింది. వెనక్కి తిరిగి చూద్దును కదా మా అమ్మ వయసులోనే ఉన్న ఒక పెద్దావిడ. నేను విస్తుపోయి చూస్తుండగా నన్నే మరిచిపోయావా, నీ చిన్నతనంలో నిన్ను ఎత్తుకొని పెంచాను" అంది. నాకేమీ గుర్తుకు రాలేదు. పోనీలే అంటూ ఆ మాటా ఈ మాటా చెప్పి పోతూ పోతూ మా అమ్మ చేతి తొడుగులు ఒక జత సంచిలో సర్దుకుని వెళ్ళిపోయింది. ఆ తరువాత ఇరుగుపొరుగువారూ, బంధువులూ మమ్మల్ని చూడడానికి వచ్చారు. వాళ్ళను పలుకరిస్తూనే కొన్ని వస్తువుల్ని పేకింగ్ చేసాను. అలా కొన్ని రోజులు గడిచిపోయాయి.

ఆరోజు చలి ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం భోజనం చేసేసి టీ తాగుతున్నాను. ఎవరో వచ్చిన సవ్వడి వినిపించి అసంకల్పితంగా వెనుకకు తిరిగాను. పరాకుగా ఎవరో అని అనుకుంటూ అంతలోనే ఒక్కసారిగా నిలబడి వచ్చిన వ్యక్తి దగ్గరకు వెళ్ళాను. చూద్దును కదా వచ్చింది రుంటూ. కానీ ఈ రుంటూ నేను గుర్తుపెట్టుకున్న రుంటూ కాదు. అప్పుడు ఎర్రగా ఉండేవాడు. ఇపుడు లావైన శరీరం, ముడతలుపడ్డ ముఖం, కండ్ల చుట్టూ నల్లని వలయాలతో నిస్తేజంగా ఉన్నాడు. మొరటుగా వున్నాడు. బహుశా సముద్రపొద్దున పనిచేయడం వల్లనేమో. ఒంటిపై దట్టమైన వస్త్రాలు లేనందున గజగజా వణుకుతున్నాడు. చేతిలో కాగితంతో చుట్టిన వస్తువు ఏదో ఉంది.

అనుకోకుండా బాల్యమిత్రుని చూసిన ఆనందంలో నాకు మాట రాలేదు.

"రుంటూ, నువ్వేనా?" అన్నాను. మా చిన్నతనంలోని అనుభవాల గురించి ఎన్నో మాట్లాడాలనుకున్నాను. కానీ మాటలు వస్తేనా?

సంతోషం, విచారం కలగలిసిన మొహంతో రుంటూ అక్కడే నిలబడి వున్నాడు. చివరికి ఎలాగైతేనేమి గౌరవం ఉట్టిపడుతున్న స్వరంతో "అయ్యా!" అన్నాడు.

ఆ పిలుపు వినగానే ఒక్కసారిగా నా శరీరం వణికింది. మాకు తెలియకుండానే మా మధ్య అంతరాలతో కూడిన దట్టమైన గోడ కట్టబడింది. ఏమీ మాట్లాడలేకపోయాను. "సుషాన్, వచ్చి అయ్యగారికి దండం పెట్టు!" అంటూ రుంటూ తన వెనుకే దాగివున్న ఒక పిల్లాడిని ముందుకు నెట్టాడు. ఆ అబ్బాయి ఇరవై ఏండ్ల క్రితం రుంటూ ఎలా ఉండేవాడో అచ్చం అలాగే ఉన్నాడు. కాకపోతే కాస్త బక్కగా, పాలిపోయిన మొహంతో ఉన్నాడు. మెడలో ఏ గొలుసూ లేదు.

"మా అయిదవవాడు. ఎన్నడూ బయటకు రాకపోవడంతో కొంచెం భయపడుతున్నాడు" అన్నాడు రుంటూ.

మా మాటలు విన్న అమ్మ నా మేనల్లుడిని తీసుకొని బయటకు వచ్చింది.

"మీరు రాసిన ఉత్తరం ఈ మధ్యనే అందిందమ్మా. అయ్య వస్తున్నారని తెలిసి చాలా సంబరపడ్డాను...." అంటున్న రుంటూ మాటల్ని మధ్యలోనే ఆపుతూ "చిన్నప్పటి నుండీ కలిసి మెలిసి తిరిగారు మీరిద్దరూ. ఇప్పుడేమిటి కొత్తగా గౌరవిస్తున్నావు. ఇంతకు ముందులా తమ్ముడూ అని అనే పిలువవచ్చుగా" అంది అమ్మ.

"అలా అంటారేమిటమ్మా! అప్పుడంటే నేను చిన్న పిల్లాడిని, ఏదో తెలియక అలా పిలిచేవాడివి. ఇప్పుడు కూడా అలా – తప్పు కదమ్మా" అంటూ రుంటూ మరలా తన కొడుకును "అయ్యగారికి దండం పెట్టు" అన్నాడు. సిగ్గువలన వాడు ఏమీ అనకుండా అలా ఉండిపోయాడు. "అందరూ కొత్త కదా, అందుకే అలా సిగ్గుపడుతున్నాడు" అంటూ అమ్మ నా మేనల్లుడిని పిలిచి సుషాన్‌ను తీసుకెళ్ళి ఆడించు" అని వాళ్ళిద్దరినీ బయటకు పంపింది.

రుంటూని కూర్చోమని నాలుగైదుసార్లు అమ్మ చెబితే సందేహిస్తూనే కూర్చున్నాడు రుంటూ. "అయ్యగారు క్షమించాలి. ఈ చలికాలంలో ఇంతకంటే ఏమీ ఇచ్చుకోలేను. ఈ కొద్దిపాటి బీన్స్ మేమే స్వయంగా పండించాం. తీసుకోండి" అంటూ తను తెచ్చిన కాగితపు పొట్లాం విప్పి ఇచ్చాడు రుంటూ.

"ఇంకేమిటి, ఎలా ఉన్నావు?" అని అడిగిన నాకు "ఏం బాగులే అయ్యా, మా ఆరవవాడు కూడా పనికివెళ్తున్నా మా కడుపులు నిండడం లేదు..... బతుక్కి భరోసా లేదు.... డబ్బులు చేతిలో పెడితే తప్ప ఎవరూ ఏ పనీ చేసేది లేదు.... ఎంత కష్టపడి పంటలు పండించినా అమ్ముకుందామనేసరికి రకరకాల పన్నులు.... అమ్మినా, అమ్మకపోయినా ఒకలానే ఉన్నాయి మా బతుకులు" అంటూ శిధిల శిల్పంలా కూర్చున్నాడు. అతని వేదన అంతా ముడతలుపడ్డ ముఖంలోనే కన్పిస్తుంది.

అత్యవసరమైన పని ఉండడంతో రుంటూ భోజనం చేసి వెళ్ళిపోయాడు. తరువాత నేనూ, అమ్మా రుంటూ చాలా ఇబ్బందుల్లో వున్నాడని అనుకున్నాం. అమ్మేయాలనుకున్న ఫర్నిచరులో అతనికి కావలసినవి ఉచితంగా ఇచ్చేయాలని అనుకున్నాం. రెండ్రోజులు తర్వాత వచ్చి అతనికి కావలసినవాటిని ఒక పడవలో వేసుకొని తీసుకెళ్ళాడు. ఈసారి కూడా మేము పెద్దగా మాట్లాడుకోలేదు.

మేము బయలుదేరాల్సినరోజు రుంటూ వచ్చాడు మాకు వీడ్కోలు చెప్పేందుకు. ఈసారి సుషాన్‌ను తీసుకురాలేదు. అయిదేళ్ళ పాపను తీసుకువచ్చాడు. మేము బోటు ఎక్కేసరికి సాయంత్రం అయ్యింది. అప్పటికి మా యింట్లో వున్న చిన్నా, పెద్ద, ముసలీ, ముతకా సామాన్లన్నీ కాళ్ళొచ్చి వెళ్ళిపోయాయి.

బోటు ముందుకు వెళ్తుంటే నదికిరువైపులా ఉన్న పచ్చని కొండలు, చెట్లూ, పైనున్న నీలాకాశం అన్నీ వెనక్కి వెళ్ళిపోతున్నాయి. మా యిల్లు కూడా వెనక్కి పోతుంది. నాకేమీ అనిపించడంలేదు.

"మళ్ళీ మనం ఇక్కడికి వస్తామా?" అన్నాడు నా మేనల్లుడు. "సుషాన్ నన్ను వాళ్ళింటికి రమ్మన్నాడు" రుంటూ ఊసు రాగానే నన్నూ, అమ్మనూ మరలా విచారం కమ్మింది.

నా చుట్టూ ఒక పెద్ద గోడ నన్నూ, నా మిత్రులనూ విడదీస్తున్నట్లనిపించింది. దిగులుగా ఉంది. ఒక ట్రెడ్‌మిల్లులా యాంత్రికంగా వుంది నా బతుకు. కానీ పిల్లలు అలా వుండరు, ఉండకూడదు. వాళ్ళు ఆనందంతో.... నిజమైన ఆనందంతో కూడిన కొత్త జీవితం జీవించాలి. రుంటూ కోరుకున్నవి అతని చేతికి అందే దూరంలోనే వున్నాయి. కానీ నాకు ఏమి కావాలో ఇప్పటికీ నాకు తెలియదు.

ఆశ ఉందనీ, లేదనీ కూడా చెప్పలేక పోతున్నాను. అది భూమిపై ఉండే పలు రోడ్ల కూడలి వంటిది. వాటికి మొదలూ, తుదీ వుండవు. కానీ మనుషులు చాలామంది నడక సాగిస్తేనే రోడ్డు అనేది ఏర్పడుతుంది.

రచనాకాలం : **1921** ✣

ధారావాహిక

దేశ విభజన వస్తువుగా సాహిత్యం, కళలు : 23

# భీష్మ సాహ్నీ '**అమృతసర్ ఆగయా**'; సయ్యద్ వాలియుల్లా '**ది ఎస్కేప్**', '**ఒక తులసి మొక్క కథ**'; నబేందు ఘోష్ '**గాంధీజీ**' కథల పరిచయం

- కొత్తపల్లి రవిబాబు

## భీష్మ సాహ్నీదే మరో కథ 'అమృత్‌సర్ ఆగయా'

'రైలు అమృతసర్ చేరింది' అనే ఈ కథను భీష్మ సాహ్నీ 1990లో రాశారు. విభజన తర్వాత పాకిస్తాన్‌లోని జీలం స్టేషన్ నుంచి అమృతసర్ మీదుగా ఢిల్లీ చేరే రైలులోని ముస్లిం, హిందూ ప్రయాణీకుల మనస్తత్వాలను ఈ కథ చిత్రిస్తుంది. కథకుడు కూడా ఈ ప్రయాణీకులలో ఒకడు. అతను 1947 ఆగస్టు 15 స్వాతంత్ర్యదిన వేడుకల్లో పాల్గొనడానికి జీలం నుండి ఢిల్లీ వెళ్తున్నాడు.

ఆ రైలులోని ఒక పెట్టెలో ఎక్కువమంది లేరు. కథకుడి ఎదురుగా కూర్చున్న సర్దార్జీ బర్మా యుద్ధంలో అనుభవాలు చెబుతూ, సైన్యంలోని తెల్లవారిని హేళన చేస్తూ, ఛలోక్తులు విసురుతూ నవ్విస్తున్నాడు. ముగ్గురు పఠాన్ వ్యాపారస్తులున్నారు. వారిలో ఒకడు పై బెర్తు మీద వున్నాడు. అతడు కథకుడి ప్రక్కన కూర్చున్న ఒక సన్నపాటి హిందూ 'బాబు' మీద జోకులు విసురుతూ సరదాగా వున్నాడు. ఈ హిందూ బాబు పెషావర్‌కు చెందినవాడు. కథకుడి కుడివైపు ఒక ముసలమ్మ పూర్తిగా దుప్పటి కప్పుకొని జపమాల తిప్పుకుంటోంది. ఇంకా ఇద్దరు, ముగ్గురు ప్రయాణీకులున్నారు అంతే.

'పాకిస్తాన్ వచ్చిన తర్వాత జిన్నా బొంబాయిలో వుంటాడా, పాకిస్తాన్‌కు వెళ్ళిపోతాడా' అని సర్దార్జీ పదే పదే అడగ్గా, కథకుడు 'జిన్నా బొంబాయిలోనే వుంటాడు. అప్పుడప్పుడు పాకిస్తాన్ వెళ్ళి వస్తుంటాడు' అని చెప్పాడు. లాహోర్, గురుదాస్‌పూర్ నగరాలు ఇండియాకి వస్తాయా, పాకిస్తాన్‌కి వస్తాయా అని ప్రజలు మాట్లాడు కుంటున్నారు. ఎన్నో చోట్ల మత కలహాలు, అల్లర్లు, హత్యాకాండ, దహనకాండ జరిగింది. అగస్టు 14, 15 తర్వాత అవి చల్లారిపోతాయి అనుకున్నారు.

ట్రైన్ జీలం స్టేషన్ వదలిపెట్టిన తర్వాత పై బెర్తు మీద కూర్చున్న పఠాన్ ఆహారపు పొట్లం విప్పి ఉడకబెట్టిన మాంసాన్ని, కూరని తన సహచరులకు ఇచ్చాడు. కథకుడి ప్రక్కన కూర్చున హిందూ బాబుతో ఒక మాంసం ముక్క తీసుకోమని చెబుతూ 'పప్పు మాత్రమే తింటే సన్నగానే వుంటావు. మాంసం తింటే మాలాగా బలిష్టంగా వుంటావు. అలా వుంటే నీ భార్య కూడా నిన్ను ఇష్టపడుతుంది' అని అనగానే మిగిలిన ప్రయాణీకులు నవ్వుతారు. అతడు పుష్తో భాషలో మాట్లాడి చిరునవ్వుతో తనకు మాంసం ముక్క వద్దని తల అడ్డంగా వూపుతాడు.

"మా చేతుల్తో అంటుకున్నది తీసుకోవడం అభ్యంతరమైతే నీ చేతుల్తోనే తీసుకో – అది మేక మాంసమే కాని వేరే ఏదీ కాదు" అని ఒకడూ, 'ఎవరూ చూడటంలేదులే. నీ భార్యతో చెప్పంలే. నీవు మా మాంసం ముక్కలు తింటే మేం నీ పప్పు తింటాం' అని మరొకడూ అతన్ని ఆటపట్టిస్తారు.

"మేము తింటుంటే నీవు చూస్తుండటం బాగాలేదు" అనీ, 'బాబూ! నీవు మాంసం తినకపోతే, ఆడవాళ్ళ పెట్టెలో ఎక్కాల్సింది' అనీ జోకులు వేస్తుండగా, ట్రైన్ వజీరాబాద్ స్టేషన్‌లో ఆగింది. అది కదిలే లోపల మంచినీళ్ళ కోసం దిగిన ప్రయాణీకులందరూ ఆదరాబాదరా ట్రైన్ ఎక్కేసారు. ప్లాట్‌ఫాం అవతలవైపు నుంచి ఎవరో ఈ పెట్టెలోకి ఎక్కడానికి ప్రయత్నిస్తున్నారు. 'ఇక్కడ చోటు లేదు. ప్రక్క పెట్టెలోకి పో' అంటున్నారు లోపల వున్నవారు. అయినా మురికి దుస్తులవాడొకడు పెట్టెలోకి ఎక్కుతాడు. తన పెట్టెను పైకి లాగుతూ, భార్యను, కూతురిని రమ్మనమని తొందరపెడతాడు.

'వాళ్ళను బయటకు నెట్టండి' అనే కేకల మధ్య లగేజిని పైకి లాగుతుంటే, భార్య, కూతురు కకూసుగది తలుపు దగ్గర నుంచుంటారు. 'నేను టిక్కెట్ కొనుక్కొన్నాను' అని అనడంతో అందరి నోళ్ళు మూతపడ్డాయి.

పై బెర్తు మీద పఠాన్ కాలితో ఆ మనిషిని తన్నబోతే, అది కాస్తా అతని భార్యకు తగులుతుంది. ఆమె బాధతో క్రింద కూలబడింది. ఆ మనిషి లగేజి అంతా లోపలికి చేరిన తర్వాత, పఠాన్ సహనం కోల్పోయి, అతని సామాను బయటకు తోసేస్తాడు.

పెట్టెలోని ముసలామె, పడిపోయిన స్త్రీని పిలిచి తన ప్రక్క చోటు చూపిస్తుంది. ఇంకా సగం సామాను బయటే వుంది. పెట్టెలో వున్న సామానంతా బయటకు విసిరేశాడు పఠాన్. బండి నెమ్మదిగా బయలుదేరడంతో ఎక్కిన ముగ్గురూ ఏడుస్తూ క్రిందకు దిగిపోయారు. ఇది చూసి ముసలామె ఈ పఠాన్లకు శాపనార్థాలు పెట్టింది.

కిటికీలోంచి బయటకు చూస్తే ఆ నగరం తగలబడటం కన్పించింది పెట్టెలోనివారికి. హిందూ బాబు మొఖం పాలిపోయింది. చెమటతో

శరీరం నిండిపోయింది. ప్రయాణీకులందరూ రెండు గ్రూపులుగా విడిపోయారు. క్రింద వున్న ఇద్దరు పఠాన్లు కూడా పైకి ఎక్కారు. సర్దార్జీ వచ్చి కథకుడి పక్కన కూర్చున్నాడు. వాతావరణం గంభీరంగా మారింది.

ఆ తర్వాత స్టేషన్ వచ్చేవరకూ అక్కడ అందరి చూపులూ ఇతరులను అనుమానిస్తూ వున్నాయి. కిటికీ తలుపులు దింపేసారు. బయట నుంచి రాళ్ళు వస్తే తగులుతాయని హిందూబాబు క్రింద దుప్పటి పరచి కొంతసేపు పడుకున్నాడు.

చీకటిలో రైలు ముందుకు సాగుతోంది. అది హర్బన్స్‌పురానిని దాటడం గమనించిన హిందూబాబు సంతోషంగా అరుస్తాడు. ఇంకా కాసేపటికి 'అమృతసర్‌కు వచ్చేశాం' అని తన సీటు నుంచి లేచి, పై బెర్తు మీద వున్న పఠాన్‌ను బూతులతో తిడుతూ కిందకి దిగి 'రారా' అని కోపంగా అంటాడు. 'హిందూ స్త్రీని తన్ని, ఈడ్చి క్రిందకు లాగేయడానికి ఎంత ధైర్యంరా నీకు' అని పఠాన్‌తో కొట్లాటకు దిగగా ముసలామె వారిని సర్దుతుంది.

ప్లాట్‌ఫాం అంతా గందరగోళంగా వుంది. అల్లర్ల విషయం మాట్లాడుకుంటున్నారు. కొందరు పఠాన్లు వచ్చి పెట్టెలోకి తొంగిచూసి, అక్కడ వున్న ముగ్గురినీ తమ పెట్టెలోకి తీసుకుపోతారు. ఎక్కడికో పోయి హిందూబాబు ఒక ఇనుప చువ్వ పట్టుకొని వచ్చాడు. దానిని రహస్యంగా తన సీటు క్రింద దాచాడు. పఠాన్ల కోసం చూస్తే వారు లేరు. 'వారినెందుకు పోనిచ్చారు?' అని విసుక్కుంటాడు.

పెట్టెనిండా కొత్త ప్రయాణీకులు ఎక్కారు. బాబు వచ్చి కథకుడి ప్రక్కన కూర్చున్నాడు. పఠాన్లు ఎక్కడికి పోయారని పదేపదే అడిగాడు. ప్రయాణీకులందరూ నిద్రావస్థలో వున్నారు.

రైలు ఇచ్చిన కుదుపుతో కథకుడు నిద్రలేచాడు. తెల్లవారవస్తోంది. ఎవరో తలుపు తీయమని తట్టుతున్నారు. ఒకతను ఫుట్‌బోర్డుపై నించున్నాడు. చంకలో ఒక సంచి. చేతిలో ఒక కర్ర వున్నాయి. ఒక స్త్రీ తలపై రెండు మూటలతో రైలుతోపాటు చాల కష్టంగా పరిగెడుతూ వుంది. ఆమెను త్వరగా వచ్చి ఫుట్‌బోర్డు పై నించోమని చెప్తున్నాడు. తలుపు ఎవరూ తీయకపోతే కిటికీలోంచి చేయిపెట్టి తలుపు హాండిల్ తిప్పాలని చూశాడు.

బాబు లేచి, 'చోటు లేదు. దిగిపో' అంటూనే తలుపు తెరిచాడు.

అది చూసి 'ఓ అల్లాహ్!' అన్నాడు ఆ మనిషి సంతోషంగా. వెంటనే బాబు తన చేతిలోని ఇనప కడ్డీతో వాడి తలపై బలంగా కొట్టాడు. అతను రెండు, మూడుసార్లు అల్లాను తలచుకున్నాడు. తనను ఎవరు ఎందుకు కొట్టారో అర్థం కాలేదు. చేతులు పట్టు కోల్పోయి మొదలు నరికిన చెట్టులా కిందపడిపోయాడు.

కథకుడు నిశ్చేష్టుడై ఇదంతా చూశాడు. బాబు తలుపు దగ్గరకు వెళ్ళి ఇనుపకడ్డీని బయటకు విసిరేశాడు. అతడు కథకుడిని గమనించలేదు.

తెల్లవారింది. సర్దార్జీ లేచి, బాబుతో 'నీవు ధైర్యవంతుడివి. పఠాన్లు నీ మూలంగానే ఈ పెట్టెలోంచి పారిపోయారు. ఒకవేళ వుంటే వారి తలలు బ్రద్దలుగొట్టేవాడివే' అన్నాడు.

బాబు కూడా ఒక భయంకరమైన చిరునవ్వు నవ్వి, సర్దార్జీ వంక కళ్ళార్పకుండా చూశాడు.

## సయ్యద్ వలియుల్లా కథలు రెండు

వలియుల్లా (Waliullah) చిట్టగాంగ్‌లో 1922 ఆగస్టు 15న జన్మించాడు. తండ్రి బ్రిటిష్‌వారి పరిపాలనలో జిల్లా మేజిస్ట్రేట్‌గా పనిచేశాడు. వలియుల్లా 1939లో మెట్రిక్యులేషన్, 1943లో డిగ్రీ పూర్తిచేశాడు. కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్రంలో ఎం.ఏ. చదువుతున్న వలియుల్లా చదువు, తండ్రి మరణంతో అర్థాంతరంగా ముగిసింది. 1945లో 'స్టేట్స్‌మన్' పత్రికలో సబ్ ఎడిటర్‌గా చేరి రెండేళ్ళు పనిచేశాడు. ఆ పత్రికలో మొదటి హైందవేతరుడతడే. తర్వాత 'కామ్రేడ్' అనే ప్రచురణ సంస్థనూ, 'కాంటెంపరరీ' (సమకాలీనం) అనే సాహిత్య సమీక్షాపత్రికనూ ప్రారంభించాడు. 1947 ఆగస్టులో రేడియో పాకిస్తాన్‌లో చేరాడు. ఆ తర్వాత దౌత్యశాఖలో వివిధ దేశాలలో పనిచేశాడు. ఆయన రాసిన కథలు, ఆయన విద్యార్థి దశలోనే (కలకత్తా) 'నయన్‌చారా' సంపుటిగా 1945లో వెలువడ్డాయి. 1971 అక్టోబర్ 10న తన 49వ యేటనే మరణించారు.

ఆయన నాలుగు నవలలు, మూడు నాటకాలు, రెండు కథా సంపుటాలు రచించారు. 1948లో రాసిన 'లాల్ సలు' (Lal Salu) 'వ్రేళ్ళు లేని చెట్టు' అనే నవల ఆయన రచనల్లో ప్రసిద్ధమైనది.

దేశ విభజన వస్తువుగా ఆయన 'ది ఎస్కేప్' కథను ఇంగ్లీషులోనూ, 'ఏక్ తీ తులసి గచ్చేర్ కహిని' (ఒక తులసి మొక్క కథ)ను బెంగాలీలోను రాశారు.

## 'ది ఎస్కేప్'

ఈ కథ 1950లో మొదటగా 'పాకిస్తాన్ పి.ఇ.ఎన్. మిస్సలేనీ 1'లో ప్రచురింపబడింది. విభజనకు ఒక ఏడాది ముందే కలకత్తాలో హింసాయుత చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ కథ ఒక ట్రైన్ కంపార్ట్‌మెంట్‌లో జరుగుతుంది. ఆ పెట్టెనిండా శరణార్థులు క్రిక్కిరిసి వున్నారు. పేరు పెట్టని కథానాయకుడు పెట్టెలో వున్న చిన్న బాలికతో స్నేహం చేయడానికి ప్రయత్నిస్తాడు. కాని అతని ప్రవర్తనా, మాట్లాడే విధానమూ ఆ అమ్మాయిని భయభ్రాంతులకు గురిచేస్తుంది. కంపార్ట్‌మెంట్‌లో వున్న ఇతరుల మాదిరిగానే, ఇతడూ పారిపోతున్నవాడే. జరిగిన విధ్వంసాన్ని, హత్యలను, లైంగిక దాడులను, అపహరణలనూ, చిత్రహింసలనూ, దహనకాండలను ప్రత్యక్షంగా చూచినవాడు. అతడి మనసులో అవి సుళ్ళు తిరుగుతూ వుంటాయి. ఆ చిన్న బాలిక కూడా, ప్రక్కనే వున్న వృద్ధుడిని తప్ప కుటుంబ సభ్యులందర్నీ పోగొట్టుకొన్న శరణార్థే! ఆ అమ్మాయికి ఏదో కథ చెప్పి ఓదార్చాలనుకుంటాడు. కథ చెప్పే క్రమంలో తాను చూసిన మారణకాండ దృశ్యాలను చైతన్య స్రవంతి శైలిలో గుర్తు తెచ్చుకుంటాడు. ఆ పెట్టెలో ఇంకా లావుగా వున్న

ఒక విలపిస్తున్న స్త్రీ, మౌనంగా రాయిలా మారిపోయిన మగమనిషి, చలనం లేని ఒక అమాయక యువతి కూడా వున్నారు.

ఆ అమ్మాయికి కథ చెప్పే క్రమంలో అతనిలో ముసురుకున్న విషాద అనుభవాలు అతని శరీరాన్ని మొద్దుబార్చాయి. వాక్కును కోల్పోయింది నాలుక. ఒక నిశ్చేష్ట స్థితిలోకి చేరాడు. తాను చూసిన దుర్భర దృశ్యాల జ్ఞాపకాల నుంచి దూరంగా పారిపోవాలనుకుంటున్న అతను రైల్వేస్టేషన్లో నరకబడ్డ అతని మిత్రుడి శవాన్ని చూసి మరింత చలించిపోతాడు.

పెట్టెలో వున్న వారందరూ మృత్యుహింసతో భయపడుతున్నవారు గనుక, తనను తాను ఒక బలవంతునిగా అనుకుంటూ, మనోస్థైర్యం కలవానిగా, అక్కడ వున్న బాలికలో భయం తొలగించడానికి ఒక కల్పిత కథ చెప్పాలని ప్రయత్నిస్తాడు. కాని ఏ కథా జ్ఞాపకం రాదు. అతని జ్ఞాపకాలలో కేవలం చంపుకోడాలు, శవాలు, రక్తస్రావ దృశ్యాలే వుంటాయి. కథ చెబుతూ చెబుతూ ఒక ఉన్మాదం ఆవహించగా రైలులో నుంచి దూకి చనిపోతాడు.

అతని జ్ఞాపకాలను కథలో ఏటవాలు అక్షరాలుగానూ, వర్తమాన కథను సాధారణ అక్షరాలుగానూ ముద్రించి పాఠకులకు చైతన్య స్రవంతి శైలిని రచయిత పరిచయం చేశాడు.

## 'ఒక తులసి మొక్క కథ'

కలకత్తా నుంచి తూర్పు బెంగాల్‌కు పారిపోయి వచ్చిన ముస్లిం శరణార్థుల కథ ఇది. వీరు కలకత్తాలో అత్యంత దుర్వాసన, మురికితో నిండిన నావికులుండే బ్లాక్‌మాన్ లేన్‌లో, బుక్ బైండింగ్ వారుండే బైతా ఖానాలో, పొగాకు వ్యాపారుల సయ్యద్ సాహెబ్ లేన్ లేక కమర్చి ఖాన్ సామ్‌లేన్‌లో వుండేవారు. తూర్పు బెంగాల్‌కు వచ్చిన ఈ శరణార్థులు – హిందూ యజమానులు ఖాళీ చేసిన విశాలమైన ఇల్లును ఆనందంగా ఆక్రమించారు. అది ఒక రెండంతస్థుల మేడ దాని ప్రక్కన ఒక తోట. ఆ ఇంటి తాళం పగులగొట్టి దానిలో స్థిరపడతారు. కొన్ని కుటుంబాలవారు తమ పిల్లా, జెల్లలతో....

వారిలో కొందరు ఆ ఇంటి విశాలమైన పెరడులో హిందువులకు పవిత్రమైన తులసి మొక్క, దాని కోసం కట్టిన దిమ్మ చూస్తారు. ఆ తులసి మొక్కకు నీళ్ళు పోసేవారు లేక వాడిపోవడానికి సిద్ధంగా వుంది. ఆ ఇల్లు హిందువులది. ఇప్పుడు ఆక్రమించినవారు ముస్లిములు. ఆ తులసి మొక్కను మొదట చూసినవాడు దానిని పీకేయాలనుకుంటాడు. ఒకరేమో తులసిమొక్క ఆరోగ్యానికి మంచిది. పీకవద్దు. మనమేమీ పూజలు చేయడంలేదుగా అంటాడు. వారిలో కొందరేమో రోజూ ఉదయం, సాయంత్రం ఆ మొక్కకు నీళ్ళుపోసి పెంచిన ఇల్లాలును తలచుకుంటారు. వారిలో వున్న ఒక రైల్వే కార్మికుడు, ఆ ఇల్లు విడిచి వెళ్ళిపోయిన కుటుంబంలోని ఆ స్త్రీ ఇండియాకు వెళ్ళే ట్రైన్‌లో కిటికీ ప్రక్కన కూర్చుని, కన్నీళ్ళు కారుస్తూ తన తులసి మొక్కను తలచుకుంటూ వుండవచ్చని వూహించుకుంటాడు. రోజూ దానికి నీళ్ళు పోయడంతో అది మరలా పచ్చగా మారింది.

ఈ ఇంటిని వదలినవారూ, ఈ ఇంటిని ఆక్రమించినవారూ – ఇద్దరూ శరణార్థులే! ఎవరి సొంత వూర్లు, ఇళ్ళు వదలి తెలియని ఏదో ఒక ప్రదేశానికి వలస వెళ్ళినవారే.

మొదట ఈ ఇంటిని ఆక్రమించిన సమయంలో పోలీసులు వచ్చి అభ్యంతరపెట్టారు. దానిపై శరణార్థులు తాము ఇంకెక్కడకు పోతామంటారు. పోలీసులు మెత్తబడి పై అధికార్లకు అంతుబట్టని విధంగా నివేదిక పంపుతారు. కలకత్తాలోని ఇరుకు సందులలో, మురికి కూపాలలో బతికిన వీరు, ఇప్పుడు విశాలమైన ఆవరణ, మామిడితోట వున్న రెండంతస్తుల మేడలో స్థిరపడి మంచి గాలి పీల్చుకుంటూ ఆనందంగా వుంటుంటారు.

అప్పుడు పైన చెప్పిన తులసి మొక్క ఉదంతం వస్తుంది. దానిపై మాతిన్, యూనస్, అమ్జాద్, మక్సూద్, కాదెర్, మొదబ్బర్, ఇనామత్‌లు చర్చోపచర్చలు చేస్తారు. మొదబ్బర్ ఐతే ఆ తులసి మొక్క నవనవలాడుతూ పెరగటం చూసి కోపంతో తన చేతిలో వున్న వెదురు కర్రతో దానిపై ఒక వేటు వేస్తాడు. కాని ఆ దెబ్బ తులసికి తగలదు. మొత్తంమీద వారందరూ దాన్ని మరచిపోతారు. కాని వారిలో ఎవరో రహస్యంగా దాని చుట్టూ వున్న కలుపు మొక్కలు పీకేసి నీళ్ళు పోస్తుంటారు.

ఒకరోజు మళ్ళీ పోలీసులు వచ్చారు. 'ఈ ఇల్లు ప్రభుత్వం తీసుకుంది. మీరు ఎవరి అనుమతీ లేకుండా ఆక్రమించారు. ఇరవై నాలుగ్గంటల్లో ఖాళీ చేయాలి' అన్నాడు పోలీసు అధికారి.

అందరూ పోలీసుల చుట్టూ చేరారు. ఏది ఏమైనా ఖాళీ చేసే ఉద్దేశంలో లేరు. ఒకవేళ బలవంతం చేస్తే వారి శవాలే బయటకు పోతాయన్నారు.

మర్నాడు మొదబ్బర్ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళి ఖాళీ చేయాల్సిన సమయాన్ని ఇరవై నాలుగు గంటల నుండి వారం రోజులకు పొడిగించిన అనుమతి తెచ్చాడు. పదోరోజున అందరూ ఆ ఇల్లు విడిచి వెళ్ళారు. ఒక తుపాను లాగా వచ్చారు. అలాగే వెళ్ళారు. వారు వదలి వెళ్ళిన పనికిరాని వస్తువులు వారి జ్ఞాపకంగా మిగిలాయి.

పెరడులోని తులసి మొక్క మరల వాడిపోవడం ప్రారంభించింది. దానికి నీళ్ళుపోసే నాథుడు లేడు. ఆ మొక్కను పెంచి పూజించిన ఇల్లాలి కన్నీళ్ళు ఎవరికీ జ్ఞాపకం రావు.

ఇలా ఎందుకు జరిగిందో తులసి మొక్కకు తెలియదు. ప్రజలే అర్థం చేసుకోవాలి.

## నబేందు ఘోష్ కథ 'గాంధీజీ'

నబేందు ఘోష్ (27.3.1917 – 15.12.2007) బెంగాలీ రచయిత 1939–45 మధ్య ఉదయశంకర్ శైలిలో నృత్య ప్రదర్శనలిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో 1944లో ప్రభుత్వ ఉద్యోగం పోయింది. విభజన సమయంలో కలకత్తా చేరారు. తూర్పు పాకిస్తాన్‌లో ఉర్దూను అధికార భాషగా చేసి, అక్కడి ప్రభుత్వం బెంగాలీ సాహిత్యాన్నీ, చలనచిత్రాలనూ నిషేధించింది. దానితో ఆయన 1957లో బిమల్‌రాయ్‌తో కలసి కలకత్తాలో న్యూ థియేటర్స్ స్థాపించాడు. ఆ

తర్వాత బొంబాయిలో బాంబే టాకీస్ సంస్థలో చేరాడు. అలా బాంబే టాకీస్‌కు వచ్చినవారిలో హృషికేశ్ ముఖర్జీ, అసిత్‌సేన్, పాల్ మహేంద్ర, కమల్‌బోస్, సలీల్ చౌదురి వున్నారు.

కరువు, మతకల్లోలాలు, దేశ విభజన మొదలగు అంశాలపై 26 నవలలు, 14 కథా సంపుటాలు రాశారు. 18 చలనచిత్రాలకు స్క్రీన్ ప్లే రచయితగా, 5 చలన చిత్రాలకు దర్శకునిగా వున్నారు.

'గాంధీజీ' కథను బెంగాలీ నుండి ఇంగ్లీషులోకి నబేందుఘోష్ కుమార్తె రత్నోత్తమసేన్ గుప్తా అనువదించారు. దానిని ఏప్రిల్ 14, 2023 బోర్డర్‌లెస్ జర్నల్ డాట్‌కామ్ ప్రచురింపబడింది.

సాయంకాలమైంది. చీకటి రాబోతోంది. రతన్ బయటకు వెళ్ళడానికి సిద్ధమౌతున్నాడు. 'తాగడానికేనా?' అని భార్య యశోద అడుగుతుంది. గబగబా నడుచుకుంటూ చేపలమ్మే మిత్రుడు జతీన్ ఇంటికి చేరతాడు. జతీన్ భార్య కొన్నేళ్ళ క్రితం చనిపోయింది. అతనూ, అతని అమ్మ వుంటున్నారు. జతీన్ ఇంటికి మిత్రులంతా చేరతారు హారు, పోట్లా, జగా, రాధు ఇంకా కొందరు. మాంసం తింటూ, మద్యం, సిగరెట్లు తాగుతూ పేకాట ఆడుతుంటారు.

పట్టణంలోని సంపన్నులు రతన్ ముఠాకి డబ్బులిచ్చి, హిందువుల, హిందూ స్త్రీల గౌరవాన్ని రక్షించే బాధ్యత ఇచ్చారు. 1946 ఆగస్టు 16న ప్రత్యక్ష కార్యాచరణ దినం జరిగిన తర్వాత ఆగస్టు 15 వరకూ అల్లర్లు చెలరేగుతూ వున్నాయి. కాని అకస్మాత్తుగా కొట్లాడుతున్న ఇరువర్గాలూ మిత్రులైపోయారు. దానితో ఈ ముఠాకి పనిలేకుండా పోయింది.

గాంధీజీ వచ్చి బెలియా ఘాటాలో కూర్చున్నాడు. శాంతి నెలకొనేంత వరకు ఉపవాస దీక్ష చేస్తూ అక్కడే వుంటానన్నాడు. దీనితో రతన్ ముఠాకు తాగడం, వ్యభిచార కొంపలకు పోవడం సోలుతూ, తూలుతూ బొంగురు గొంతుతో పాడటం కార్యక్రమంగా వుంది.

ఒకరోజు పీకలదాకా తాగి, మాంసం ముక్కలు తిని, వళ్ళంతా పులుసూ, కూర ముక్కలు పడిన మరకలతో, చేతులు కడుక్కోకుండా వదలడం ప్రారంభించారు. వారి సంభాషణ సారం ఏమిటంటే ఈ గాంధీ ముస్లిం ఏజెంటనీ, హిందువులకు, బెంగాలీలకు శత్రువనీ, ముస్లిములు వేరే దేశం కావాలంటానికి కారణం గాంధీయేననీ, ఇప్పుడు విభజన ఎట్లాగూ జరిగింది కనుక ఇది హిందుస్తాన్ అనీ, ఆఖరి ముస్లిం వరకు నరకాల్సిందేనని, ఈశ్వర్‌కీ, అల్లాకీ సఖ్యత కుదురుస్తానంటున్నాడనీ, రేపటి కార్యక్రమం నిశ్చయమైందనీ అనుకుంటారు.

'రేపు మళ్ళీ అల్లర్లు ప్రారంభమౌతాయన్నమాట. మంచి వార్త' అనుకుంటారు. కసాయి దుకాణ యజమాని ఐన రతన్‌కి శాంతియుత వాతావరణం చికాకు కల్గిస్తోంది. అతడు రక్తపిపాసి. ఎన్నో మేకలను, గొర్రెలను నరికాడు. కాని బతికివున్న మనిషిని చంపడంలో వున్న మజా వేరు.

మొదటిరోజు ఒక మనిషిని కత్తితో పొడిచాడు. రోజూ ముస్లిముల కొరకు వెదికి వారిని చంపుతూ సంతోషించేవాడు. ఒకరోజు మధ్యాహ్నం జరిగిన సంఘటన అతనికి కలగా గుర్తుంది.

బిపిన్ టీ స్టాల్ దగ్గర టీ త్రాగుతుండగా, ఒక ముస్లిం యువకుడిని లాక్కొచ్చి కుర్రాళ్ళు ఇతనికి అప్పచెప్పారు. ఇతని విషయం నీవే తేల్చాలి. మేం అలసిపోయాం అన్నారు. ఆ కుర్రాడు నేను హిందువుని అని అరుస్తున్నాడు. రతన్ అతన్ని పక్కకు తీసుకువెళ్ళి, మర్మాంగాన్ని చూసి హిందువేనని రూఢి పరచుకుని అతన్ని వదిలేశాడు.

తర్వాతరోజు ఉదయం అల్లర్లు ప్రారంభమయ్యాయి. హిందువులు దూకుడుగా ముస్లిములపై పడ్డారు. రతన్ ఒక రౌండ్ పూర్తిచేసి ఇంటికి చేరగా భార్య యశోద కోప్పడుతుంది. 'చంపేస్తాను అంటాడు' బయట ఎవరూ దొరక్కపోతే నీ రక్త పిపాసతో నన్ను చంపుతావని తెలుసు' అంటుంది.

జ్వాల రగిలించడం ఎంత తేలికో అనుకుంటారు మిత్రబృందం. అయితే శాంతియుత వాతావరణం కోసం గాంధీ ఉపవాసం ప్రారంభించాడని తెలుసుకుంటారు. 'చావనీ! ఈ ముసలోడే ముస్లిములను బుజ్జగిస్తున్నాడు' అంటాడు రతన్. 'రా! బయట పని వుంది' అని మిత్రుడు పిలుస్తాడు.

ఇద్దరూ బయటకు వెళ్ళి ఒక మురికివాడ తగలబెట్టారు. ఇంటికి రాగానే యశోద – 'గాంధీని చంపుతావా? నీవు చేసే హింస ఆపవా?' అని అడుగుతుంది.

'ఆ! ఏమౌతుంది గాంధీని చంపితే'

'ఏమిటీ! నీవు మనిషివేనా? ఋషిలాంటి గాంధీని చంపుతావా? నరకంలో కుళ్ళిపోతావు. అక్కడ అగ్నిగుండంలో పడేస్తారు నిన్ను!'

'నోర్ముయ్' అన్న రతన్‌కు ఆరోజు రాత్రి నిద్ర పట్టలేదు.

'ఎవరీమనిషి! నేను ముస్లిములను చంపితే ఆమరణ నిరాహారదీక్ష చేస్తాడేమిటి? ఆయన దేశానికి ఎంతో సేవ చేశాడు. స్వతంత్రం వచ్చింది దేశానికి ఇతని మూలంగా అంటుంటారు. కాని ముస్లిములను బుజ్జగిస్తాడేమిటి? పంజాబ్‌కు పోయి అక్కడ అల్లర్లు ఆపవచ్చుగదా! కపటి! చావనీ!' అనుకుంటాడు.

తర్వాతరోజు కూడా అల్లర్లు కొనసాగాయి. గాంధీజీ ఇవాళో రేపో చనిపోయే పరిస్థితికి వచ్చాడు. ఆరోజు వర్షం కొంత తెరపి ఇచ్చిన తర్వాత రతన్ బయటకు వెళ్లి అక్కడక్కడ గుమిగూడిన ప్రజలు విచారంగా చర్చించుకోవడం గమనించాడు. అందరూ గాంధీని కొలుస్తున్నారు. బ్రిటీషురాజు కూడా భయపడ్తున్నాడు ఆయనంటే. ఒకసారి వెళ్ళి చూసి వద్దాం అని ఆరోజు సాయంత్రం బెలియా ఘాటా వద్దకు వెళ్తాడు. అక్కడ అర్ధనగ్నంగా, ఖద్దరు పంచె కట్టుకుని, ముఖం నిండా తేజం నింపుకున్న గాంధీని చూస్తాడు. అతనిలో ఉదయించే సూర్యుణ్ణి చూచిన భావం కల్గింది. అతనిలో ఒక పెద్ద భూకంపం వచ్చినంత చలనం! ఇప్పుడు గాంధీ చాలామంది చెబుతున్నట్టు మరుగుజ్జు కాదు. హిమాలయమంత ఎత్తైన ఉన్నత వ్యక్తి! అశాంతి నిండిన మనసుతో జతీన్ ఇంటికి పోయి త్రాగుతాడు. గాంధీని చూసి వచ్చానని చెబుతాడు. సరేలే! ఒకటి రెండు రోజుల్లో అతను చనిపోవచ్చు. ఈ రెండు రోజుల్లో మిగిలినవారి పనిపడదాం!' – రతన్ తూలుకుంటూ ఇంటికిపోయి యశోద తిట్లు తింటూ నిద్రపోతాడు.

మర్నాడు హింస మరింత ప్రజ్వరిల్లింది. స్టెన్ గన్నులతో ఇళ్ళ పైకప్పుల నుండి ముస్లిముల సంతలోకి కాల్పులు చేశారు. మధ్యాహ్నానికి

ప్రశాంత పరిస్థితులు ఏర్పడ్డాయి! పోలీసులు లౌడ్ స్పీకర్లో అల్లర్లు ఆగకపోతే గాంధీజీ మరణిస్తాడు. అల్లర్లు ఆపండి అని చెబుతున్నారు. శాంతిప్రియులు ఊరేగింపులు చేస్తున్నారు. క్రమంగా హింస తగ్గుముఖం పట్టింది.

సాయంత్రానికి రతన్ మిత్రులు కలుస్తారు. రతన్‌కు పదేపదే గాంధీ జ్ఞాపకం వస్తుంటాడు. దేశంలో ప్రజలంతా 'మహాత్మా గాంధీకి జై' అంటున్నారు కదా అని ఆలోచిస్తున్న సమయంలో మధు వచ్చి – 'రండి! రండి! మనకొకడు దొరికాడు!' అని పిలుస్తాడు.

అతడొక నడివయసు ముస్లిం. మంచానబడ్డ కొడుక్కి మందులు కొనుక్కోడానికి బయటకు వచ్చాడు. రతన్ ఇప్పటికి పాతికమందిని చంపాడు. ఇతన్ని కూడా తన ఖాతాలో వేసుకోవాలనుకున్నాడు. 'గాంధీజీ ప్రమాదకర పరిస్థితిలో వున్నాడు' అంటూ లౌడ్ స్పీకర్ నుంచి వినబడుతున్న ప్రకటన రతన్‌ను అల్లకల్లోలం చేసింది. 'గాంధీజీ ప్రాణం మీ చేతుల్లో వుంది. మీరు హింస ఆపకపోతే, గాంధీజీ చనిపోతాడు' అంటూ దూరంగా వినబడుతోంది ప్రకటన!

వీళ్ళేమో రతన్ ఎపుడు ఆ ముస్లింని చంపుతాడా అని ఎదురు చూస్తున్నారు. 'నన్ను చంపడమంటే, గాంధీని చంపడమే! నా కోసం కాదు. గాంధీజీ కోసం నన్ను వదిలేయండి' అని ఆ ముస్లిం అంటుంటే రతన్ ఎందుకాలస్యం చేస్తున్నాడో సహచరులకు అంతుబట్టదు.

'నేను ఇతన్ని వదిలేస్తున్నా! కాదు కూడదంటే ముందు నన్ను చంపి అతన్ని చంపండి' అని, అతన్ని తీసుకొని ప్రమాదం లేని చోట వదిలి ఇంటికి పోతాడు రతన్.

రాత్రంతా గాంధీజీ ఉన్నత వ్యక్తిత్వం అతనికి ప్రత్యక్ష మౌతుంది. 30 కోట్లమందికి ప్రేమపాత్రుడు. తెల్లారగానే తన వద్ద వున్న మారణాయుధాలన్నీ మూటగట్టి యశోద నిద్ర లేవకముందే ఆ మూట తీసుకొని బయటకు వెళ్ళాడు. తూర్పు వైపుగా బలియా ఘటాకు నిరాహార దీక్ష చేస్తున్న సూర్యుడి లాంటి తేజోవంతుడైన గాంధీ ప్రోలవాలి, ఉపవాసాన్ని ఉపసంహరించమని అడగటానికి వెళ్ళాడు.

**(గాంధీజీ 1947 సెప్టెంబర్ 1 నుండి 4 వరకు కలకత్తాలో హైదిరిమంజిల్‌లో బెంగాల్‌లో జరిగిన మత మారణ హోమానికి నిరసనగా హిందూ–ముస్లిం ఐక్యత కోరుతూ 73 గంటలసేపు నిరాహార దీక్ష చేశారు. ఆ సందర్భంగా రాసిన కథ ఇది. స్వాతంత్రోద్యమ కాలంలో గాంధీ సామ్రాజ్యవాద అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలనే అవలంబించాడు. ఈ కథలో అప్పటి సామాజిక, రాజకీయ పరిస్థితులతో పాటు వలస పాలకులు గాంధీ ప్రవచించిన "శాంతి" ముసుగును ఎలా వాడుకున్నారో తెలియచేస్తూంది.)**

(వచ్చే సంచికలో ఇక్రముల్లా రాసిన రెండు నవలికలు
"రిగ్రెట్", "ఔట్ ఆఫ్ సైట్")




వ్యంగ్య రచన

# సమ్మిళిత వృద్ధికి జై! దోపిడీ వ్యవస్థ వర్ధిల్లాలి!!

ప్రొఫెసర్. తోట జ్యోతిరాణి

**సమానంగా** ఉండుడేంది? చేతికి వేళ్ళు అన్నీ సమానంగా వున్నయా? అసమానతలు పెరిగితే ఏమైతది? ఉన్నోళ్ల దగ్గర పైసలు ఇంకా ఇంకా జమైతేనే గద కొంతమంది కోటీశ్వరులయితరు. గప్పుడే ప్రపంచ కుబేరులలో మన జాగా పదిలం అయితది. ఇది మనందరికీ ఎంత గొప్ప. బానిసలు లేకపోతే అద్భుతమైన రోమ్ నగరాన్ని కడ్తమా? అని ఆనాడే అరిస్టాటిల్ చెప్పిందాన్ని యాదిమర్సింంద్రా ఏంది? దోపిడీ వ్యవస్థ బలపడతాంది అంటరు. ఆర్థిక అసమానతలు పెరుగుతానయి. బతుకుతెరువులు పోతానయి దొరుకుతలేవు అంటరు. జనం ఆగమాగం అయితాంద్రు అని గిట్టనివాళ్ళు, సామ్రాజ్యవాదులు నీలాపనిందలు వేస్తనే ఉంటాంద్రు.

తిండి దొరుకుతలేదు. ఆకలి బాధ పెరిగింది అంటాంద్రు. గాని, అది అపద్దమే. మన ఆర్థిక మంత్రి కూడా ఈ విషయాన్ని గట్టిగా చెప్పవట్టే. వస్తు సేవల పన్ను వసూళ్లు పెరుగుతనే వున్నయి. పేదోళ్లు, మధ్య తరగతోళ్ళు దినాం వాడే వస్తువుల మీద ఎక్కువ పన్ను రేట్లున్నా కొంటనే వున్నరుగదా. పన్నులు కడతనే వున్నరాయె. ధరలు ఆకాశాన్నంటుతున్నా, రోజూ వాడుకునే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఎంతకంతకీ పెంచుతనే వున్నా జనం కిక్కురుమంటలేరు. జనమంతా మంచిగ బతుకుతాంద్రని చెప్పనీకి ఇంకేం గావాలె.

లాభాలను సంపాదించుకుంటే దోపిడీ/లూటీ అనుడు, ఆర్థికవేత్తలు బూటకం అనుడు కరెక్టేనా? లాభాల కోసమే కదా ఎవరైనా పనిచేస్తరు. కార్పొరేట్ల లాభాలు పెరగటానికి ప్రభుత్వం మస్తు చర్యలు తీసుకుంటాంది. ఇంత మంచి పని చేస్తావుంటే దళారీ ప్రభుత్వం అని తప్పుపట్టుడేంది? ఒక్క ముచ్చట వినుండ్రి. నాలుగు లేబర్ కోడ్‌లను తేబట్టే, రోజూ పనిగంటలను పెంచింది. రోజుకూలీని తగ్గించింది. పనిచేసెటోళ్ల హక్కులను, సంక్షేమాన్ని రద్దు చేసింది. గిది తప్పా? ఈ మార్పు వల్లనే గదా చాలా చోట్ల అంతమందికి పని దొరుకుతాంది. ఒక వ్యాసం లెక్కలతో చెప్పిందా, లేదా?

దోపిడీ పెరుగుతాందని, జనం అన్యాయమైపోతున్నారని అంటరు గాని, ఏకరువు పెడుతున్న చిక్కులల్ల ఎంత ఫాయిదా వున్నదో? మస్తు మందికి పనులు దొరుకుతానయి. బతుకుతాంద్రు. గివన్నీ సమ్మిళిత వృద్ధికి తొవ్వలే గదా. గౌరవప్రదం, హుందా, హక్కులు, శ్రేయస్సు ఏనాడో కాలం చెల్లిన మాటలైపాయె. గవర్నమెంట్ ఎవరికి చేతనైనంత వాళ్ళు సంపాదించుకోమంటుండే. స్వేచ్ఛగా దోచుకోమంటుండే. కార్పొరేట్లకు బోల్డన్ని లాభాలు రావాలని మస్తు చట్టాలను సవరిస్తాంది, రద్దు చేస్తాంది. ప్రభుత్వం గిదంతా చేస్తాంది. తప్పా?

ధనవంతుల దగ్గర మస్తు మస్తుగా డబ్బు పోగైతేనే మనందరికీ మంచిది. గీ ముచ్చటతో అర్థమైద్ది చూడు. సంబరాలు, ఆడంబరాలు, విలాసాలు, విందులు ఫంక్షన్లు మస్తుగ పెరుగుతానే వున్నయి కదా! మెరిసిపోయేటట్లు చేసుకోవాలి. అదే గ్రేట్. రాజుల కాలంనాటి పల్లకీలు, చెలికత్తెల డాన్సుల్లాగా చీర్ గర్ల్స్ డ్యాన్సులు, క్యాట్ గా తయారు కావడం, వీటన్నింటినీ తప్పు అనటమే పెద్ద తప్పు. పెళ్లిల పల్లకిలో పెళ్లి కొడుకు, పెళ్లికూతురును తీసుకొస్తరు. ముందట, పది, ఇరవైమంది ఆడపిల్లలు షోకు చేసుకొని పూలు చల్లుకుంట డాన్సు లేస్తరు. వీటన్నిటి కోసం ఈవెంట్ మేనేజరు వుంటడు. ఇట్లా మస్తు మందికి పని దొరుకుతది. వీటన్నిటికీ ఎంతో పెద్ద నెట్వర్క్ వుంటది. ఏ సంబరం అయినా, అందరూ స్టేజ్ మీద డాన్స్ లేస్తున్నరు. ఎంతమంది కొరియోగ్రాఫర్లకు పనులు దొరుకుతున్నయో! వండి, వార్చి, వడ్డించటానికి డ్రెస్ కోడ్‌లతో బోల్డంత మంది పనిచేస్తరు. స్టేజీ డెకరేషన్, పూలసందడి వేరే. ఇక్కడితో ఆగదు. గొడుగులేసుకుని, డ్రోన్లతోటి ఫోటోలు, వీడియోలు తీయటం వుంటది. డబ్బున్నోళ్లు గిన్ని ఫంక్షన్లు చేసుకుంటనే గదా మస్తు మందికి పనులు దొరుకుతయి. డబ్బులున్నోళ్ళకు లేనోళ్ళకు మధ్య అంతరాలు పెరిగితేనే గద ఈ పనులు జనానికి దొరికేది.

ఇంత పెద్ద సంబరాలకు పోయే ఆడపిల్లలు అందంగా కనిపించొద్దా! బ్యూటీషియన్లు కావాలి వీళ్లకు షోకు చేయటానికి. బ్యూటీషియన్లకు, బ్యూటీ పార్లర్లకు ఎంత గిరాకి పెరిగిందో!

స్టేజీ మీద వున్నోళ్లను రక్షించడానికి బౌన్సర్లు కావాలి. సంపన్నులను నిరంతరం కాపాడాలి. వాళ్ళ సంపదను కాపాడాలి. కంపెనీలల్ల, పెద్దపెద్ద మాల్స్‌ల సెక్యూరిటీ గార్డులు కావాలి. గందుకే గవర్నమెంట్ అగ్నివీర్‌లకు ట్రైనింగ్ ఇస్తనంటున్నది. నాలుగు సంవత్సరాలు డిఫెన్స్‌లో పనిచేసినంక వాళ్లకు స్వేచ్ఛ దొరుకుతది. సెక్యూరిటీ గార్డులుగా పనిచేసుకొని 'హాయిగా' బతకొచ్చు. గిదంతా గవర్నమెంట్ ముందుచూపు కాదా!

ఇగ పూజార్లకు, వాళ్ళముత్తయిదులకు, తీరొక్క పూజ సామాన్లకు గిరాకీ పెరుగుతనే వున్నది. ఎక్కడబడితే అక్కడ పూజ సామాన్ల దుకాణాలు పెట్టుకోవచ్చు. అంటే జనానికి పనులు దొరుకుతానయి కదా! అయ్యగార్లకే కాదు, వాళ్ళ ఆడోళ్ళకు కూడా మంచి గిరాకీదొరికితే

ఇది “మహిళా సాధికారత” కాదా! సంప్రదాయం, సాధికారత రెండూ వచ్చినయి. పూజారి ముత్తయిదు ఆడవాళ్ళతో “మణిద్వీప వర్ణన”ను చదివించాలి. “కైలాస లోకం” పైన మణిద్వీపం వుంటది. ఇది నిజం. దాని గురించి పూజర్ల ఆడోళ్లు చదివితే మస్తు మంచి జరుగుతది. మస్తు పుణ్యం వస్తది. గందుకే గవర్నమెంట్ ప్రజల గురించి, సంక్షేమం గురించి పట్టించుకొనుడు బంద్ చేసింది. ఇంకా, సన్నాయి, బ్యాండ్ మేళం, బరాతులు, టపాసులు కాల్చడం. అబ్బో.. ఎన్నెన్ని సంబరాలు వచ్చినయి. అంతమందికి పనులు దొరుకుతానయి. ఉన్నోళ్ల ఆస్తులు పెరిగితేనే కద, ఎంతోమందికి పనులు దొరుకుతానయి. మంచిగా బతుకుతాంద్రు. అసమానతలు పెరగాలి. విలాసాలు, విందులు, ఆర్భాటాలు, సంబరాలు, ఫంక్షన్లు పెరగాలి. గివన్నీ బతుకుతెరువుకు, అందర్నీ అభివృద్ధిలో కలుపుకుపోవటానికి తొవ్వలే.

పబ్‌లను, పబ్ కల్చర్ పెరిగిపోతాందని తప్పు పట్టడం కరెక్ట్ కాదు. పబ్ లు వట్టిగనే నడుస్తయా? రకరకాల తిండ్లు, లిక్కర్లు, చెవులు గిల్లుమనే డిజె మ్యూజిక్కులు, డాన్సులు, తాగి గొడవ చేస్తే ఆపటానికి బౌన్సర్లు, పహిల్వాన్ దాదాలు, సర్వ్ చేయటానికి, పూడ్వటానికి, తుడవటానికి, వండటానికి బోల్డంత మందికి పనులు దొరుకుతయి. మద్యంలానే డ్రగ్స్ కూడా మామూలే ఇక్కడ అని అందరికీ తెలుసు. దీనిని తప్పంటరా? అసలు డ్రగ్స్ కి ఎంత పెద్ద నెట్వర్క్ బలంగా వుంటది. దేశమంతటా వుంటది. ఎక్కడికక్కడ సప్లై చెయ్యాలి. బహిరంగ రహస్యమైనా దొంగ చాటుగా చేయాలి కదా! అంత ఛాలెంజింగ్ పనిని ఎంత నేర్పుగా చేస్తాంద్రు. నేర వ్యవస్థ అయితే కావచ్చు. కానీ ఎంతమందికి పని దొరుకుతాంది. ఆడపిల్లను కూడా భోగ వస్తువుగా చేస్తాన్రు. గందుకే ప్రకటనలల్ల, టీవీ సీరియల్స్‌ల, ఎన్నో కార్యక్రమాలల్ల, ఇంకా ఎన్నింటల్లనో ఆడపిల్లలు బతుకుతాంద్రు. చేస్తే తప్పుగానీ, రెడ్ లైట్ ఏరియాల కోసం అమ్మాయిలను ట్రాప్ చేయటం కాన్నుంచి, అక్కడ కంపెనీలను నడపడం వరకు ఎంతమందికి పనులు దొరుకుతానయి. గివన్నీ స్వయం ఉపాధులే. మోదీ తాత ఏం చెప్పిండు. స్వయం ఉపాధి పనులకోసం బజ్జీల, పునుగుల బండ్లు పెట్టుకోమండు. గిట్లా ఎవరి సంపాదనా పనులు వాళ్ళు వెతుక్కోవాలె. నేర వ్యవస్థ వర్ధిల్లితేనే స్వయం పనులు ఇబ్బడి ముబ్బడిగా దొరుకుతయి. ఇంజనీరింగ్ సదివిన పిల్లలు కూడా డ్రగ్స్ దందాలు, పార్ట్‌టైం వర్క్ చూసుకుంటాంద్రని గామధ్య పేపర్ల కూడా వచ్చింది. గీ తీరుగ స్వయం ఉపాధి పనులు దొరకబట్టె. పనులు దొరుకుత లేవనుడేంది? తప్పు కదా!

హడావుడి బతుకులాయె. ఎంజాయ్‌మెంట్‌కి ఎంజాయ్‌మెంట్, మరి పుణ్యం దక్కాలి కదా! గుళ్ళు, గోపురాలు, మసీదులు, చర్చీల సంబురాలు పోటా పోటీపడి ఎక్కువైనయి. పుష్కరాలల్ల స్నానాలు చేసుడు ఎక్కువాయె. స్వాములోరి కాళ్ళ కింద మట్టి తీసుకొనుడు పెరిగిపాయె. ఇగ వినాయక చవితి పండుగయితే, వాడకు రెండు పెద్ద వినాయకుల బొమ్మలు. స్టేజీలు కడతరు. తొమ్మిది రోజులు డాన్సులు, పాటలు, పూజలు, మంత్రాలు, దంపతుల పూజలు, ప్రసాదాలు. అబ్బో.. ఎంత హడావుడో. సదువు, చట్టుబండలు లేక పోరగాళ్ళు లంపెన్లయితాంద్రంటరు గానీ, మరి గావాళ్ళతోనే గివన్నీ నడుస్తయి. రాత్రంతా తాగుకుంట, నిమజ్జనం చేసే దాన్క పనులే పనులు. అపార్ట్‌మెంట్లల్ల కూడా వినాయక చవితి తొమ్మిది రోజులు సందడే సందడి. సామూహికంగా పూజలు, లంచ్‌లు, డిన్నర్లు, ప్రసాదాలు, అన్నదానాలు ఎంత సందడి ఎంతపుణ్యం? డ్రెస్ కోడ్‌లతో డ్యాన్సులు. గిదంతా సమిష్టి తత్వమే కదా! ఇన్‌క్లూజివ్ గ్రోత్ కాదా ఏంది?

ఎలక్షన్లప్పుడు, కబ్జాల కోసం, గుండా గిరి కోసం, అన్ని మాఫియాలు, నల్ల బజార్లేనాయె. వీటిని నడపటానికి లంపెన్ పోరలు కావాలి కదా! గందుకే మన గవర్నమెంట్ చదువును డబ్బున్నోడికే అందేటట్లు చేస్తాంది. గిది మంచిదే కదా! లంపెన్ ఉద్యోగాలు ఎక్కడ నుండి పుడతయ్ మరి!

టెన్షన్ బతుకులకు బోల్డన్ని సమస్యలొస్తయి. ఉద్యోగం సద్యోగం దొరకటం, పెళ్లి కావడం, పిల్లలు పుట్టటం, ఆడపిల్ల పుట్టకుండా వుండటం, మొగుడు పెళ్ళాల మధ్య పంచాయితీ, దొంగ వ్యాపారం చేసి పట్టు బడకుండా ఉండటానికి ఎన్ని రకాల జ్యోతిషాలో, ఎన్ని రకాల శాంతి పూజలు, రంగురాళ్లు, పేర్ల అక్షరాలను మార్చుకొనుడు, వాస్తు పూజ, అబ్బో.. తీరొక్క పరిష్కారాలు. వీటికోసం కంప్యూటర్లతోనే పెద్ద నెట్వర్క్ ఉంటుండె. గిట్ల ఎన్ని రకాల పనులు దొరుకుతానయో జనానికి. టీవీలల్ల ప్రకటన వస్తది. ఋషులు, మునులు, బాబాలు పెద్ద ఎత్తున పూజలు చేసి, తాయెత్తులు, ఉంగరాలు తయారు చేసింద్రని. ఆ తాయెత్తులతో మన ఇంటికి డబ్బు ప్రవాహమే ప్రవాహం. వరదే, వరద. ఇది ఎవరికి వాళ్లు చూసుకుంటరని గవర్నమెంటు దరిద్రం గురించి మాట్లాడుడు బందు చేసింది. ఇంక తాంత్రిక పూజలు ఎన్నో. ఎమ్మెల్యే తండ్రి, మంత్రి కావటానికి పిల్లలు తాంత్రిక పూజలు చేయించింద్రని గామధ్య పేపర్ల వచ్చింది. సినిమా యాక్టర్లు కూడా అవకాశాలు దొరకాలని తాంత్రిక పూజలు చేయించుకుంటరు. గిట్ల, గీ పూజలు చేయించు పనిలో ఎంతమందికి పని దొరుకుతాంది చెప్పుండ్రి. ఎవరి నమ్మకాలు వాళ్ళవి. కాదనటం తప్పే కదా!

చిల్లర వ్యాపారం చేసుకోండని గుత్త పెట్టుబడుదారులకి పర్మిషన్ ఇస్తే తప్పంటిరే. రోడ్లమీద తిరిగి తిరిగి అమ్ముకునేటోల్లు, రోడ్లమీద దుకాణాలు, మామూలు దుకాణాలుతో సిటీ ఎంత అగ్లీగా వుంటది. పెద్ద పెద్ద మాల్స్, మల్టీప్లెక్స్ లతో రోడ్డెంత కళకళలాడ్తున్నది. మొత్తం సిటీ ఎంతందంగా ఉంటది. మాల్స్, మల్టీప్లెక్స్ లల్ల ఎన్ని పనులు దొరుకుతానయి. సేల్స్ అమ్మాయిలు, అబ్బాయిలు, మూటలు తెచ్చేటోల్లు, బట్టలు మడత పెట్టేటోల్లు, సెక్యూరిటీ గార్డులు, అబ్బో.. ఎంతమందో. పన్నెండు గంటలు నిలబడి పనిచేయాలి. మరి ఎనిమిది వేలు, పది వేల జీతం ఒట్టిగనే ఇస్తరా! పట్టణం అందం పెరిగే. పోరగాళ్లకు పని దొరికే. ఏం నష్టం.

రైల్వేస్టేషన్లు ఎంత గలీజుగా వుంటయి. మస్తు మంది అవీ ఇవీ తినే పదార్థాలు తయారు చేస్తరు, అమ్ముకుంటరు. స్టేషన్ల చుట్టూ బోల్డంత జాగా చిల్లర మల్లర మనుషులే వుంటరు. గందుకే మన గవర్నమెంటు అమృత స్టేషన్లను చేస్తాంది. కార్పొరేట్లకు స్టేషన్లను, చుట్టూ జాగాను అప్పజెబుతది. వాళ్ళే మల్టీప్లెక్స్‌లు, మాల్స్ కడతరు. బోల్డంత మందికి పని దొరుకుతది. జాగాని కార్పొరేట్లు తీసుకుంటే ఏమైతది? చిన్న

చిన్న స్టేషన్లు, గరీబోళ్ల గుంపు ఎక్కకుండా వందేభారత్ రైళ్లు వస్తన్నయి గదా. గరిబోళ్ల గలీజు పోతది. ఎంత గొప్ప, ఎంత గొప్ప.

గవర్నమెంట్ రోడ్లు, హైవేలు కడ్తది. కార్పొరేట్లకు లీజుకిస్తది. అక్కడ రోడ్లంట అమ్ముకునే చిల్లర వ్యాపారులు వుండరు. రోడ్లు, హైవేలు అందంగా వుంటయి. మనందరం టోల్ కడ్తం. ఎన్నో పల్లెటూళ్ళకు రోడ్లు లేకపోతే ఏంది? హైవేలు, ఫ్లైఓవర్లు అన్నీ మన డెవలప్మెంట్‌ను చూపిస్తయి కదా!

డబ్బున్నోళ్లు ఇంట్లో కూర్చుని ఆర్డరిచ్చి బజ్జీలు, బర్గర్లు, స్నాక్స్, స్వీట్లు, బిర్యానీలు ఏవైనా తెప్పించుకోవచ్చు. స్విగ్గీ, జొమాటోలు వున్నయి. వాళ్ల బైకులతో, వాళ్లే హాట్ బాక్సులు కొనుక్కొని, ఆగమేఘాలమీద మనకు తెచ్చిస్తరు. యాప్ కంపెనీ, వాళ్లకు పైసలిస్తరు. ఎక్కడకన్నా పోవాలంటే రాపిడో బండ్లు, ఏ రిపేరొచ్చినా చేపించుకోవడానికి, బాత్రూములు కడిగించుకోవడం నుండి బ్యూటీషియన్ పనులు చేసి పెట్టడానికి అర్బన్ కంపెనీలు వచ్చినయి. తీరొక్క సేవలు దొరుకుతయి. ఇందుల పని చేసేటోళ్లను పార్ట్‌నర్లు అంటరు. వీళ్ళు స్వేచ్ఛగా గంటలు లెక్క పని చేయొచ్చు. రోగాలు రొస్టులు అనొద్దు. ఎంత పనిచేస్తే అంత సంపాదన. అట్లా ఎంతైనా సంపాదించుకోవచ్చు. ఎవరి బతుకులకు వాళ్లే బాధ్యులు. ఇంతకంటే సాధికారత ఏముంటది!

దీన్ని దోపిడీ వ్యవస్థ అనొద్దు. తీరొక్క పనులు, మస్తు అవకాశాలు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్. ఇంకెన్ని చెప్పాలె. మొత్తం దోపిడీ వ్యవస్థ వర్ధిల్లాలి. సమ్మిళిత వృద్ధికి తొవ్వపడాలి. ✣

**కవిత**

# బ్రతుకుతాను!!

**- ఉదయ**

అత్యాచారాలకు గురవుతున్న స్త్రీగా నేను
ప్రతి ఘటిస్తాను.....
చివరివరకూ ప్రతిఘటిస్తాను
శరీర బలమే చివరకు
బలహీనతగా మారినప్పటికీ
నేను బ్రతకాలనే కోరుకుంటాను....ధైర్యంగా

సమాజం నన్ను వివక్షతో
చూస్తుందని తెలిసినా .....
వెలివేస్తుందని తెలిసినా
చులకన చేస్తుందని తెలిసినా
చిన్న చూపు చూస్తుందని తెలిసినా
నాపై తప్పుమోపుతుందని తెలిసినా
నేను బ్రతుకుదామనే కోరుకుంటాను ధైర్యంగా

క్రూరమృగాలపై ప్రతీకారం
తీర్చుకోవాలని కాదు......
వారిని అతి కిరాతకంగా
చంపాలని కాదు

క్రూరమృగాలను, విషసర్పాలను
తయారు చేసే నరహంతక పరిశ్రమలను
కూలదోయుటానికై బ్రతుకుతాను

బ్రతుకుతాను ధైర్యంగా
యువకెరటాలను
విషవాయువులకు వదిలేసిన
నరహంతకుల నిర్మూలనకై

బ్రతుకుతాను విశ్వాసంతో
ఆడజాతిని
అంగడిసరుకుగా మార్చిన
విషసంస్కృతిని వేళ్ళతో సహా
పెకిలించుటకు.

కనబడని శత్రువుగా
ఎంతో కాలం మనలేవనీ
నీ సర్వస్వ సంపద
ప్రజా విప్లవ వెల్లువలో
కొట్టుకుపోతుందనీ
చెవులు పిక్కటిల్లేలా
స్వర నాళాలు తెగిపోయేలా
అరిచి, చెప్పటానికి బ్రతుకుతాను.

బ్రతుకుతాను ధైర్యంగా
ప్రజావిప్లవ వెల్లువలో నేనూ
ఒక భాగం కావాలన్న
ప్రగాఢ విశ్వాసంతో ✣

పుస్తక పరిచయం

# బిల్ గేట్సు దాతృత్వ రహస్యం

**'The Bill Gates Problem'** *by Tim Schwab*

**- టిమ్ ష్వాబ్**

పరిచయకర్త : **జి.వి. భద్రం**

(గత సంచిక తరువాయి)

## గేట్స్, గవీ సంస్థల అసలు స్వరూపం

2007లో 'లాస్ ఏంజెల్స్ టైమ్స్'లో వ్రాసిన ఒక పరిశోధనాత్మక వ్యాసం యిలా పేర్కొంది. "పౌష్టికాహారలోపంతోనూ, యితర జబ్బులతోనూ బాధపడే పేద బాలలకు చికిత్స చేయటం కోసం వ్యాక్సిన్లు కానీ వనరులు కానీ అందుబాటులో లేవు. కానీ అక్కడి పేద బాలలను గేట్సు, గవీ సంస్థలు అందించే వ్యాక్సిన్ కోసం తోలుకెలుతున్నారు. అంతేకాదు ఆ బాలలు వ్యాక్సిన్ వేయించు కొంటున్నప్పుడు, వారు వైద్య సంరక్షణ గురించి కానీ, యితర వైద్య సంబంధమైన విషయాలు కానీ అడగవద్దని ఆ బాలలను ముందుగానే హెచ్చరించి తీసుకుపోతున్నారు". "పేద దేశాల యొక్క మంచి కోసం గవీ సంస్థ రూపొందించింది కానీ, ఆ పేద దేశాల ప్రభుత్వాలు దాన్ని రూపొందించలేదు. యిటువంటి విషయంలో చొరవ అనేది లబ్ధిదారుల నుండి పుట్టుకురావాలి అనే ముఖ్యమైన విషయాన్ని మనం గుర్తించాలి!" అని క్వీన్స్ కాలేజి చరిత్రకారుడు అయిన విలియం మురాస్కిన్, గవీ సంస్థను స్థాపించిన తొలిదినాల్లోనే హెచ్చరించాడు. వ్యాక్సిన్లు (టీకాలు) వేయటం ద్వారా 'ప్రాణాలను రక్షించటం!' అన్నది గవీ యొక్క లక్ష్యం. అది పేద దేశాలవారి ప్రాధాన్యత కాకపోయినా వాటిని ఆర్థికపరంగా ఆశ చూపించి, ఆకర్షించి గవీ తన లక్ష్యాన్ని వారి (ఆ పేద దేశాలవారి) ప్రాధాన్యతగా మార్చివేస్తుంది. సంపన్న దేశాలు గవీ సంస్థకు 80 నుండి 90 శాతం నిధులు యిచ్చినా గవీ డైరెక్టర్ల బోర్డులో వారి ప్రతినిధులు కేవలం 5 మంది మాత్రమే వుంటారు. అంటే అధిక నిధులు సమకూర్చిన ప్రభుత్వాలకు కూడా గవీ సంస్థ యొక్క నిధులు ఎలా ఖర్చుచేయాలి అని నిర్ణయించే అవకాశం పరిమితంగానే యిచ్చారన్నమాట! దీన్నే ప్రభుత్వాల - ప్రైవేటు సంస్థల, భాగస్వామ్యపు పరిపాలనగా గేట్స్ ఫౌండేషన్ యొక్క దాతృత్వాల ఆదర్శవంతమైన పనితీరుగా, ఆ ఫౌండేషన్ ప్రచారం చేస్తూ వుంటుంది. గవీ లాంటి సంస్థలు ప్రజారోగ్య నిర్వహణాబాధ్యతను ప్రభుత్వాల, ప్రభుత్వ సంస్థల నుండి తప్పించి, ప్రభుత్వాల పాత్రను తగ్గించే ప్రయత్నాలను చేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్యసంస్థలాంటి సంస్థలు కూడా, ప్రజారోగ్య నిర్వహణాపాత్రను, ప్రైవేటురంగానికే అప్పజెప్పే విధంగా ప్రభావితం చేస్తున్నాయి. ప్రైవేటు సంస్థలైతే పారదర్శకరహితంగానూ, జవాబుదారీతనం లేకుండానూ తమ యిష్టానుసారం పనిచేసే వెసులుబాటును పొందుతాయి. నయా ఉదారవాదం ముసుగులోని సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క పరిపాలనాపద్ధతి యిదే. ఇప్పటికే అనేక ప్రభుత్వాలు ఆ నయాఉదార విధానాలను అమలు జరుపుతూ, ప్రజారోగ్య సంరక్షణ బాధ్యతను ప్రైవేటు సంస్థలకు క్రమంగా బదలాయిస్తూ తమ బాధ్యత నుండి తప్పించుకొంటున్నాయి.




గేట్స్ ఫౌండేషన్ తన దాతృత్వ విరాళాలను భారీ మొత్తాలలో వ్యాక్సిన్ అభివృద్ధిపరిచే కంపెనీలకు - జి.ఎస్.కె., ఫైజర్, ఎస్.కె. బయోసైన్సు, ఫ్లూవేక్స్, జెనోసియా, మేట్రివేక్, సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, ఇన్వెటప్రైజ్ లాంటి కంపెనీలకు యిచ్చింది. అంతేకాక సినోఫారమ్, వాల్‌వేక్స్ లాంటి కంపెనీలతో చైనా అంతటా భాగస్వామ్యాన్ని నెలకొల్పుకొంది. 2014లో సరికొత్తగా లాభాల కోసం వ్యాక్సిన్ తయారుచేసే ఎఫినివేక్స్ అనే కంపెనీకి 4 మిలియన్ల డాలర్లను మూలధనంగా యిచ్చి ఆ కంపెనీకి చెందిన ఆరుగురు డైరెక్టర్లలో యిద్దరిని ఫౌండేషన్ ప్రతినిధులుగా పెట్టుకొని ప్రారంభించింది. 2022లో జి.ఎస్.కె. యీ కంపెనీని

2.1 బిలియన్లకు స్వాధీనం చేసుకొంది. ఈరకంగా గేట్స్ ఫౌండేషన్ తన దాతృత్వ ఫౌండేషన్‌కు భారీఎత్తున లాభాలను సంపాదించుకొంది. ఈ విధంగా తరచుగా గేట్స్ దాతృత్వ కార్యకలాపాలు, బడా ఫార్మా చేతుల్లోకి పడిపోయాయి. నేరుగా లాభార్జన చేసే కంపెనీలకు గేట్స్ ఫౌండేషన్ భారీ మొత్తం విరాళాలిస్తుంది. మెర్క్, ఫైజర్, నొవార్టిస్ లాంటి బడా కంపెనీలలో స్టాక్‌ను, బాండ్స్‌ను కలిగివున్నట్లు, గేట్స్ ఫౌండేషన్ యొక్క ఎండోమెంట్ తెలియచేస్తోంది.

గేట్సు ఫౌండేషన్ ఎఫినివిక్స్, గేట్స్ మెడికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లను ప్రారంభించటం ద్వారా మార్కెట్టులో ఒక పోటీదారుగా తయారయిందన్నది యీ పుస్తక రచయిత అభిప్రాయం. దీన్ని (బడా ఫార్మాతో దాతృత్వ సంస్థలు భాగస్వామ్యం వహించే విధానానికి, ఎకనమిష్టు అన్న పత్రిక దాతృత్వ పెట్టుబడిదారీ విధానం (ఫిలాంత్రో కేపిటలిజం) అని పేరు పెట్టింది.

## ఆరోపణలకు స్పందించని గేట్స్ ఫౌండేషన్

గేట్స్ ఫౌండేషన్ తాను విరాళాలిచ్చి - తన నుండి విరాళాలు స్వీకరించిన సంస్థలను వాణిజ్య కాంట్రాక్టర్లుగానూ లేదా తన క్రింద పనిచేసే ఉద్యోగులుగా పరిగణిస్తూ, వారు చేయాల్సిన పనులను నిర్దేశిస్తూ వాటిపై తాను ఆధిపత్యం వహించి వ్యాక్సిన్ల పరిశోధనా రంగంపై తన గుత్తాధిపత్యాన్ని స్థాపించుకొంది. గేట్స్ ఫౌండేషన్ తాను విరాళాలు యిచ్చే బడా ఫార్మా కంపెనీలతో భాగస్వామ్యం వహించి తన కోవిడ్-19 వ్యాక్సిన్‌ను రూపొందించాల్సిందిగా ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీపై ఒత్తిడి తెచ్చింది.

గేట్సు ఫౌండేషన్ మెరుగైన, చౌకగా లభించే మందులు, ప్రాణ రక్షణక మందులు మార్కెట్టుకు చేరకుండా, తన జోక్యం ద్వారా, మైక్రో మేనేజింగ్ పద్ధతుల ద్వారా ద్వేషపూరిత పలుకుబడి ద్వారా అడ్డుకొంటోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గేట్సు ఫౌండేషన్ తనతో ఒప్పందం చేసుకొన్న కంపెనీలపై దావాలు వెయ్యటం ద్వారా, దావాలు వేస్తానని బెదిరించటం ద్వారా అవి తనకు లోబడి వుండేటట్లు చేసుకుంటోంది. ఫ్యూవేక్స్ అనేది కెనడాలో ఒక చిన్న వ్యాక్సిన్ కంపెనీ. కొంతకాలంపాటు యీ కంపెనీ గేట్స్ ఫౌండేషన్‌లో అతిపెద్ద ప్రైవేటు సెక్టరు భాగస్వామిగా వుంది. 2014 నుండి గేట్స్ ఫౌండేషన్‌కు సుమారు నలభై మిలియన్ల డాలర్లను గ్రాంటుగా యిచ్చింది. ఆ రెండు కంపెనీలు చేసుకొన్న ఒప్పందం ప్రకారం ఫ్యూవేక్స్ ఒక డోసు న్యూమోనియా వ్యాక్సిన్‌ను ఒక డాలరు 48 సెంట్లకు అమ్మాలి. అదే సమయంలో జి.ఎస్.కె., ఫైజర్ కంపెనీలు గవీ సంస్థ ద్వారా అంతకు ఎన్నో రెట్ల ధరను పొందుతున్నారు. అయితే ఫ్యూవేక్స్ కంపెనీకి ఒక సైంటిఫిక్ సలహా కమిటీని ఏర్పాటు చేయమనీ, ఆ కమిటీలో తాను ప్రముఖమైన పాత్రను పోషిస్తాననీ గేట్స్ ఫౌండేషన్ ఆదేశించింది. అప్పటికే ఫ్యూవేక్ కంపెనీ తాను కనుగొన్న వ్యాక్సిన్‌ను విజయవంతంగా మార్కెట్టులో ప్రవేశపెట్టే స్థితిలో వుంది. అందువలన అది ఫౌండేషన్ యొక్క ఆదేశాన్ని పాటించటానికి వెనుకాడింది. దాంతో గేట్సు ఫౌండేషన్, ఆ సంస్థపై, తాను యిచ్చిన నిధులను దుర్వినియోగం చేసింది అంటూ దావా వేసి, తమ మధ్య గల ఒప్పందాన్ని అతిక్రమించిందనీ నేరారోపణ చేసింది.

“మెక్లియాన్స్” పత్రిక ప్రకారం గేట్స్ ఫౌండేషన్ ఆ ఆరోపణలను ఎన్నడూ నిరూపించలేదు. గేట్సు ఫౌండేషన్ 11 వారాల్లో ఆ దావాను స్వచ్ఛందంగానే డిస్మిస్ చేయించుకొంది. ఫ్యూవేక్స్ కంపెనీకి ఆర్థిక నష్టం జరగకపోయినా, జరగవలసిన పరువునష్టం జరిగిపోయింది. ‘గ్లోబ్’, ‘మెయిల్’ పత్రికల ప్రకారం ఫ్యూవేక్స్ కంపెనీ, 2020 సంవత్సరానికి, కోవిడ్-19 వ్యాక్సిన్‌ను మిలియన్ల డోసుల సంఖ్యలో ఉత్పత్తి చేసే స్థితిలో వుంది. అయినా గేట్స్ ఫౌండేషన్ వేసిన దావా ప్రభావంతో, కెనడా ప్రభుత్వం ఆ కంపెనీకి నిధులు యివ్వలేదు. అంతేకాదు ఫ్యూవేక్స్ తాను కనిపెట్టిన న్యూమోనియా వ్యాక్సిన్‌ను కూడా మార్కెట్టులోకి ప్రవేశపెట్టలేకపోయింది. ఈ రకంగా గేట్స్ ఫౌండేషన్, వ్యాక్సిన్లు చౌకగా అందుబాటులోకి తీసుకువచ్చే కంపెనీలను అడ్డుకొని, బడా ఫార్మా కంపెనీలకు అధిక ధరకు వ్యాక్సిన్లు అమ్ముకొనే అవకాశాలను కల్పిస్తోంది. ఈ ప్రకారం చూస్తే, గేట్స్ ఫౌండేషన్ చౌక ధరకు వ్యాక్సిన్లు పేద దేశాల బాలలకు అందుబాటులోకి రాకుండా అడ్డుకోవటం వలన “ఎంతమంది బాలలు చనిపోయారు” అన్న విషయం ముఖ్యమైనది కానీ, “ఎంతమంది ప్రాణాలను రక్షించింది” అన్నది ప్రధానమైన విషయం కాదు. బడా ఫార్మా కంపెనీలు తమ సాంకేతికతను పేద దేశాలలోని వ్యాక్సిన్ ఉత్పత్తిదారులతో ఎందుకు పంచుకోవటల్లేదు? అని ప్రశ్నించాలి.

మార్కెట్ రంగంలో గేట్స్ ఫౌండేషన్ అసమానమైన ప్రత్యేకమైన అధికారాలను అనుభవిస్తోంది. ఒక ప్రైవేటు కంపెనీ అనే మిషతో యీ ఫౌండేషన్‌కు పన్నులు విధించబడటల్లేదు. నియంత్రించబడటల్లేదు. దాతృత్వ రంగంలో అది సూపర్ హీరోగా చలామణీ అవుతోంది.

పేద దేశాల బాలలకు వ్యాక్సిన్లు అందజేస్తున్నానని ప్రచారం చేసుకొంటున్న గేట్స్ ఫౌండేషన్ యొక్క మందుల తయారీ కంపెనీల భాగస్వాములు (బడా ఫార్మా కంపెనీలు) వ్యాక్సిన్లను సంపన్న దేశాలకు అందించాయి. అదే సమయంలో పేద దేశాలు టీకాలు వేయించు కోకుండానే మిగిలిపోయాయి.

ప్రజారోగ్యపు బాధ్యతను బిలియనీర్లకు, వారి ఘనమైన ఆలోచనలకు అప్పజెప్పటం వలన అవి జవాబుదారీతనంలేని అధికారాన్ని పొందుతాయన్న ప్రమాదం గురించి యీ గేట్స్ ఫౌండేషన్ ఆచరణ తెలియజేస్తోంది. (ఇంకా వుంది) ✣

వ్యాసం

# "నా సినిమా బంగ్లాదేశ్ నిరంకుశ ప్రభుత్వాగ్రహాన్ని చవిచూసింది!"

హన్సల్ మెహతా

**షేక్** హసీనా ప్రభుత్వంపై బంగ్లాదేశ్‌లో ఆగష్టు నెలలో జరిగిన సామాజిక, రాజకీయ తిరుగుబాటు నేపథ్యంలో, 2016 జులై 1 నాటి ఢాకాలోని 'హొలే ఆర్టిజాన్ బేకరీ' పై టెర్రరిస్టుల దాడి, హత్యాకాండ సంఘటనలు వస్తువుగా చిత్రీకరించిన హిందీ సినిమా "ఫరాజ్" మళ్లీ చర్చనీయాంశం అయింది. సినిమా అంతా ఒక్క రాత్రిలో జరుగుతుంది. సినిమా దర్శకుడు హన్సల్ మెహతాతో 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రికకు చెందిన చంద్రిమా పాల్ చేసిన ఇంటర్వ్యూ (ఆగస్టు 8) అనువాదాన్ని క్రింద ఇస్తున్నాము.

ఇటీవల అధికారం కోల్పోయిన ప్రభుత్వపు అణచివేత విధానాల కారణంగానే తన సినిమాను బంగ్లాదేశ్‌లో నిషేధించారు అని హన్సల్ మెహతా చెప్పారు. తన సినిమా విడుదలను నిలుపు చేయటానికి బంగ్లాదేశ్, ఇండియాలకు చెందిన వివిధ శాఖల పెద్దపెద్ద అధికారులు, బెదిరింపులకు ఒత్తిడిలకు పాల్పడ్డారని కూడా అతను చెప్పాడు. ఆ కారణంగా 2022లో చిత్రీకరణ పూర్తయినప్పటికీ 'ఫరాజ్' సినిమాకు చిన్న చిన్న హాళ్లలో విడుదలకే సంవత్సరం పైగా కాలం పట్టింది. ఆ తర్వాతనే ఓటీటీలో దానికి చోటు దొరికింది. ఈ ఆగస్టు నెలలో సంభవించిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో 'ఫరాజ్' సినిమా పరిచయాన్ని,'ఫరాజ్' సినిమా దర్శకుడు హన్సల్ మెహతాతో జరిపిన సంభాషణను పాఠకులకు అందిస్తున్నాం.

"ఖానా ఖజానా" అనే టీవీ సీరియల్ ద్వారా పేరుపొందిన హన్సల్ మెహతా 'షాహిద్', 'అలీఘర్', 'స్కాం'... మొదలైన పలు చిత్రాలకు గతంలో దర్శకత్వం వహించారు. ఫరాజ్ సినిమా చిత్రీకరించడంలో, విడుదల చేయించుకోవడంలో తాను ఎదుర్కొన్న ఒత్తిడుల దగ్గర నుండి, బంగ్లాదేశ్‌లో నిషేధానికి గురైన విషయం దాకా ఇంటర్వ్యూలో తెలుసుకోవచ్చు.

ముందుగా ఆ సినిమా కథను, దాని చిత్రీకరణ నేపథ్యాన్ని క్లుప్తంగా చూద్దాం.

"ఫరాజ్" సినిమా 2016లో ఢాకాలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందించింది.

కెనడా దేశం నుండి తిరిగివచ్చిన ఒక ఐఎస్ఐఎస్ నాయకుని మార్గదర్శకత్వంలో బంగ్లాదేశ్‌లో శిక్షణ పొందిన (జమాత్ ఉల్ ముజాహిద్దీన్) టెర్రరిస్ట్ బృందం ఢాకా నగరంలోని సంపన్నుల హొటల్ 'హొలీ ఆర్టిజాన్ బేకరీ' పై దాడి చేసి అందులో విదేశీయులుగా కనిపించిన కొందరిని చంపుతారు. మిగిలిన వారిని బందీలుగా చేసుకుంటారు. మరికొందరిని వారి దేశం, మతం అడుగుతూ విడగొడుతూ ఉంటారు.

నిజ జీవితంలో ఫరాజ్ హుస్సేనే సినిమాలో ప్రధాన సానుకూల (Protogonist) పాత్ర. పైన పేర్కొన్న హొటల్ పై టెర్రరిస్టులు చేసిన దాడిలో ఇతను మరణిస్తాడు. టెర్రరిస్టులు తనకు హొటలు నుండి వెళ్లిపోయే అవకాశం ఇచ్చినా స్నేహితులను విడిచి తన ఒక్కడి ప్రాణాలే కాపాడుకునే స్వార్థబుద్ధిని అతను ప్రదర్శించలేదు. స్నేహ ధర్మానికి కట్టుబడిన నిజాయితీ గల యువకునిగా ప్రవర్తించి హత్యకు గురైన వ్యక్తి ఫరాజ్. కేవలం 20 ఏళ్ల వయసున్న అతని పూర్తి పేరు ఫరాజ్ అయాజ్ హుస్సేన్.

సినిమా అంతా ఒక రాత్రి జరిగిన సంఘటనలతో చిత్రించారు. ఫరాజ్ హుసేన్ కథ స్ఫూర్తితో ఇది సినిమా తెరకెక్కింది. ఈ సినిమాలో హోటల్‌ను తమ స్వాధీనంలోకి తెచ్చుకున్న ఐ.ఎస్. ఐ.ఎస్. టెర్రరిస్టుల నాయకుడైన నిబ్రాస్‌లోని మతోన్మాదానికి, ఫరాజ్ లాంటి సాధారణ ప్రజలు పాటించే సామరస్య పూర్వక మతానికి నడుమ గల విలువలతో కూడిన వ్యత్యాసం వారిరువురి సంభాషణ ద్వారా తెలుస్తుంది. ఈ సంఘటన, ఫరాజ్ చూపిన ధైర్యంతో పాటు అతనికి స్నేహం పట్ల ఉన్న అంకితభావాన్ని కూడా తెలియచేస్తుంది.

అంతేకాక సంభాషణలలో ఫరాజ్ తన మతాన్ని ప్రకటించుకుంటూనే ఉన్నా, టెర్రరిస్టు నాయకుడు లేవనెత్తిన పాలస్తీనాలో, మధ్యాసియాలో ముస్లింలపై అమెరికా సాగిస్తున్న దురాగతాల్ని ఖండిస్తూనే, వాటితో ఏమాత్రం సంబంధంలేని వారిపై దాడి చేసి హత్యలు గావించటాన్ని ఇస్లాం మతం అంగీకరించదు అంటాడు. తనలోని మానవత్వాన్నేకాక తనకు స్నేహం పట్ల గల నిజాయతీని కూడా స్పష్టంగా వ్యక్తం చేస్తాడు. "మీరు నిజమైన ముస్లింలు అయితే, మీరు నిర్దోషులపై దాడి చేయరు." అని ఫరాజ్, నిబ్రాస్‌ను ఎదిరిస్తాడు. ఈ సంభాషణ ఫరాజ్ వ్యక్తిత్వంలో జీర్ణించుకున్న విలువలను ప్రతిబింబిస్తుంది. సహజంగా దాన్ని తట్టుకోలేని మతోన్మాద టెర్రరిస్టులు అతని ప్రాణాలను కూడా బలిగొన్నారు.

సినిమాను నిశితంగా పరిశీలిస్తే దర్శకుడు చూపించిన ప్రతి దృశ్యంలోనూ మనకు అనేకానేక అర్థాలు గోచరిస్తూ ఉంటాయి. హొటల్లో వంట చేసే మనిషి ముస్లిం పేరు చెబుతాడు. కానీ అతను హిందువై వుండవచ్చునని మనకు అనుమానం వస్తుంది. బృందంలోని

ఒక టెర్రరిస్టు అతని దగ్గర సెల్ ఫోన్ తీసుకుంటాడు. చూడగానే ఒక్క సెకండ్ పాటు దుర్గా దేవి బొమ్మ కనిపిస్తుంది. అయినా తమ బ్రేక్ ఫాస్ట్ అవసరం కోసం అతన్ని వదిలేస్తాడు.

పరమ నిర్దాక్షిణ్యంగా కనిపించే టెర్రరిస్టు నాయకుడు నిబ్రాస్‌లో కూడా అంతరాంతరాలలో మానవీయ కోణం దాగి వున్నదన్నట్లు కొన్ని సంఘటనల చిత్రీకరణ ఉంటుంది. అదే సమయంలో అతనిలోని కొన్ని మత ఛాందసత్వ భావాలు కూడా!

సినిమాలో, టెర్రరిస్టు నాయకుడు నిబ్రాస్ ముస్లిం కాబట్టి ఫరాజ్‌కి హాని తలపెట్టబోమని మొదట చెబుతాడు. కానీ, ఫరాజ్ మాత్రం తన స్నేహితులను విడిచిపెట్టలేనని, వారితోపాటే ఉంటానని అంటాడు. మతోన్మాదం ఎప్పటికీ మతం కాదని ఫరాజ్ స్పష్టంగా వాదిస్తాడు. తనను హొటల్ విడిచి వెళ్ళిపోమని టెర్రరిస్ట్ నాయకుడు కోరినా అతను స్నేహితులతో పాటే ఉండిపోతాడు.

ఈ సంభాషణ కాల్పనికతతో రూపొందించబడినప్పటికీ, ఇది ఫరాజ్ యొక్క వాస్తవికమైన సాహసోపేత వ్యక్తిత్వాన్ని వెల్లడి చేస్తుంది. ఫరాజ్ స్నేహితులలో ఒక అమ్మాయి అమెరికా దేశానికి చెందిన ముస్లిం, మరొక అమ్మాయి అమెరికాకు చెందిన హిందువు. వాస్తవ సంఘటనలో ఆనాటి టెర్రరిస్టుల కాల్పులలో 23 మంది హతులైనారు. వారిలో ఇటలీ(9), జపాన్(7) అమెరికా(1) సింగపూరు(1) భారతదేశం(1)తో పాటు ఇద్దరు పోలీసులతో సహా బంగ్లాదేశ్ వారు నలుగురు ఉన్నారు. ఒక నెల రోజుల్లోనే అగస్టు 27న టెర్రరిస్టు నాయకుడు తమీమ్ అహ్మద్ చౌదరిని పోలీసులు చంపేస్తారు. 2023లో బంగ్లాదేశ్ కోర్టు ఏడుగురు టెర్రరిస్టులకు ఉరిశిక్షలు విధించింది.

ఫరాజ్ తల్లి సిమీన్‌గా జుహీ బబ్బర్ నటించారు. సినిమాలో ఆమె చాలా సంపన్న కుటుంబీకురాలు. మరుసటి రోజు కౌలాలంపూర్ వెళ్ళవలసి ఉన్న తన కొడుకును ప్రాణాలతో రక్షించుకోవాలని పోలీసు యంత్రాంగం పైన, ప్రభుత్వ పెద్దలపైనా చాలా హడావిడి చేస్తుంది. అయినా ఫలితం ఉండదు.

ఫరాజ్ ధైర్యానికి గుర్తుగా 2018లో మానవతా సేవల్లో కృషి చేసిన వారికి ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం (Mother Teresa Memorial Award for Social Justice) అందజేశారు.

తన కొడుకు మరణానంతరం జరిగిన పురస్కార సభలో ఫరాజ్ తల్లి తాను కూడా ఒక మారిన మనిషి అనిపించేటట్లు చాలా నమ్రతతో, భావోద్వేగంతో ఫరాజ్ వ్యక్తిత్వంలోని ఔన్నత్యాన్ని కీర్తిస్తూ సినిమా చివర్లో ప్రసంగిస్తుంది. ఈ సినిమా ప్రేక్షకులకు అందించదలచిన సందేశం మొత్తం అందులో ఉంటుంది.

బిడ్డను కోల్పోయిన బాధను దిగమింగుకుని, మానవీయత నిండిన సాహసము, అర్థవంతమైన త్యాగము, వ్యక్తిత్వం పెంపొందగల నైతిక నిష్ఠల విశిష్టతను ఫరాజ్ అందించి వెళ్లిన సందేశంగా ఈ ప్రసంగంలో ఆమె చెబుతుంది.

మాటల రచయితలు రాఘవ్ కక్కర్ కశ్యప్ కపూర్, రితేష్‌లు. షా టెర్రరిస్టు బృందం నాయకుడు నిబ్రాస్‌గా ఆదిత్య రావల్ (ప్రఖ్యాత నటుడు పరేష్ రావల్ కొడుకు) : ఫరాజ్‌గా జహాన్ కపూర్ (పృథ్వీరాజ్ కపూర్ముని మనవడు) నటించారు.

## 'ఫరాజ్' సినిమా దర్శకుడు హన్సల్ మెహతాతో ఇంటర్వ్యూ!

మొదటి ప్రశ్న:– 'ఫరాజ్' సినిమా తీయాలని నిర్ణయించుకున్న తరువాత ఏమి జరిగిందో మీరు రాశారు. అయితే సినిమా నిర్మించడానికి ఈ అంశాన్నే ఎందుకు స్వీకరించారు?

జవాబు:– ఈ ఆలోచన రావడానికి కారణం మహేష్ భట్. ఈ సినిమాలోని ప్రధాన పాత్ర అయిన ఫరాజ్ అనే యువకుడు టెర్రరిస్టు కాల్పుల సందర్భంలో చూపిన ధైర్యసహసాలకుగాను అతని మరణానంతరం అందజేసిన పురస్కార ప్రదానోత్సవంలో ఈయన పాల్గొన్నాడు.

ఈ వాస్తవిక సంఘటనకు మహేష్ భట్‌గారు చలించిపోయి ఆ భావాన్ని నాతో పంచుకున్నారు. ఈ కథ కేవలం బంగ్లాదేశ్‌కు చెందినదే కాదు, అసమర్థపు ప్రభుత్వాల కాలంలో, మానవత్వానికి మత మెజారిటీ అనే పొగచూరిన మన కాలానిది అని గుర్తించిన నేను దాన్ని సినిమాగా తీయాలని అనుకున్నాను. నా ఉద్దేశంలో ఆ దుస్సంఘటన లోకానికి సందేశం ఇవ్వగల పెద్ద కథకు ఒక ఉత్ప్రేరకం (Catalyst) లాగా ఉంది. ఆ సంఘటన అందులోని పాత్రలు ఎక్కడైనా జరిగి ఉండచ్చు అనిపించింది.

రెండవ ప్రశ్న:– నేడు షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూలదోసిన బంగ్లాదేశ్ ప్రజానీకంతో మీరు (రెండేళ్ల క్రితమే) మమేకమైనట్లుగా మీ సినిమా ఉంది. ఆ దేశంలో జరుగుతున్న సంఘటనలను మీరు తెలుసుకుంటున్నారా?

జవాబు:– బంగ్లాదేశ్ ప్రజలు ఏ నిరంకుశ శక్తుల ఆధిపత్యాన్ని ఎదుర్కొన్నారో వాటిని నేను కూడా భరించవలసి వచ్చింది. ఈ సినిమా గురించి ప్రకటించిన నాటి నుండి వారు నాపై తెచ్చిన ఒత్తిడి నాకు తెలుసు. ఆ సినిమా తీయవద్దని అనేక శాఖల నుండి నాకు సందేశాలు, ఫోన్లు వచ్చాయి. "RAW (రా = భారత ప్రభుత్వపు రహస్య పరిశోధన విభాగం) అధికారులు నీ ఫోను నంబరు అడుగుతున్నారు" అని పోలీసు వారి నుండే కాక విదేశాంగ శాఖ (IFS), పరిపాలన శాఖ (IAS) వారి నుండి కూడా బెదిరింపుల్లాంటి సందేశాలు వచ్చాయి.

"వారికి నా నంబరు ఇవ్వండి" అని నేను చెప్పాను. వారు పొరబడి నాలాంటి వ్యక్తిపై బెదిరింపులు ప్రయోగించారు. బెదిరింపులు నాకు మరింత బలాన్నిచ్చాయి. వాటివల్ల నేను సరైన పనే చేస్తున్నాననిపించింది.

బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ హైకమీషనర్ ముంబాయి ప్రత్యేకంగా వచ్చి బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని మసకబార్చే ఈ సినిమా చిత్రీకరణ ప్రయత్నాన్ని విరమించుకోమని చెప్పాడు. ప్రజల గొంతులను మూగబోయేటట్లు చేసే నిరంకుశాధికార మతాధిక్య ప్రభుత్వాలు ప్రవర్తించే తీరు ఇలాగే ఉంటుంది మరి ! కానీ నా సినిమా ప్రభుత్వం పట్ల విమర్శనాత్మకమైనది కాదు. అది మౌలికంగా మానవీయ చిత్రీకరణ ఈ వివాదాల వల్ల దాన్ని విడుదల చేయడానికి రెండు సంవత్సరాలు పట్టింది.

మూడవ ప్రశ్న:– మీ సినిమా విషయంలో వచ్చిన ఖచ్చితమైన అభ్యంతరాలు ఏమిటి?

జవాబు:– ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే బంగ్లాదేశ్‌లో మాపై వచ్చిన ఫిర్యాదులన్నీ బాధిత కుటుంబాల వారి నుండే! వాళ్లు గాయపడిన దుఃఖంలో ఉన్నారు. దాన్ని నేను అర్థం చేసుకోగలను. కానీ మా సినిమా ప్రపంచ స్థాయిలో బంగ్లాదేశ్ పరువును చెడగొడు తుందని ఫిర్యాదు చేసిన ఒక తల్లి కూడా ఉంది. వారు తమకు తాముగా అభ్యుదయ కాముకులమని, పాత ప్రధాని పాలనలో తాము ఒక మెరుగైన ప్రజాస్వామిక దేశంలో ఉన్నామని చెప్పుకోవటానికి ఇష్టపడతారు. అంతేకాక 'ఫరాజ్' చిత్రం తమ దేశ ప్రయోజనాలకు విరుద్ధమైనదనుకుంటారు. నిజానికి అది అలాంటిది ఎంత మాత్రం కాదు. కానీ వారు ఏమీ ఆధారాలు చూపకపోయినా ఫిర్యాదుదారుల, న్యాయవాదుల చుట్టూ మేము ఇంకా తిరుగుతూనే ఉన్నాము. దీనిపై వచ్చిన అభ్యంతరాలన్నీ అవాస్తవికమైనవే!

ఆ సినిమా నిర్మించినందువల్లే నాతో వారికి ఏదో సమస్య వచ్చింది. ఏ సినిమా నిర్మాతకైనా ఈ తరహా సంఘటనతో కూడిన సినిమా చిత్రీకరించడం హద్దులు మీరిన చర్యగా ఎప్పటినుండి పరిగణింపబడుతోంది?

నాలుగవ ప్రశ్న:– బంగ్లాదేశ్ యువకులు ఇప్పుడు ఉద్యమ వెల్లువలో ముందున్నారు. మీరు సినిమా చిత్రీకరించేటప్పుడు ఆ వీధులలో మీకు ఏమనిపించింది?

జవాబు:– నేను చిత్ర నిర్మాణ పరిశోధన కొరకు ఢాకాకు ఏ హడావిడి లేకుండా వెళ్లాను. అనేకమంది యువకులను, టెర్రరిస్టు దాడి నుండి బతికి బయటపడ్డ వారిని ఇంటర్వ్యూ చేశాను. అంతేకాకుండా ఆ రాత్రి జరిగిన దాడి సంఘటనల క్రమాన్ని పూర్తి వివరాలను తెలిపే పుస్తకంపై హక్కులను కూడా పొందాను. ("హోలీ ఆర్టిజాన్ : ఫరాజ్ హుస్సైన్ కథ" Holy Artisan: The Story of Faraaz Hossain అనే పుస్తకం). నేను వెళ్లి ప్రజలను కలిసిన ప్రతిచోటా వారు కొత్త బంగ్లాదేశ్ రూపొందుతుందనీ మెరుగైన కాలం ఒకటి వస్తుందని ఆశావహమైన మాటలే చెప్పారు. చూడండి! ప్రజలను సుదీర్ఘకాలం అణచిపెట్టి ఉంచినప్పుడు వారు నిరసనలతో ఉద్యమించే సందర్భం ఒకటి ఏర్పడుతుంది. అదే ప్రస్తుతం అక్కడ జరుగుతున్నది.

ఐదవ ప్రశ్న:– ప్రభుత్వం కూలిపోవటానికి దారి తీసిన తిరుగుబాటు గురించిన చాలా కథనాలు మీరు మళ్ళీ మళ్ళీ పోస్ట్ చేస్తున్నట్టున్నారు...

జవాబు:– ప్రస్తుత ఉద్యమం ఉగ్రవాదులు, ఛాందసవాదుల అండదండలతో సాగుతున్నట్లు మరొక భిన్న కథనం కూడా ఉంది. కానీ అది నిజం కాదు. నేను అక్కడి ప్రజలను కలిశాను. విభిన్న రంగాలకు చెందిన పౌరులు నిజమైన ఒక మార్పుని కోరుకుంటూ చురుకుగా పాల్గొంటున్న ఉద్యమం అది. వారు ఏ ప్రజాస్వామ్యంకై పోరాడుతున్నారో దాన్ని పొందనున్నారనే నేను ఆశిస్తున్నాను.

ఆరవ ప్రశ్న :– మీ సినిమా ఇప్పుడు బంగ్లాదేశ్‌లో విడుదల అవుతుందనే మీరు ఆశిస్తున్నారా?

జవాబు :– ఈ సినిమా ఎవరికోసమై ఉద్దేశించబడిందో ఆ సినిమా వారికి తప్పక అందుతుందనే నేను అనుకుంటున్నాను. ఆ నిషేధం వల్ల మేము ఆర్థిక సంబంధమైన ఇబ్బందులను బాగా ఎదుర్కొంటున్నాం. కానీ నేను ఎప్పుడూ ప్రజాస్వామ్యాన్నీ, స్వేచ్ఛనూ, సమానత్వాన్నీ, న్యాయాన్నీ సమర్థిస్తాను. వాటికే ఎప్పుడూ కట్టుబడి నిలుస్తాను. నా కృషి, నా సినిమాలు నిలబెట్టే విలువలు అవి, ఈ తరహా ఆలోచనలు కలిగిన సన్నిహితులతోనూ బయట ప్రపంచంతోనూ నేను సంఘీభావంతో నిలుస్తాను.

**(ఇంటర్వ్యూ చేసినది చంద్రిమా పాల్,**
**'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక, 8 ఆగస్టు 2024)**

అనువాదం : **దివికుమార్**

**పాట**

# లడ్డమ్మకు దండాలు

**– వై. నేతాంజనేయప్రసాద్**

దండాలు - దండాలు ఓ లడ్డమ్మా
నీ అండాదండా మాకుండాలమ్మా ॥ దం ॥

తనివి తీరగా నిన్నే తలచి
తన్మయత్వంతో మేమూగిపోతాం
ఉన్మాదము రేపి - ఉద్రిక్తతలు పెంచి
ఊహించని రీతి - ఉపద్రవమైరమ్మ ॥ దం ॥

కనికరముతో - కరుణించిమమ్ము
కల్పవల్లిలా కాంచంగరావమ్మ
భక్తి పారవశ్యమున మునిగాము
ముక్తిమార్గము మాకు చూపమ్మా ॥ దం ॥

ఉప్పులో - పప్పుల్లో - నీళ్ళలో పాలల్లో
మందుల్లో మాకుల్లో మొత్తంగ కల్తీలు
రోగాల రొప్పుల్ల మాకెంత చేటైన
చీకు చింతా మాకు ఇసుమంత లేదు ॥ దం ॥

అత్యాచారాలూ - ఆకలిచావులూ
ఆత్మహత్యలూ - అరాచకాలూ
విధ్వంసాలూ - విద్వేషాలెన్నయినా
చలించబోము - భరించగలమూ ॥ దం ॥

సంపన్నులాస్వామి - సంపదల ఆసామి
సక్కంగ మముజూడ - నిక్కంగ నిలువమ్మ
నీతి బీతి మరచి - ఖ్యాతి పొందంగ మేమూ
నాటు బాంబువై పేలి - ఓటు బ్యాంకుగ మారు ॥ దం ॥

## పుస్తక పరిచయం

# "నిఖిల లోకం"

**- కొత్తపల్లి రవిబాబు**

**కె. యాదవరెడ్డిగా** తెలుగు సాహిత్యలోకంలో ప్రవేశించి, దిగంబర కవిగా పరివర్తనం చెంది, విప్లవ కవిగా ఎదిగిన నిఖిలేశ్వర్ తన 85వ ఏట (2023) రాసి మరణించిన తన తల్లి, సహచరి యామిని (భూలక్ష్మి)లకు అంకితం ఇచ్చిన ఆత్మకథ ఇది.

నిఖిలేశ్వర్ తలిదండ్రులు కుంభం (సురవరం) నరసమ్మ, కుంభం నరసయ్య. నిఖిలేశ్వర్‌కు సంవత్సరం నిండకుండానే తండ్రి 1939లో మరణించారు. తల్లి తమ స్వస్థలం భువనగిరి వద్ద వీరవల్లి గ్రామం నుండి హైదరాబాదు చేరి, వజీర్ సుల్తాన్ టుబాకో ఫ్యాక్టరీలో 30 ఏళ్ళపాటు అవిశ్రాంతంగా పనిచేసి, కొడుకును ప్రయోజకుడిగా చదివించి పెంచి 2010లో మరణించింది. 1960లో లేబర్ కాలనీలో ఫ్యాక్టరీవారు నామమాత్రపు అద్దెకు కేటాయించిన ఇంట్లో 1960 నుండి 30 ఏళ్ళపాటు వున్నారు.




నిఖిలేశ్వర్ విద్యాభ్యాసం సికింద్రాబాద్‌లోని రాణీగంజ్ వీధిబడిలో ప్రారంభమైంది. ఆ తర్వాత సుల్తాన్ బజారులోని ఒక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతిదాకా చదివారు. రజాకార్ల దౌర్జన్యాల కాలంలో అమ్మతోపాటు వారి అమ్మమ్మ వూరు వీరవల్లి చేరారు.

ఆయన బాల్యం కొంత దాయరాబస్తీలో గడచింది. తర్వాత బాకారంలో ఒకే గది వున్న ఇంట్లో హైస్కూలు చదువు ముగిసేవరకు 1950 నుండి 1960 వరకు వున్నారు. అక్కడ గౌడు, కుమ్మరి, చాకలి, గొల్ల, క్రైస్తవుల మధ్య ఆయన తిరిగారు. తన 14వ ఏట ఆరో తరగతి చివరి రోజుల్లో ఇంట్లో అమ్మదాచిన బంగారం బిళ్ళ దొంగిలించి, దానిని అమ్మి, ఆ డబ్బు తీసుకొని విజయవాడలో బతకాలని రైలు ఎక్కి, అది కదలబోతున్న సమయాన అమ్మ, మిత్రులు జ్ఞాపకం వచ్చి, రైలు దిగి, ఆ రాత్రంతా అక్కడే పడుకొని రెండు రోజుల తర్వాత ఇంటికి చేరారు.

1957-59 మధ్య కాలం సాహిత్యరంగంలో ఆయనకొక నిర్ణయాత్మక దశ. ముషీరాబాద్‌లో అభ్యుదయ యువక సంఘం స్థాపించి రీడింగ్‌రూమ్‌ను నిర్వహించడంలో ఒకరయ్యారు. ఆ కాలంలోనే శరత్, చలం, గోపీచంద్, ప్రేమచంద్, ఠాగూర్, కరుణశ్రీ, శ్రీశ్రీ - దేశోద్ధారక గ్రంథమాల ప్రచురణలు విరివిగా చదివారు. సంప్రదాయ కవులను కొంత అర్థం చేసుకున్నారు. గీతా ప్రెస్‌వారి గ్రంథాలు, పౌరాణిక గ్రంథాలు చదివి వాటి ప్రభావంతో తమిళనాడులోని పుణ్యక్షేత్రాలన్నీ చూచి వచ్చారు.

1952-53 నాటి ముల్కీ ఉద్యమంలో ఏడవ తరగతి విద్యార్థిగా ఊరేగింపులో పాల్గొని పోలీసుల తుపాకీ తూటా నుంచి తప్పించుకున్నారు. ఏకాదశి ఉపవాసాలు పాటిస్తూ తన గ్రామ సమీపంలో కొండపై వున్న భువనగిరి కోటకు మంచినీళ్ళు కూడా లేకుండా తానొక్కడే ఎక్కి, దిగేటప్పుడు స్పృహ తప్పి పడిపోయే స్థితికి వచ్చి, సమీపంలో వున్న ఇంటిలో మంచినీళ్ళు తాగి మృత్యువు నుండి బయటపడ్డారు.

### కులాంతర ప్రేమ వివాహం

నిఖిల్ బాకారం బస్తీలో వున్న కాలంలో భూలక్ష్మి ఆమె బంధువుల ఇంటికి బాకారం వచ్చేది. ఆమె 9వ తరగతి విద్యార్థిని. 1959లో వీరి మధ్య ప్రేమ వ్యవహారం తెలిసి, ఆ అమ్మాయితో సంబంధం పెట్టుకోవద్దని పెద్దలు నిఖిల్ చేత హామీ రాయించుకున్నారు. అయితే 1963 మార్చిలో హెచ్.ఎస్.సి పరీక్షల ఆఖరి రోజున భూలక్ష్మి (యామిని) నిఖిల్ వద్దకు రాగా, అదే రోజున ఆర్యసమాజ మందిరంలో జ్వాలాముఖి తదితరుల సహాయంతో వారు పెళ్ళి చేసుకున్నారు. అదేరోజు సాయంత్రం విజయవాడకు, అక్కడి నుండి బెంగుళూరు, మైసూరు, తిరుచిరాపల్లి, శ్రీరంగం, మద్రాసు తిరిగి వచ్చారు. 1958-63 మధ్య ఐదేళ్ళపాటు ప్రేమ వ్యవహారంలో వున్న కాలంలో నిఖిల్ ఎన్నో ప్రేమ, విరహ, స్నేహగీతాలు రాసి పాడేవారు.

వీరిది కులాంతర వివాహం. నిఖిల్‌ది, రెడ్డి కాపు కులం. యామినిది, గొల్ల (యాదవ) కులం. ఆ తర్వాత కాలంలో నిఖిల్, జ్వాల తమ కుటుంబాలలో కులాతీత, మతాతీత సంప్రదాయాలను ఆచరించడమేగాక,

ఎన్నో ప్రాంతాల్లో కులాంతర వివాహాలు తమ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమస్యలు వచ్చిన సందర్భాలలో నూతన దంపతులకు ఆశ్రయమిచ్చారు.

1964లో మద్రాసులో ఎయిర్‌ఫోర్సు శిక్షణా కేంద్రంలో గుమస్తాగా పనిచేసిన కాలంలో అక్కడ పత్రికలలో పనిచేస్తున్న రచయితలతో నిఖిల్ పరిచయం చేసుకున్నారు. 1964 చివర్లో 'గోలకొండ పత్రిక'లో చేరారు. ప్రైవేటుగా సైకాలజీ ఎం.ఏ.లో చేరారు. కాని పూర్తి చేయలేదు. 1965 మార్చిలో 'గోలకొండ పత్రిక'లో పూర్తికాలం సబ్ ఎడిటర్‌గా 150 రూపాయల జీతంతో చేరారు.

1966లో కేశవ మెమోరియల్ బాలుర హైస్కూలులో ఇంగ్లీషు ఉపాధ్యాయునిగా చేరినా, కొంతకాలం తెలుగు, సాంఘికశాస్త్రం కూడా 30 ఏళ్ళు బోధించారు. ఎం.ఏ. పూర్తిచేసి కళాశాలలో అధ్యాపకునిగా పనిచేయాలనుకున్న ఆయన కోరిక తీరలేదు. 1971లో ఇన్ సర్వీస్ టీచరుగా బి.ఇడి పట్టా పొందారు. కేశవ మెమోరియల్ స్కూలు నిర్వాహకులు ఆర్య సామాజికులు కావడంతో నిఖిలేశ్వర్ సాహిత్య, సామాజిక కార్యక్రమాలకు వారు అభ్యంతరం చెప్పలేదు. పైపెచ్చు కె.కె.ఆర్, ఊర్మిళల కులాంతర వివాహం ఆ స్కూలులోనే తాపీ ధర్మారావు అధ్యక్షతన నిర్వహించారు.

వచన కవిత్వం రాస్తున్న ఆరుగురు మిత్రులు 1965 మార్చి నెలలో 12వ తేదీన అబిడ్స్‌లోని ఓరియంటల్ హోటల్‌లో సమావేశమై తమ పాత పేర్ల స్థానంలో కొత్త పేర్లు పెట్టుకొని దిగంబర కవులుగా ప్రకటించుకొని, మే 6వ తేదీన వారి మొదటి కవితా సంపుటి 'దిగంబర కవులు'ను అర్ధరాత్రి 11:55కు రిక్షా కార్మికుడు నాంపల్లి పాండుతో ఆవిష్కరింపచేశారు. 1966 డిసెంబరు 19న అర్ధరాత్రి విజయవాడ గవర్నర్‌పేట సెంటర్‌లో రెండో సంపుటిని హోటల్ క్లీనర్ జంగాల చిట్టితో కార్మిక శక్తికి ప్రతీకగా ఆవిష్కరించారు. 1968 జూన్‌లో విశాఖపట్టణంలో లక్ష్మీటాకీస్ సెంటర్లో 'నేటి కుష్టు వ్యవస్థపై దిగంబర కవులు' మూడో సంపుటిని ఈ వ్యవస్థ వేశ్యగా మార్చిన యడమనూరి యశోదచే ఆవిష్కరింపచేశారు. ఈ మూడు సంపుటాలపై వాదవివాదాలు జరుగుతున్న కాలంలో శ్రీకాకుళ గిరిజన సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో రాస్తున్న రచయితలందరూ 1970లో విప్లవ రచయితల సంఘాన్ని స్థాపించగా నిఖిల్, జ్వాల, చెరబండరాజు, నగ్నముని దానిలో చురుకైన సంస్థాపక సభ్యులుగా చేరారు. విరసంలో నిఖిల్, జ్వాలల పాత్ర, విరసం ప్రణాళికలోని అంశాలపై అభిప్రాయ భేదాలు, నిఖిల్ విరసం కార్యదర్శిగా పనిచేస్తూ రాజీనామా చేయడం – అనంతపురం విరసం 5వ మహాసభలో విరసం నుండి బయటకు వచ్చి, జనసాహితీ సాంస్కృతిక సమాఖ్యలో పనిచేయడం, చివరకు ఏ సంస్థకూ సంబంధం లేకుండా వ్యక్తిగతంగా కృషి చేయడం మొదలైన విషయాలు సందర్భాన్ని బట్టి నిఖిల్ ప్రస్తావించారు.

విప్లవ సాహితీకారునిగా 1971లో నిఖిల్ పంజాబీ కవి జగతార్‌సింగ్ ఆహ్వానంపై జలంధర్‌లో జరిగిన పంజాబీ రచయితల సదస్సులో పాల్గొన్నారు. ఓపిడిఆర్ (ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ సంస్థ) కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొన్నారు. భోపాల్ భారత్ భవన్‌లో జరిగిన అఖిల భారత కవితా గోష్ఠిలో నాందేవ్ ధసాల్‌ను కలిశారు. వారి సాహిత్య యాత్రలో ఎందరో తెలుగు సంపాదకులతో పరిచయం చేసుకున్నారు. ఎబికె ప్రసాద్ నుంచి ఎంతో ప్రేరణ పొందారు.

కలకత్తా, అహమ్మదాబాద్, బరోడా, నగరాలలోని కవిసమ్మేళనాలలో పాల్గొన్నారు. ఓపిడిఆర్ వారి నిజనిర్ధారణ కమిటీలలో కృషిచేశారు. గ్రామీణ పేదల సంఘాల్లోనూ, భారత–చైనా మిత్రమండలి, డిఎస్‌వో (విద్యార్థి సంస్థ) కార్యక్రమాలలో ఉపన్యాసకునిగా ఆంధ్రప్రదేశ్ అంతటా పర్యటించారు.

ఈ స్వీయ చరిత్ర నాల్గవ భాగంలో 'కొన్ని వ్యక్తిత్వాలు – కొన్ని సదస్సులు' శీర్షికలో 40 మంది రచయితలు, మిత్రులు గురించీ, తన దేశ, విదేశీ పర్యటనల గురించి ఐదవ భాగంలోనూ, కుటుంబ విషయాలు, భార్య మరణం గురించి ఆరో అధ్యాయంలోనూ, 7, 8 భాగాలలో జ్ఞాపకాలు – అనుభవాలు రాశారు.

అయితే ఈ ఆత్మకథను నిఖిలేశ్వర్ ఒక ప్రణాళికాబద్ధంగా రాయలేదు. 'ప్రజాసాహితి' సంపాదకత్వం గురించి 12వ పేజీలోనే వచ్చింది. ఎక్కడా తాను పుట్టిన తేదీ (11.08.1938) రాయలేదు. తన 60 ఏళ్ళ సాహిత్య జీవితాన్ని సమీక్షించుకుంటూ నిఖిల్ ఈ క్రింది విధంగా రాశారు.

"గత 60 సంవత్సరాల కాలంలో నేను పయనించిన సాహిత్య మార్గంలో సాధించినది తక్కువే. అయినా సకాలంలో నా రచనలన్నీ సంపుటీకరింపబడి వుంటే నా స్థానం మరింత సుస్థిరంగా వుండేది. ఈ అసంతృప్తి లోలోపల నన్ను వెంటాడుతూనే వచ్చింది. బహుశా ఆ రకంగా నేను నా సాహిత్య జీవితంలో కొంత మూల్యాన్ని చెల్లించి, నా సృజనాత్మకత కాలాన్ని కోల్పోయి వుంటాను. ఉద్యమపరంగా సాగిపోయిన నా సాహిత్య యాత్రలో నేను కోల్పోయింది ఎక్కువ. పొందినది చాలా తక్కువ.

"ప్రస్తుతం బాగా పేరు తెచ్చుకున్న కొందరు రచయితలను పరిశీలిస్తే, రచన చేయడమే కాదు – దానికి తగిన స్థాయిలో ప్రచారాన్ని చేసుకోగలిగితేనే మనుగడ సాధ్యమని బోధపడింది" (పేజి 172)

"కవిత్వంతో మొదలై పత్రికా రచన, కథలు, వ్యాసాలు, అనువాదాలు, ఉపన్యాసాలదాకా నా రచనా ప్రపంచం విస్తరిల్లింది. పౌరహక్కుల ఉద్యమం, ఓపిడిఆర్ తదితర సభల్లో నేరుగా హిందీ, ఇంగ్లీషు ఉపన్యాసాలను వేలాదిమంది సమక్షంలో తక్షణం అనువదించి ప్రసంగించి ఒక ఛాలెంజ్‌గా స్వీకరించి నిర్వహించాను" (పేజి 209)

"1970 నుంచి ఈనాటిదాకా అంటే ఐదారు దశాబ్దాలపాటు రాజకీయంగా, సాహిత్యపరంగా అనేక ప్రాంతాలు తిరుగుతూ, ఉపన్యాసాలు ఇస్తూ చర్చల్లో పాల్గొంటూ నా సీరియస్ రచనా వ్యాసంగాన్ని నిర్లక్ష్యం చేశాను. చివరికి కవిత్వంలో నాదైన ప్రత్యేక ముద్ర సాధించుకున్నాను". (పేజి 209)

"సంస్థాగతమైన వ్యవహారాలు మొదలు 'ప్రజాసాహితి'కి రాసిన ఉత్తరాలు నా రచనా కాలాన్ని మింగేసాయి". (పేజి 210)

ఈ పేరాలన్నీ ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, కార్యదర్శిగా, జనసాహితి సంస్థాపక సభ్యునిగా, 'ప్రజాసాహితి' సంపాదకునిగా పనిచేసిన కాలంలో తన సృజనాత్మక కృషికి ఆటంకం కల్గినదనీ, ఆవిధంగా తన సాహిత్య యాత్రలో కోల్పోయింది ఎక్కువ, పొందినది చాల తక్కువ అని నిఖిల్ అభిప్రాయపడుతున్నారు. రచయితల సంఘంలో నాయకులు, సభ్యులు అందరూ రచయితలే కదా వుంటారు. మరి ఎవరికి వారు సంస్థాగత కార్యక్రమాలు తమ సృజనాత్మక కృషికి ఆటంకం కల్గిస్తాయనుకుంటే, ఉద్యమ అవసరాలకు ఎవరు మిగుల్తారు. ఈ రచయితల ప్రజానుకూల భావజాల ఉద్యమ ప్రచారానికి, తద్వారా ప్రజల్లో గుర్తింపు పొందటానికి ఉద్యమ వేదికలు ఉపయోగపడ్తున్నాయి గదా! సంస్థాగత కృషి చేస్తూనే నిఖిలేశ్వర్ తానే చెప్పుకున్నట్లు చివరికి కవిత్వంలో తనదైన ప్రత్యేక ముద్ర సాధించారు కదా! అనేక కార్యక్రమాలు "ఒక ఛాలెంజ్‌గా స్వీకరించి నిర్వహించడం" ద్వారానే ఈరోజు సాహిత్య లోకం నిఖిలేశ్వర్ స్వీయ చరిత్రను చదవాలనే ఉత్సుకత చూపిస్తోంది. నిఖిలేశ్వర్ లాంటివారికి అనేక వేదికలు కల్పించిన ఉద్యమ కార్యకర్తలు, వేదికల ఏర్పాటు నిమిత్తం తమ శక్తియుక్తులను ధారపోసినందువల్ల తామెంతో కోల్పోయామని భావిస్తే, వారు పొందిన నష్టాన్ని ఎవరు పూడుస్తారు?

2020లో కేంద్ర సాహిత్య అకాడమీ నిఖిలేశ్వర్ 'అగ్నిశ్వాస' కవితా సంపుటికి ఇచ్చిన అవార్డు స్వీకరిస్తూ, 'అవార్డులు తీసుకోవడం అనైతికం కాదు, ఆత్మవంచనా కాదు".... వర్తమాన స్థితిలో రచయితలు "ప్రజల గొంతుగా, అనధికార ప్రతిపక్షంగా రచయితలు తమ రచనా నిబద్ధతను నిరూపించుకోవలసిన అవసరం ఏర్పడింది. అవార్డులు పొందినా, పదవులు చేబట్టినా ఎవరి పక్షాన మిగిలిపోయారన్నది ముఖ్యం. సెల్ఫ్ ప్రమోషన్ దారి తప్పకుండా మాతృభాషకు ఏ మేరకు సేవ చేశారన్నదే గీటురాయి" (పేజి 201) అంటూ ప్రభుత్వ అవార్డులు ప్రజా రచయితలు తీసుకోకూడదనే వారికి సమాధానంగా చెప్పారు. ఇది చర్చనీయాంశం.

ప్రజాసాహిత్య, సాంస్కృతికోద్యమంలో జ్వాలాముఖి, నిఖిలేశ్వర్‌లు జంటగా కృషి చేశారు. అత్యధిక సభల్లో ఇద్దరూ వుండేవారు. వారి కుటుంబాలు కూడా సన్నిహితంగా వుండేవి. కనుక జ్వాల గురించి నిఖిల్ చాల తక్కువ చెప్పారనిపించింది. వ్యక్తిగత విషయాలు కాదు కాని, సాహిత్యపరమైన విషయాలు, వాద వివాదాలు మొదలైనవి వివరిస్తే ఈ తరం సాహితీ ప్రియులకు కనువిప్పుగా వుండేవి. మొత్తంమీద నిఖిల్ స్వీయచరిత్ర అసమగ్రంగా వుందనిపిస్తుంది. కనుకనే కె. శ్రీనివాస్ దీనిపై 'సౌజన్యుడి జీవయాత్ర' అంటూ రాసిన పరిచయ వ్యాసంలో నిఖిలేశ్వర్ జీవితంలో రాయబడని భాగాలు, విస్తరించవలసిన విశేషాలు ఎన్నో మిగిలిపోయాయి. పూరించవలసినవి అనేకం ఉండిపోయాయి" అన్నారు కనుక ఈ ఆత్మకథకు రెండోభాగం మనందరం ఆశిద్దాం.

ఇది ఎమెస్కో ప్రచురణ. వెల : రూ. 150/-

**కవిత**

# రాతిరి ఉదయించే సూర్యుడు

– గవిడి శ్రీనివాస్

ఎన్నాళ్ళని భరిస్తావ్
ప్రశ్నల సుడిగుండమై
లేఖలు గుప్పిస్తావ్

అదవంత మనసు పెట్టుకుని
సింహంలా పంజా విసురుతూ
ఎర్రెర్రని ఏరులా ప్రవహిస్తావ్.

మాటల తూటాలు పేలుతుంటాయ్
తూటాలు అన్యాయాన్ని ప్రశ్నిస్తుంటాయ్.

ధర్మం అణచివేయబడ్డప్పుడు
రాతిరి సూరీడు ఉదయిస్తాడు.

బానిస కళ్ళల్లో
సంతోషమై ప్రకాశిస్తాడు.

మత చిచ్చుతో
మంటలు రేగుతున్నప్పుడు
కులం రగడలో కూరుకుపోయినప్పుడు
రాతిరి సూరీడు ఉదయించాలి.

ఆకతాయిల అఘాయిత్యాలకు
అబలలు ఆహుతౌతున్నపుడు
రాతిరి సూరీడు ప్రజ్వలించాలి.

కన్నీటి తెరలు దింపి
మరో ఉషోదయానికి
ఆత్మరక్షణ కత్తులు మెరవాలి.

జనారణ్యంలో
ఆక్రోశాన్ని అందిపుచ్చుకోవాలి.

పొద్దున ఉదయించే సూర్యుడు
న్యాయ రక్షణకు
వేయి కళ్ళతో
రాతిరీ ఉదయించాలి.

సినిమా సమీక్ష

# చైనా అభివృద్ధి నమూనాను అభివర్ణించే

# ఒక డ్యామూ - రెండు సినిమాలు

- బాలాజీ (కోల్‌కతా)

'**పిల్లి** నల్లదా తెల్లదా అన్నది కాదు ముఖ్యం, ఎలుకల్ని పట్టగలిగితే అది మంచి పిల్లే' – చైనా అవలంబించాల్సిన పంథా గురించి డెంగ్ జియావో పింగ్ చేసిన వ్యాఖ్యానమిది. ఈ మాట వెనక కుట్రను చైర్మెన్ మావో ఆ రోజుల్లోనే పసిగట్టాడు. 'ఈయనకు వర్గ పోరాటం అర్థమైనట్టు లేదు. ఏనాడూ దాన్ని గురించి మాట్లాడలేదు. ఇప్పుడీయన చెబుతున్న 'నల్ల పిల్లి, తెల్ల పిల్లి' సిద్ధాంతం సామ్రాజ్యవాదానికీ, మార్క్సిజానికీ మధ్య తేడానే పట్టించుకోవడం లేదు.' అని మావో విమర్శించాడు. మిగతాదంతా చరిత్ర. చైనా దేశం రియాక్షనరీల చేతుల్లోకి వెళ్ళిపోయింది. అది అవలంబించిన నమూనా అసమానతల్ని పెంచింది. నేడు అమెరికా కంటే ఎక్కువ మంది బిలియనీర్లు చైనాలో ఉన్నారు.




భారీ డ్యాముల్ని నెహ్రూ ఆధునిక దేవాలయాలన్నాడు. అలాంటి ఆలోచన ఆనాటి చాలా మంది దేశాధినేతలది. చైనా యాంగ్జీ నదిపై ఆనకట్ట కట్టాలన్నది సన్ యట్ సేన్ కాలపు ఆలోచన. దాన్ని మావో కూడా సమర్థించాడు. 1956లో 'ఈత' అనే కవిత కూడా రాశాడు. కానీ ప్రకృతిపై యుద్ధంలా సాగే భారీ కృత్రిమ నిర్మాణాలన్నీ బలిగోరే పర్యావరణ, మానవమూల్యాలు లెక్కలేనన్ని! ఈ సంగతులన్నీ ప్రస్తావించే చైనా డాక్యుమెంటరీ 'అప్ ది యాంగ్జీ'.

### అప్ ది యాంగ్జీ (2007) (దర్శకుడు – యంగ్ చాంగ్) :

యాంగ్జీ నదిపై భారీ డ్యాము నిర్మాణ కార్యక్రమం 1994లో ఆరంభమైంది. ఇది ప్రపంచంలోనే అతి భారీ ఆనకట్ట. లోయ అడుగు నుంచి 50 అంతస్థుల భవనమంత ఎత్తు ఉంటుంది. ఈ ఆనకట్ట 400 మైళ్ళు పొడవున్న రిజర్వాయిర్‌లో 1.39 ఘనపు అడుగుల నీటిని నిల్వ ఉంచగలదు. 20 వేల మెగావాట్ల జలవిద్యుత్తును ఉత్పత్తి చేసి చైనా పారిశ్రామికీకరణను వేగవంతం చేయగలదు. (అది కమ్యూనిస్టు విధానంలోనా లేక పెట్టుబడిదారీ విధానంలోనా అన్నది వేరే విషయం.) ఈ నీటి నిల్వల ప్రణాళిక వల్ల చాలా జీవ వైవిధ్యమున్న సారవంతమైన నేలలూ, చారిత్రక ప్రాధాన్యత గల పట్టణాలూ, పౌరాణిక ప్రాధాన్యత గల 1000 స్థలాలూ మునిగిపోతాయి. మొత్తంగా 20 లక్షల మంది భూముల్నీ, జీవనోపాధినీ కోల్పోతారు. రైతులూ, మానవహక్కుల కార్యకర్తలూ, పర్యావరణ వేత్తలూ, చరిత్రకారులూ, పురాతత్వవేత్తలూ ఇలా ఎంతమంది వ్యతిరేకించినా ఈ డ్యాము నిర్మాణం ఆగలేదు.

యాంగ్జీపై నిర్మిస్తున్న ఈ ఆనకట్ట పేరు త్రీ గోర్జెస్ డ్యామ్. ఈ డ్యాము 2009 సరికి పూర్తయితే ఆ నదీ లోయ ప్రాంతపు రూపు రేఖలే మారిపోతాయి. ఆ అందాలూ, గ్రామాలూ, చారిత్రక స్థలాలూ, చిన్న చిన్న నగరాలు కూడా శాశ్వతంగా మాయమౌతాయి. అందుకే విదేశీ పర్యాటకులకు ఆ లోయ చివరి దర్శనం చేయించడానికి ఆ నదిలో క్రూయిజ్ షిప్పుల టూరిస్టు పరిశ్రమ వెలసింది. ఈ షిప్పుల్ని 'ఫేర్‌వెల్ క్రూయిజ్'లంటారు. ఇలాంటి ఒక షిప్పులో 2002లో తన తల్లిదండ్రులూ, తాతయ్యతో సహా ప్రయాణించాడు కెనడాలో ఉండే చైనీయుడైన ఈ సినిమా దర్శకుడు. దర్శకుడికి తన తాతయ్య యాంగ్జీ నది గురించి చాలా కథలు చెప్పేవాడు. ఆ నది పక్కనే ఫెంగ్డూ అనే పౌరాణిక ప్రాముఖ్యత గల నగరం వుంది. పురాణాల్లో దాన్ని 'నరక ద్వారం' అని అంటారు. దర్శకుడు తన టూర్‌లో భాగంగా ఈ నగరాన్ని కూడా సందర్శించాడు. ఈ నగరం ఇక నీట మునగబోతోంది.

"The mountain goddess, if she is still there;
Will marvel at a world so changed."

మావో కవితలోని ఆఖరు వాక్యాలివి.

డ్యాము సృష్టిస్తున్న విధ్వంసాన్ని చూసిన దర్శకుడికి ఈ త్రీ గోర్జెస్ డ్యామే ఒక 'నరక ద్వారం' అనిపించింది. డ్యాము నిర్మాణంతో పాటు

చైనాలో చోటుచేసుకుంటున్న మార్పుల్ని వివరించడానికి ఒక డాక్యుమెంటరీ నిర్మించాలనుకున్నాడు. భారీ నిర్మాణాలు మానవ జీవితాలను ఎలా ప్రభావితం చేస్తాయి అన్న సంగతిని వివరించడానికి దర్శకుడు ప్రధానంగా ముగ్గురు వ్యక్తుల్ని ఎంచుకున్నాడు.

మొదటి వ్యక్తి యూ టింగ్ జున్. యాంగ్జీ నదీ తీర ప్రాంతంలోనే రెండు సార్లు నిర్వాసితుడైన రైతు ఈయన. ఒకప్పుడు ఇతని తండ్రిపై విప్లవ ప్రతీఘాతకుడు అన్న ముద్ర పడింది. అంచేత యూ టింగ్ జున్ పరివారం ఫెంగ్డూ దగ్గర యాంగ్జీ వొడ్డున అక్రమ పౌరుల్లా బ్రతుకుతున్నారు. చిత్తడి నేలలో ఒక పాక వేసుకుని కొద్దిపాటి పంట పండించుకుంటూ చాలీచాలని జీవితం గడుపుతున్నారు. ఇప్పుడు ఆ నేల కూడా నీట మునగబోతోంది. అక్రమ పౌరులు గనుక వారికి నష్టపరిహారం దొరికే అవకాశం కూడా లేదు.

రెండో వ్యక్తి యూ టింగ్ జున్ కుమార్తె యూ షుయ్. ఆమెకు పదహారేళ్ళు. చదువుల్లో చురుకైనది. సైంటిస్టు కావాలన్నది ఆమె కోరిక. కానీ ఇల్లు గడవడానికి ఆమెను పనిలో పెట్టాలని నిర్ణయించారు ఆమె తల్లిదండ్రులు. విక్టోరియా క్రూయిజ్ లైను ఓడలో విదేశీ ప్రయాణికులకు సేవచేసే ఉద్యోగంలో చేరిందామె. విదేశీ టూరిస్టుల కోసం ఆమె పేరు 'సిండీ'.




చెన్ బో యూ పంతొమ్మిదేళ్ళ అబ్బాయి. మధ్య తరగతిలో పుట్టిన ఏకైక సంతానం. బాధ్యతలు లేని జీవితం. ఇంగ్లీషు బాగా మాట్లాడతాడు. పాటలు పాడతాడు. క్రూయిజ్‌లో ఉద్యోగం డాలర్ల టిప్పులు రాల్చుతుందని అతడి అభిప్రాయం. క్రూయిజ్‌లో అతడి పేరు 'జెర్రీ'.

ప్రయాణికులతో ఎలా మసలుకోవాలో బాస్ తన పనివాళ్ళకు వివరిస్తాడు. ఒకప్పుడు అమెరికా లాంటి యూరప్ దేశాలను శత్రువులుగా చూశాం కానీ ఇప్పుడు మనకు వారితో మంచి సంబంధాలున్నాయని చెబుతాడు వారి బాస్. ప్రయాణికులతో అనవసర రాజకీయ సంభాషణలు చేయవద్దని కూడా జాగ్రత్తలు చెబుతాడు. ఈ మాటల్లో ఆధునిక చైనా రూపురేఖలు మనకు స్పష్టమౌతాయి. అభివృద్ధి పేర ప్రజల్ని తమ సొంత భూముల్నుంచి తొలగించడంలో చైనా అధికారులూ, పోలీసులూ అమానవీయ పద్ధతులు అనుసరిస్తారని తన స్వానుభవాన్ని చెబుతూ కన్నీళ్ళు పెట్టుకుంటాడు బొమ్మల విక్రేతగా బ్రతుకీడ్చుతున్న ఓ నిర్వాసితుడు.

జీవితానికి అవసరమైన జ్ఞానాన్ని మూడు మార్గాల్లో సంపాదించవచ్చని చైనీస్ తత్వవేత్త కన్ఫ్యూషియస్ చెబుతాడు.

"ఆత్మావలోకనం ద్వారా జ్ఞానాన్ని పొందడం గొప్ప పద్ధతి.
అనుకరణ ద్వారా పొందడం సులువైన పద్ధతి.
అనుభవపూర్వకంగా పొందేది చేదైన పద్ధతి."

ఈ కొటేషన్‌తో మొదలౌతుంది సినిమా. సర్వమానవ సమానత్వం అనే ఆశయాలతో ప్రయాణమైన చైనా ఎప్పటికప్పుడు ఆత్మావలోకనం చేసుకుంటూ సాగితే అది అందరికీ మేలు చేసే గొప్ప పద్ధతి అయ్యుండేది. కానీ అది పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాల్ని అనుకరించడమనే సులువైన పద్ధతిని ఎంచుకుంది. దాని ఫలితంగా రైతాంగానికీ, పేదలకూ, కార్మికులకూ చేదైన అనుభవం మిగిలింది అని దర్శకుడు సినిమా ద్వారా చెప్పకనే చెబుతాడు. సండేన్, వాంకోవర్, టొరంటో, సాన్ ఫ్రాన్సిస్కో వంటి ఎన్నో చలనచిత్రోత్సవాల్లో ప్రశంసలూ, అవార్డులూ అందుకుంది ఈ సినిమా.

**స్టిల్ లైఫ్ (2006) (దర్శకుడూ జియా జాంగ్కే) :**

యాంగ్జీ నదిపై సిచువాన్‌లో ఉన్న నగరం ఫెంగ్జీ. 2000 ఏళ్ళ చరిత్ర ఉన్న నగరమిది. హాన్ రాజవంశపు కాలం నాటి పద్యాల్లో ఈ నగరం గురించి చాలా వర్ణనలున్నాయి. త్రీ గోర్జెస్ డ్యామ్ మూడవ దశ నిర్మాణంతో ఆ నగరం నీట మునగబోతోంది. ఈ నేపథ్యంలో వచ్చిన కథాచిత్రం 'స్టిల్ లైఫ్'.

షాంగ్సీ బొగ్గు గని కార్మికుడు హాన్ సాన్మింగ్. ఫెంగ్జీ మునిగిపోతోందని తెలియగానే 16 సంవత్సరాల క్రితం తన నుండి వేరైన తన భార్య మిస్సీనీ, అంత కంటే ముఖ్యంగా యుక్తవయస్సుకు వచ్చిన తన కుమార్తెనీ చూడాలని ఆరాటపడుతూ అక్కడికి వచ్చాడు. వారు ఒకప్పుడు నివాసముండిన వీధి ఆనవాళ్ళు లేవు. అది నీటిలో మునిగిపోయింది. తన వారి ఆచూకీ తెలుసుకోడానికి బావమరిది దగ్గరికి వెళతాడు హాన్. భార్య ఓ పడవలో పనిచేస్తోందని తెలుస్తుంది. సెలవు దొరికినప్పుడు ఫెంగ్జీకి వస్తుంది. ఆమె రాకకై ఎదురుచూస్తూ, భవనాల కూల్చివేత ఉద్యోగంలో చేరుతాడు హాన్. కూలిన కుటుంబాన్ని సర్దుకోడానికి వచ్చినవాడు ఇళ్ళను కూల్చే ఉద్యోగం చేస్తున్నాడు. ఇతడి కథతో పాటు సమాంతరంగా మరో కథ నడుస్తుంది.

తైయువాన్‌కు చెందిన షెన్ హాంగ్ అనే నర్సు తన భర్త గువో బిన్‌ను వెదకడానికి అదే ఫెంగ్జీకి వస్తుంది. రెండేళ్ళుగా ఆమె తన భర్తను కలుసుకోలేదు. అతడు పనిచేసే కర్మాగారం మూతబడింది. ప్రస్తుతం దాన్ని కూల్చేస్తున్నారు. ఫెంగ్జీ నగరంలో భవనాల్ని కూల్చివేసే కూలీల్ని సప్లై చేసే సిండికేట్లు పుట్టుకొచ్చాయి. అటువంటి ఒక సిండికేట్

అధినేత్రికి సన్నిహితుడిగా, కూల్చివేతల పనులు పర్యవేక్షిస్తున్నాడు షెన్ భర్త. షెన్ తన భర్త అడ్రసును కనుక్కోవడానికి వాంగ్ డాంగ్మింగ్ అనే ఆయన దగ్గరికి వెళుతుంది. ఆయనొక పురాతత్త్వవేత్త, షెన్ భర్త స్నేహితుడు. పురాతత్త్వ ప్రాధాన్యత గల చాలా ప్రదేశాలు నీట మునగ బోతున్నాయని ఇదివరకే తెలుసుకున్నాము. అటువంటి ఒక సైటులో అత్యవసర త్రవ్వకాలు జరిపే పనిలో ఉన్నాడు వాంగ్. మొత్తానికి షెన్ తన భర్తను కలుస్తుంది. తను తన కొత్త ప్రేమికుడితో పెళ్ళి చేసుకోవాలంటే భర్త నుండి విడాకులు కావాలి ఆమెకు. తన పని ముగించుకుని తన కొత్త ప్రేమికుడిని కలుసుకోడానికి వెళిపోతుంది షెన్.

మరోవైపు హాన్ కూడా తన భార్యను కలుస్తాడు. తమ కుమార్తె దక్షిణాన చాలా దూరాన వున్న డోంగువాన్ అనే నగరంలో పనిచేస్తోందని చెబుతుంది అతడి భార్య. కుమార్తె ఫోటోను అపురూపంగా చూసుకుంటాడు హాన్. తన భార్యను తనకు అప్పగించమని ఆమె కొత్త యజమానిని వేడుకుంటాడు. ఆమె అన్నయ్య (హాన్ బావమరిది) తన వద్ద తీసుకున్న 30,000 ఆరెమ్బీల రుణాన్ని చెల్లించేసి తీసుకు పోవచ్చని చెబుతాడతడు. ఇప్పుడా డబ్బు సంపాదించాలి. తన భార్యను విడిపించాలి. కూలిన తన ఇంటిని పునర్నిర్మించుకోవాలి. ఆ ధ్యేయంతో ప్రమాదకర గనుల్లో పని చేయడానికి తిరిగెళ్ళిపోతాడు హాన్.

తెరపై నిరంతర సంఘటనల పరంపర చూపే వ్యాపార సినిమా కాదిది. అసహాయ జీవితాలంత నెమ్మదైన సినిమా. సంఘటనలతో కాక దృశ్యాలతో కథ చెప్పే కవితాత్మక సినిమా. చైనాలో ఈ తరహా సినిమాల నిర్మాణంలో తనదైన ఓ స్థానం ఏర్పరుచుకున్నాడు దర్శకుడు జియా జాంగ్మిన్.

'స్టిల్ లైఫ్' అంటే స్తబ్ద జీవితం. హాన్ తన భార్యను కలుసుకునే వరకూ ఎదురుచూస్తున్నాడు. బంధాన్ని కలుపుకునేంత వరకూ అతడిదో స్తబ్ద జీవితం. షెన్ తన భర్తను కలుసుకోవడానికి ఎదురుచూస్తోంది. బంధాన్ని తెంచుకునే సువర్ణావకాశం దొరికే వరకూ ఆమెది మరో స్తబ్ద జీవితం. ఈ పాత్రధారులతో పాటు నీట మునిగే ఘడియ వరకూ ఎదురుచూస్తూ ఆ నగరానిదీ స్తబ్ద జీవితమే.

ముందు చెప్పుకున్న డాక్యుమెంటరీలానే ఇందులో కూడా ప్రధాన పాత్రదారుల్లో ఒకరు నిరుపేద అయితే మరొకరు మధ్య తరగతికి చెందిన వారు. పాత్రల భావాలకు చిహ్నంగా ఈ సినిమా 'సిగరెట్లు', 'లిక్కర్', 'టీ', 'టాఫీ' అనే నాలుగు అధ్యాయాలుగా సాగుతుంది.

హాన్ హొటల్ యజామానికి సిగరెట్ ఆఫర్ చేస్తాడు. బ్రదర్ మార్క్ అనే కుర్రాడికి కూడా సిగరెట్ ఆఫర్ చేస్తాడు. ఇక్కడ 'సిగరెట్' కొత్త వాళ్ళతో స్నేహాల్ని కలుపుతుంది. బ్రదర్ మార్క్ సిగరెట్ తాగడంలో తన అభిమాన పాప్ సింగర్ స్టయిల్‌ను అనుకరిస్తున్నాడు. చైనా యువకుల్లో నిరుద్యోగం, నేర ప్రవృత్తి పెరుగుతున్నాయి. గ్యాంగ్ తగాదాలే మార్క్ మరణానికి దారితీశాయి. చనిపోయిన మార్క్ పటానికి కాల్చిన సిగరెట్లు సమర్పిస్తాడు హాన్. తన తోటి స్నేహితులకు వీడ్కోలు చెప్పడం కూడా సిగరెట్లు ఇవ్వడం ద్వారానే!

'లిక్కర్' విరోధాలు పోగొట్టి స్నేహాలు కుదిర్చే సన్నివేశాల్లో కనిపిస్తుంది. బావమరిది మొదట్లో తను తీసుకొచ్చిన సారాయి బాటిళ్ళను నిరాకరిస్తాడు. హాన్ తన భార్య యజమానితో కలిసి సారా తాగడం ఒక ఒప్పందానికి దారి ఏర్పరుస్తుంది. వీడ్కోలుకు ముందు సాగిన మందు పార్టీ స్నేహితుల మధ్య వున్న స్నేహ గాఢతను చూపిస్తుంది. సిగరెట్లు, మద్యం చైనీస్ అధికారుల్లో పెరిగిపోతున్న లంచగొండితనాన్ని కూడా సింబాలిక్‌గా చూపుతాయి. నష్టపరిహారాల పంపిణీలో అవకతవకలకు జరుగుతున్నట్టు ఒక సినిమాలోని ఒక దృశ్యం చూపుతుంది.

భర్త వార్డ్ రోబ్‌లో మిగిలివున్న టీ పొట్లం సంపర్కహీనతను సూచిస్తుంది. షెన్ తను ఒక్కతే టీ తాగడాన్ని మనం గమనించవచ్చు.

'టాఫీ' (చాక్లెట్) అత్యంత సన్నిహిత సంబంధాన్ని సూచిస్తుంది. బ్రదర్ మార్క్ హాన్‌కు వైట్ రాబిట్ టాఫీ ఇస్తాడు. హాన్‌కు అతడి భార్య కూడా అదే టాఫీని మరో చోట అందిస్తుంది. ఈ రెండో దృశ్యాన్ని దర్శకుడు ఒక కావ్యంలా మలిచాడు. ఒక శిథిల భవనంలో భార్య తన భర్తకు టాఫీ ఇచ్చి తన ప్రేమను వ్యక్తపరుస్తుంటే దూరంలో భవనం పేల్చివేతకు గురౌతుంది. ప్రకృతి విధ్వంసం, పరివారాల విధ్వంసం, ఆవాసాల విధ్వంసం కలగలిసి కనిపిస్తాయి సినిమా పొడుగునా. సినిమాటోగ్రాఫర్ యూ లిక్ వాయ్ కిటికీల్నీ, ద్వారాల్నీ, శిథిల భవనాల్నీ, ధ్వంసమౌతున్న నిర్మాణాల్నీ దృశ్యకావ్యంలా తెరపై ఆవిష్కరిస్తూనే వుంటాడు. ఎగిరే పళ్ళేలు ఈ సినిమాలో రెండు సార్లు కనిపిస్తాయి. అవి అన్యగ్రహవాసుల వాహనాలు అన్న కథనాలు మనందరికీ తెలిసిందే. మాయమౌతున్న నగరాలూ, ఆ మాటికొస్తే మాయమౌతున్న భవనాలూ, మానవ బంధాలూ ఈ ఎగిరే పళ్ళేల రహస్యంలానే ఉన్నాయని మనకు సూచనప్రాయంగా చెబుతాడు దర్శకుడు. అలానే ఒక చోట కూలబోతున్న భవనం రాకెట్లా ఆకాశంలోకి దూసుకుపోవడం కూడా చాలా మార్మిక తాత్పర్యాన్ని అందిస్తుంది. కొన్ని సినిమాలు మళ్ళీ మళ్ళీ చూసినపుడు తెరలు తెరలుగా అందులోని గూఢార్థాలు అర్థమౌతూ వుంటాయి. అటువంటి సినిమాల్లో ఒకటి 'స్టిల్ లైఫ్'.

ఈ సినిమాకు వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గోల్డెన్ గ్లోబ్ అవార్డు వచ్చాక జియా జాంగ్మిన్ ఎవరో యావత్ప్రపంచానికి తెలిసింది. ఇటాలియన్ మాస్ట్రో మైకెలేంజలో అంటోనియోనీ ప్రభావం ఈ దర్శకుడిపై గాఢంగా వుంది. ఆసియన్ ఫిల్మ్ అవార్డ్, అడలైడే, డర్బన్, లాస్ ఏంజెలెస్ - ఇంకా ఎన్నో చలనచిత్రోత్సవాల్లో అవార్డులు గెల్చుకుంది ఈ సినిమా.

పై సినిమాలు రెండూ యూ ట్యూబులో ఇంగ్లీష్ సబ్ టైటిల్స్‌తో పాటు అందుబాటులో ఉన్నాయి. ✣

కవిత

# హృదయోల్లాసం

లలితానంద్

విరిగిన వ్యక్తిత్వ వెన్నుముక
నైతికత నడి వీధిలో ఉరితీత
వల్లకాట్లో విలపించే విశ్వసనీయత
పాక్షికత ధృతరాష్ట్ర కౌగిలిలో నిష్పాక్షికత
రాజకీయ రాబందులు దివారాత్రులు
పనిగట్టుకు పాతరేసిన ప్రమాణాలు

ప్రచార రథచక్రాల క్రింద
పరమపదించిన పచ్చి నిజాలు
కర్కశ పరిష్వంగంలో పరితాప ప్రజాస్వామ్యం
ఊసరవెల్లులకే రంగులద్దే
రివాజు కపట వంచనా శిల్పులు
అవిరామంగా అంతగా ఆడి పోసుకుని
కడుపులో కరకు కత్తులుంచుకుని గాఢాలింగనాలు
'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు'
రోతకే రోత పుట్టిస్తూ ఉంటారు
జుగుప్స జుగుప్సతో జలదరిస్తుంది
అది నోరో తాటిమట్టో
నరం లేని నాలుక తెగి ఎన్ని ముక్కలైందో!
నిన్నటిదాకా కాదన్నది అవునంటారు
అవునన్నదే కాదంటారు
మానవ మరుపు రహదారిపై
నిస్సిగ్గు అశ్వాల అనంత స్వారీ

క్రయ, విక్రయ వక్ర రాజకీయాలలో
అమ్మకాల కన్నా కొనుగోళ్లు ఎక్కువ
వికృత రాక్షస సంకుచిత సంకెళ్ళతో
తీర్పరి ఆటగాళ్లతో కుమ్మక్కు
నిర్వికార అలంకార రాజ్యాంగ వ్యవస్థలు
ఏది నర్మగర్భం కాదిక అంతా బహిరంగమే
కార్పొరేట్ల కొరకు, కార్పొరేట్ల చేత, కార్పొరేట్లకే
అంకితం ప్రజాస్వామ్యం బట్టబయలుగా
రాజకీయ వ్యాపార, వ్యాపార రాజకీయ
సంకర మదపుటేనుగుల పదఘట్టనలలో
చిద్రం అవుతున్న చిరు ప్రాణుల బ్రతుకులు
అధికారం పాదాల గిట్టల కింద పడి
గిలగిల తన్నుకులాడుతున్న ఊపిరాడని
సత్యం, న్యాయం, చట్టం, ధర్మం, అహింస

నాయకుల, పాలకుల కిరీటాలు సరే
విలయ తాండ విద్వేషకులు, విధ్వంసకులు
అమానుష అమానవీయులు అసలు మనుషులేనా!
పార్టీ పేరేదైనా - ప్రభుత్వం అందరిదీ కదా!
పాలనా సాధనాలు ప్రత్యర్థుల పరిహారానికా?
వివేక రాహిత్య కక్షల లక్ష్య పీడనం ఏమిటి?
రక్షకులు భక్షకులు అవటమేనా రాజనీతిజ్ఞత?

దశాబ్దాల తరబడి దశదిశలా దగా చేయొచ్చు
ఎల్లరను వంచనా శిల్పంతో ఏమార్చనూ వచ్చు
ప్రజల బదులు పార్టీలకు పవళింపు సేవలు చేయొచ్చు
దమన కార్పొరేట్ కబంధహస్తాల దన్ను
వెన్నుదన్నుగా వికటాట్టహాసం చేయొచ్చు
అనూహ్య అనన్య అనంత మాయాజాలంతో
తళుకు బెళుకు హొయలొలయల దేవతా వస్త్రాలతో

మసి బూసి మారేడు గాయ చేయొచ్చు
అంతరాత్మ అనేది అట్టడుగున పొరలలో దాగి
ఎక్కడైనా ఆచూకీ దొరికి ఉంటే
ఓసారి అంతరంగంలోకి తొంగి చూడు
చరిత్ర పుటల్లోకి చొరబడి నిలబడి చూడు
అక్కడ మీ నగ్న కురుపిత రూపం ఎంత
భయానక దురాగతాల దేదీప్య ప్రకాశవంతమో!
ద్విగుణీకృత, ద్వంద్వ, బహుళ ప్రమాణాల
మేరు పర్వత వంచనా రీతుల నీతుల గోతులతో-

నమ్ముకున్న అక్షరం-
అధికార లాలసకు అమ్మకం
పచ్చి అబద్ధాలు నిజాలుగా చలామణి
కటిక నిజాలకు నిరాశ్రయ శిబిరాలు శరణ్యం
దిగంతాల నిండా అగంతకులు ఆగడాల దండాలే
ఆయనెవరో 'ద్రవాధునికత' అన్నారు
ఈయన ఎవరో 'ద్రవ రాజకీయాలు' అంటున్నారు

ఇవి వాస్తవానికి సామాన్యుని పాలిట ఉపద్రవాలు
అపప్రద నాగరికతలో అపభ్రంశ రాజకీయాలు
కాసుల కక్కుర్తిలో కారుణ్యం కనుమరుగు
పీఠాల పాద ధూళికి ప్రణమిల్లుతున్న పరిణిత ప్రజ్ఞ

నిలిచేది నిలబెట్టేది నైతికతే ఎప్పటికీ
వ్యక్తినైనా, వ్యవస్థ నైనా, సర్వకాలాల్లోనూ- కాలాన్నయినా -
మానవీయ విలువల పాటింపు పరమార్థం
విస్తృత విజ్ఞత, వివేక, వికాసాల ఉనికి ఊపిరి
విశ్వ మానవాళి అస్తిత్వ శాశ్వత హృదయ స్పందన
ధ్రువాల నడుమ నిండిన ద్రవ్య ద్రావకములో
భువన బొంతరాలు దద్దరిల్లు ప్రకటిత ప్రకంపిత
కుటిల మలిన అధికార ఐశ్వర్యాలు
కాకులు తినే విసర్జక కల్మషాలు
విషపు పురుగుల విజయోత్సవ హోరులో
విలువల పరిరక్షకులదే గగన కేతన హృదయోల్లాసం




గల్పిక

# నాయం గావాల

శంకరం

**అయ్యా!** తవరికి నా గోదు ఇనిపించుకుందావని వచ్చినాను. దరమ పెబువులు తవరు ఇనక తప్పదు. ఎవురికీ సెప్పుకోకపోతే గుండిల్లో మంట ఆరీనాగలేదు. యాడనో కలుక్కుమంటాంది. లోకం ఇలగుందేట్రా బావూ అని ఒకటే ఇదిగా వుంది. ఎవులు నోరిప్పినా ఒకటే దవిలాగు "సెట్టం దానిపనది జేసుకుపోద్ది" అని. ఇది సెప్తన్నోల్లే 'సెట్టం అయినోల్లకి సుట్టం' అంతన్రు. నేది నమ్మాలో, నేది నమ్మగూడదో అంతయోమయంగుంది. గందుకనే తవరు నాయం సెబుతారని ఇలగెలిపొచ్చినాను.

డిల్లీ సియ్యేమ్ము కేజ్రీవోలు గార్కి బెయిలిచ్చి బయటికొగ్గేసినారు. చంతోసం! దేశింల శానామంది ఎట్టాగైతేనేం ఆయనగోరికి నాయం జరిగిందని చంతోసించినారు. ఆయనమీద ఏవేవో తప్పుడు కేసులు బుక్ సేసీసినారని జనం సెప్పుకుంతన్రు. నాకు తెలవకడుగతున్నాను బావూ, అనుమంతుని ముందు పిల్లకోతి గెంతితే అదెంత? అతికారం మన్చేతులుందికదాని అందర్నీ అన్నిరోజులూ నొక్కి పారీగలవా? చరే 'కేజ్రీవోలుగారు సియ్యేమ్ము కాబట్టి ఆయన కోసరం మీలాటి పెద్ద పెద్ద దరమాత్ములు ఓడించి ఎలగోలా బయటికి రప్పించినారు.

కానీ బావూ కేరల్లో ఎవురో పేపర్లల్ల వోర్తల్రాసీ కుర్రోడు.... మంచిపేరేనబ్బా..... అదీ.... ఆ.... "సిద్దీకప్ప" గురుతొచ్చినాది. ఎవరో అమ్మిమీద దొంగనాయాల్లు నలుగురు అచ్చారం జేసి సంపీసినారంట. దానికి చంబందించిన ఓర్తలు రాద్దావని ఎల్తా వుంటే ఇట్టాంటి ఓర్తల్రాసి పెబుత్వం పరువూ మరియాదా మంటగలుపుతావా అని దారిలోనే అడ్డుకొని జైల్లో ఎట్టీసినారంట. ఏదో సావెజ్జెప్పినట్టు 'మంచికెల్తే సెడు ఎదురైనట్టు' ఓ ఆడకూతురికి అన్నాయం జరిగిందని ఓర్త రాయడం కూడా ఈ దేశిం అన్నాయవేనన్నమాట. అక్రమంగా, గోరంగా దేశిద్రోహం కేసు బుక్ సేసీసినారంట. టేసన్లో పోలీసులు కోట్రులో మావు సెప్పినట్టే సెప్పాలని ఒల్లంగా గుండాపిండి సేసీనారంట. దేశివంతా గగ్గోలైపోయి ఇంక ఒగ్గీపోతే పరువు పోద్దేవోనని రెండేల్లు జైల్లో మగ్గిన్తర్వాత ఒగ్గినారంట కదా! అంటేటి బావూ ఎవ్వులూ మీకెదురు సెప్పడానికి నేదన్నమాట!? ఇతగాడి గురించి మరి మీలాంటి దరమాత్ములు ఎవులైనా ఓడించినారో నేదోమరి?

ఇది కూడా ఇనండి, అయినా నా పిచ్చిగాక మీకు తెలవకుండా ఉంటదా ఏంది? ఆయనగోరు సానా పెద్దోడట కదా, ఎనపై మూడో, ఎనపై నాల్గో ఏల్ల టాన్ సామి (స్టాన్‌స్వామి) గోరట. ఆయన్ని కూడా ఇట్టాటిదే దేశిద్రోహం కేసు బుక్‌సేసి జైల్లో ఆడీసినారంట గదా. ఆయనకేదో జబ్బు కూడా ఉందట. నరాలన్నీ సచ్చుబడిపోయి కాలూ సెయ్యీ కదపనేదంట పాపం! మంచీల్లు తాగడానికి కనీసం గొట్టం కూడా ఇయ్యనేదట. బిటీసోడు గూడా ఇంత గోరంగ సూసుండడు! అడివి బిడ్డల కోసరం పన్జేసీవోడట. సివరాకరికి జైల్లోనే పేనాలొగ్గేసి నారంట. ఇయన్నీ ఇంటన్నందుకే నా గుండిలు మండిపోతున్నాయి. అంత ముసిలోనికి బెయిలు కూడా ఇవ్వకుండా జబ్బుతో కాల్లూ, సేతులూ పన్జెయ్యనోడు దేశానికి ఏం ద్రోహం జేసినాడంట.... అహ అసల్జెయ్యగల్డా అని!? ఇట్టాంటోల్లు ఇంకా ఎప్పటికీ జైల్లోనే మగ్గుతున్నరట. మరి మీతోటి నాయమూర్తులు గూడా ఆల్లనట్టాగే ఒదిలెయ్యడం....??

అడివి బిడ్డలంటే గేపకమొచ్చినాది అస్సాంకాడి నక్సలైట్లున్నా రన్జెప్పి ఆర్మీవోల్లని దింపీసి ఆల్లకి పెసల్ పవర్స్ ఇచ్చీసినారంట. అడవులను నరుకుతున్నా, అయ్యేటో కనిజాలు కోసమని గోతులు తవ్వుతున్నా ఆయేపున్న కొండోల్లు అడ్డగిస్తే కేసులెట్టేత్త నారట. ఇక ఎవురిమీదనైనా అనుమానవొత్తే సాలు కేసూ, గీసూ ఏదీ నేకుండానే ఆల్లనట్టికెల్లి జైల్లల్ల కుక్కుతున్రట. పాపం ఆ ఎర్రిమాలోకాలకి ఆల్లకెందుకు జైల్లల్ల బెట్టినారో కూడా చెప్పకుండానే నెలలు, సమచ్చరాలు.... ఆల్ల బతుకులు ఆ సీకటి గదుల్లోనే తెల్లారి పోతన్నయంట. అన్నీ తప్పుడు కేసులెట్టి బెయిలు గూడా నేకండా జేసి అమాయకుల బతుకులు బుగ్గిపాల్జేస్తున్రు. ఈ దిక్కుమాలినోల్లు ఎవరిక్కావాలయ్యా? ఆల్ల బతుకులు అట్టా తెల్లారిపోడవేనా?

మరి దర్మాత్ములు, నాయమూర్తులు, నాయాన్ని రచ్చించాల్సినోల్లు నా గుండి మంటలు మీకు అవుపించడంనేదా? మీరే నా గోస, నా గోదు ఇనిపించుకోవాల! నాకు నాయం గావాల! నాయం గావాల!!

# సంతాపాలు

## కొప్పోలు మోహనరావు

**దళిత** రచయిత కొప్పోలు మోహనరావు తన 69వ యేట 4-9-2024న మరణించారు. ఆయన 22-9-1955న ప్రకాశంజిల్లా కందుకూరు సమీప గ్రామం చౌటిపాలెంలో జన్మించారు.

విద్యార్థిగా ప్రేమ కవితలు రాసిన మోహనరావు, కావలిలోని జవహర్ భారతి కళాశాలలో డిగ్రీ పూర్తిచేశారు. ఎం.కాం. విద్యార్థిగా వున్నపుడే కెనరా బ్యాంకులో ఉద్యోగం రాగా, దానిలో చేరారు.

2005లో జరిగిన దళిత రచయితల శిక్షణా శిబిరానికి కో-కన్వీనర్‌గా కృషిచేశారు. 2020లో తన కవితల సంపుటి 'ఒంటినిట్టాడ గుడిసె' ప్రచురించారు. "చూస్తూనే వుండు / మనుధర్మశాస్త్రం నా ముందు / మరుగుజ్జుగా మారేరోజు / ఎంతో దూరం లేదు" అని ప్రకటించిన మోహనరావు మృతికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తోంది.

## వడ్డెపల్లి కృష్ణ

**లలితగేయాల** రచయిత వడ్డెపల్లి కృష్ణ 6-9-2024న హైదరాబాద్‌లో తన 76వ యేట మరణించారు. ఆయన 5-8-1948లో కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో ఒక పేద చేనేత కుటుంబంలో జన్మించారు.

విద్యార్థిగా సి. నారాయణరెడ్డి స్ఫూర్తితో సాహిత్యరంగంలోకి ప్రవేశించారు. 1966లో నిజాం కాలేజిలో పి.యు.సి చదివారు. ఆయన రచనలు వివిధ పత్రికలు ప్రచురించాయి. వేయికి పైగా లలితగీతాలు, దేశభక్తి గేయాలు, సినిమాలకు, రేడియోకి, బాలలకి రాశారు. 40కి పైగా సంగీత నృత్యరూపకాలు రచించారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంపై 'జయజయహే తెలంగాణ' వీరనారి ఐలమ్మపై నృత్యరూపకాలు వాటిలో విశిష్టమైనవి. తెలంగాణ వ్యావహారిక భాషలో 'వెలుగొచ్చింది', రమణీయ రామప్ప, 'ఆమ్రపాలి' ఆయన రాసిన సంగీత నృత్యరూపకాలు విమర్శకుల ప్రశంసలనందుకున్నాయి. ఆయన నంది అవార్డుల కమిటీ ఛైర్మన్‌గానూ, సెన్సార్‌బోర్డు సభ్యునిగాను పనిచేశారు. లలిత గీతాలపై పరిశోధన చేసి పిహెచ్‌డి పట్టా పొందారు.

## ప్రజాకళాకారుడు ఉన్నం నాగేశ్వరరావు మరణం

**ప్రజాకళామండలి** వ్యవస్థాపక సభ్యుడు ఉన్నం నాగేశ్వరరావు తన 54వ యేట అనారోగ్యంతో 20-9-2024న గుంటూరులో మరణించారు.

ఆయన నాలుగు దశాబ్దాలుగా ఆట, పాట, మాట, డప్పు దరువులతో ప్రజాకళాకారునిగా ప్రజాసాంస్కృతిక ఉద్యమంలో పనిచేశారు. ముందు జననాట్యమండలిలో, తర్వాత ప్రజాకళా మండలిలో, డప్పు రమేశ్ బృందంలో తన భార్య రాణి, కూతురు నయనతోపాటు కృషిచేశారు. 1989లో రాడికల్‌గా అరెస్టై సత్తెనపల్లి జైలులో వున్నారు. ఆయనపై ఎన్.ఐ.ఏ దాడులు, విచారణ జరిగాయి. న్యాయవాద గుమాస్తాగా పనిచేస్తూ, పూర్తికాలం కళాకారునిగా మారి సాంస్కృతిక కృషిలో పాల్గొన్నారు. గ్రామాలలో దళితులపై దాడులు సాగిన సందర్భాలలో ప్రతిఘటనా చైతన్యాన్ని రగిలించారు.

నాగేశ్వరరావు మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం తెలియచేస్తోంది. వారి సహచరి రాణి, కూతురు నయనకు సానుభూతి ప్రకటిస్తోంది.

## రచయిత్రి బి. విజయభారతికి జోహార్లు



**బోయి** విజయభారతి తన 83వ యేట 28-9-2024 హైదరాబాదులో మరణించారు. ఆమె 1941లో తూర్పుగోదావరి జిల్లా రాజోలులో ప్రముఖ రచయిత బోయి భీమన్న, నాగరత్నమ్మ దంపతులకు జన్మించారు.

'దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం-సాంఘిక పరిస్థితులు' అన్న అంశంపై సిద్ధాంత వ్యాసం రాసి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆమె డాక్టరేట్ పట్టా పొందారు. తెలుగు అకాడమీకి డైరెక్టర్‌గా పనిచేశారు. ఆమె 1968లో దళిత నాయకుడు, హేతువాది, లాయరు ఐన బొజ్జా తారకంను వివాహం చేసుకున్నారు.

డా॥ విజయభారతి ప్రాచీన సాహిత్యాన్ని దళిత, స్త్రీవాద కోణాల నుండి పరిశీలన చేస్తూ 'పురాణాలు - కులవ్యవస్థ' శీర్షికతో ఐదు భాగాలు ప్రచురించారు. అవిగాక 'నరమేధాలు-నియోగాలు'; 'పురాణాలు-మరోచూపు', మూడు అనువాద గ్రంథాలు వీరి ఇతర రచనలు.

డా॥ విజయభారతిగారి శరీరాన్ని గాంధీ మెడికల్ కళాశాలకు ఇచ్చారు. డా॥ విజయభారతి మరణానికి 'ప్రజాసాహితి' సంతాపాన్ని ప్రకటిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియచేస్తోంది.




**Tiger of Mysore TIPU-SULTAN** *- By Syed Naseer Ahamed - English Translation from Telugu B.V.K. Purnanandam.*

తెలుగులో టిప్పు సుల్తాన్ పై వెలువడిన ఈ గ్రంథం ఇప్పుడు ఇంగ్లీషులోకి అనువాదమై 2024లో విడుదలైంది. పరమత ద్వేషమే సిద్ధాంతంగా వున్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, సంఘపరివార సంస్థలు, వాటి రాజకీయ రూపమైన భారతీయ జనతాపార్టీ (మొదట్లో జనసంఘ్) టిపూసుల్తాన్ పై అభాండాలు వేసి, కర్నాటకలో హిందూ ఓటర్లను ఆకర్షించాలని విఫలయత్నం చేసాయి. టిపూ సుల్తాన్ స్వాతంత్ర్య సమరయోధునిగా చేసిన కృషిని ఈ పుస్తకం ద్వారా ఈనాటి తరం తెలుసుకోవచ్చు. భారతీయ ముస్లిములు మాతృదేశమైన భారత్‌కు చేసిన సేవలు, ఆత్మ త్యాగాలు మొదలైనవాటిని వివరిస్తూ సయ్యద్ నజీర్ అహమ్మద్ రాస్తూన్న పుస్తక పరంపరలో ప్రచురించిన పుస్తకాలలో ఇది ఇరవైఏడోది. వీరి తెలుగు పుస్తకాలు కొన్ని వివిధ భారతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి.

1/8 డెమ్మీలో 72 పుటలు. ప్రథమ ముద్రణ : 2024. వెల : రూ. 75/- ప్రతులకు : 94402 41727.

**నారాయణ గురుబోధ :** రచయిత - డి. నటరాజ్ శాక్య.

వివిధ కులాలుగా విడిపోయి తమలో తాము కలహించుకుంటున్న శూద్ర, అతిశూద్ర కులాలను ఒకటిగా చేసిన సంస్కర్త కేరళకు చెందిన నారాయణగురు, (1856-1928) జీవితాన్ని, కృషిని రచయిత దీనిలో వివరించారు. బహుజనుల ఐక్యతే ఆశయంగా బహుజనులందరినీ ఏకం చేసే రచనలు నటరాజ్ శాక్య చేస్తున్నారు. వాటిలో ఇదొకటి.

1/8 డెమ్మీలో 116 పుటలు. తొలిముద్రణ : 2024. వెల : రూ. 100/- ప్రతులకు : కె.కె. రాజా - 98852 81545.

**మహాత్మా జ్యోతిబా పులే, క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పులే :** రచన - డి. నటరాజ్ శాక్య

పులే దంపతుల అసామాన్యమైన కృషిని, వారి జీవితంలోని వివిధ ఘట్టాలను చక్కని శైలిలో రచయిత అందించారు. సావిత్రీబాయి రాసిన కవితలను గూడా సందర్భ సహితంగా అందించారు. జ్యోతిబా, సావిత్రీబాయిలపై వెలువడిన 13 ఆధార గ్రంథాల సారాన్ని నటరాజ్ ఈ పుస్తకంలో పొందుపరిచారు.

1/8 డెమ్మీలో 100 పుటలు. వెల : రూ. 150/- ఐదవ ముద్రణ : 2024. ప్రతులకు : 94404 28597.

**బుద్ధధర్మం - జీవితానందం :** రచన - డి. నటరాజ్ శాక్య

గత పదేళ్ళుగా తెలుగులో బౌద్ధం మీద పలు పుస్తకాలు వెలువడ్డాయి. 'బుద్ధభూమి' మాసపత్రిక వెలువడుతోంది. ప్రతి ఏడాదీ మే నెలలో 'మిసిమి' బౌద్ధంపై ప్రత్యేక సంచికను ప్రచురిస్తోంది. వివిధ రచయితలు బౌద్ధంపై రచనలు చేస్తున్నారు. ప్రసంగిస్తున్నారు. వాటిలో భాగంగానే ఈ పుస్తకం వెలువడింది. బుద్ధుడి తాత్త్విక చింతనను రచయిత వివరించారు.

1/8 డెమ్మీలో 76 పుటలు. వెల : రూ. 50/- ఏడవ ముద్రణ : ఏప్రిల్ 2024. ప్రతులకు : 94404 28597.

**విద్యార్థీ! నీ కోసం :** స్ఫూర్తి వాక్యాల కరదీపిక - రచన - డి. నటరాజ్ శాక్య

విద్యార్థులకు అవసరమైన వివిధ విషయాలను ఉదాహరణకు మాతృభాషపైన మమకారం, పొదుపు చేయడం, సభలు, సమావేశాలకు వెళ్ళడం, స్త్రీలను గౌరవించడం, పరమత సహనం, సృజనాత్మక కళలు, క్రీడలు, సంఘసేవ, రాజకీయాలు, విద్య విలువ మొదలైన ఎన్నో విషయాలను గుదిగుచ్చి సమర్పించిన పుస్తకం.

1/8 డెమ్మీలో 104 పుటలు. వెల : రూ. 50/- గ్రంథాలయాలకు ఉచితం. ఐదవ ముద్రణ : 2024. ప్రతులకు : 94404 28597.

**లంచం రాజకీయాలు :** రచ్నాకారుడు - తిక్కవరపు సుకుమార రెడ్డి "ఓ-"

యెన్నికల్లో లంచం రాజకీయాల్మీద అక్షరాగ్రూపంలో వున్న నిప్పు కణికలు ఈ పుస్తకం.

1/12లో 20 పుటలు. వెల : బుక్‌పోస్టు తపాలా బిళ్ళలు. ప్రతులకు : 0861-2325125.

**ఆర్గానిక్ ఇంటలెక్చువల్ కనపర్తి యేసు రత్నం :** జ్ఞాపకాల సంకలనం - ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి

బడుగువర్గంలో జన్మించి, ఆ వర్గపు ప్రజానీకంలో చైతన్యం కలుగచేసే మేధావిని ఆర్గానిక్ ఇంటలెక్చువల్ అంటారు. కామ్రేడ్ కనపర్తి యేసురత్నం అటువంటి మేధావి. ఆయన తెనాలి సమీపాన కొల్లిపర గ్రామంలో 10-07-1956న పేద మాల కుటుంబంలో పుట్టి, స్వయంకృషితో సమాజాన్ని అర్థం చేసుకొని, దళితులపై జరిగే దాడులను ఎదుర్కొనే ఉద్యమాలకు నాయకత్వం వహించి, తన 67వ ఏట 19-12-2023న మరణించారు.

తెనాలిలో చదివిన బి.ఏ. చదువుకంటే, సమాజమనే విశ్వవిద్యాలయంలో ఉన్నతోన్నత విషయ పరిజ్ఞానాన్ని ఆయన సంపాదించారు. 'స్టాలిన్‌గ్రాడ్'గా పేరు పొందిన దావులూరు గ్రామం కొల్లిపరకు పొరుగు గ్రామమే. తొలిదశలో పనిచేసిన సి.పి.యం నుంచి బయటకు వచ్చి, దళిత ఉద్యమాలలో ఆయన మమేకమయ్యారు. దళిత సంస్థ 'కార్డ్స్' (Community and Rural Development Society)లో కార్యకర్తగా పనిచేశారు. కానీ చివరివరకూ మార్క్సిజాన్ని వదిలిపెట్టలేదు. ప్రతిఘటనా పోరాటాలను విజయవంతంగా నిర్వహించారు. కారంచేడు, చుండూరు, నీరుకొండ, పిప్పర, దొంతాలి, తిమ్మ సముద్రం, లక్ష్మింపేట, గంగపర్రు, గొట్టిపాడు మొదలైనచోట్ల దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరిగినప్పుడు ఆయా ప్రాంతాలకు వెళ్ళి అక్కడి ఉద్యమాలలో క్రియాశీలంగా పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాలుగా కార్డ్స్ సంస్థ ప్రతినిధిగా పనిచేసిన యేసురత్నం, మణిపూర్‌లో వికలాంగుల కోసం ప్రత్యేక పాఠశాల

ఏర్పాటు చేయడంలో అవిశ్రాంత కృషి చేశారు. దళిత క్రైస్తవుల రిజర్వేషన్ కొరకు దీనాపూర్ నుండి ఢిల్లీ వరకు చేసిన ప్రదర్శనలో ప్రధానపాత్ర వహించారు. కార్డ్స్ సంస్థ చేపట్టిన అనేక కార్యక్రమాల కోసం ఆయన ఎన్నో విదేశాలు తిరిగారు. ఆయా దేశాల భాషలు నేర్చుకున్నారు.

ఆయన క్రైస్తవ తలిదండ్రులకు పుట్టినా, తాను బౌద్ధాన్ని అంగీకరించి తన కుమారుని వివాహం బౌద్ధ సంప్రదాయం ప్రకారం చేశారు.

ఇలా ఆయన వ్యక్తిత్వంలోని వివిధ కోణాలను వివరిస్తూ, ఆయన సన్నిహితులు 18 మంది రాసిన ఈ జ్ఞాపకాల సంకలనం చల్లపల్లి స్వరూపరాణి సంపాదకత్వాన 14 ఏప్రిల్ 2024లో వెలువడింది. 1/8 డెమ్మీలో 72 పుటల ఈ పుస్తకం వెల : రూ.50/- ప్రతులకు : కనపర్తి బెన్‌హర్‌బాబు, ఫోన్ : 94419 47345.

**తెలంగాణ ఉద్యమ సాహిత్యం (ఉమ్మడి నిజామాబాద్ జిల్లా) : సంకలనం : తుర్లపాటి లక్ష్మి - ఎనిశెట్టి శంకర్**

చరిత్రకు సంబంధించిన వివరాలు గ్రంథస్తం కాకపోతే, తరువాతి తరాలవారు తమ పూర్వుల చరిత్ర తెలుసుకోవడానికి చాల కష్టపడవలసి వస్తుంది. మనకు ఒక స్కూలు, ఒక కళాశాల, ఒక సామాజిక లేక సాహిత్య సంస్థ మొదలగువాటి పాత చరిత్ర కావాలంటే ఎంతో పరిశోధన చేయాల్సి వస్తోంది. ఆయా సంస్థలు ప్రచురించిన వార్షిక సంచికలుగాని, కరపత్రాలుగాని, లభించవు. కారణం వాటిని సరిగా పరిరక్షించకపోవడమే!

ఇవన్నీ స్థానిక చరిత్రకు ఉపయోగపడతాయి. అటువంటి స్థానిక చరిత్రకు సంబంధించినదే తుర్లపాటి లక్ష్మి. ఎనిశెట్టి శంకర్ సంకలనం చేసిన ఈ గ్రంథం. దీనిలో ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన తొలి ఉద్యమ వివరాలు (1969) కంటే మలి ఉద్యమ వివరాలు (2000-2014) - నిజామాబాద్ జిల్లా కేంద్రంగా జరిగినవి చాల వున్నాయి. పదేళ్ళు పైగా సాగిన ఈ ఉద్యమ ఫలితంగా తెలంగాణ రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్ నుంచి విడగొట్టుకుని 2014లో ఏర్పడింది.

డా॥ శారదా హన్మాండ్లు 'నిజామాబాదు జిల్లా ఉద్యమ సాహిత్యం' అనే 18 పేజీల వ్యాసంలో కవులు, రచయితలు తొలి, మలి దశలలో రాసిన రచనలు వివరించారు. 'కామారెడ్డి జిల్లా ఉద్యమ సాహిత్యం' అనే 17 పేజీల వ్యాసంలో, 2002లో తెలంగాణ రచయితల వేదికలో ఏర్పడటం, 'తెలంగాణ రాష్ట్ర సమితి' అనే రాజకీయ పార్టీ ఆవిర్భావం మొదలైన విషయాలను మోతుకూరి అశోక్‌కుమార్ ప్రస్తావించారు.

డా॥ జి. లచ్చయ్య కూర్పు చేసిన, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ శ్రీకృష్ణ కమిటీకి సమర్పించిన 67 పేజీల బహిరంగ లేఖ, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్, నిజామాబాద్ జిల్లా శాఖ శ్రీకృష్ణ కమిటీకి ఇచ్చిన 34 పేజీల నివేదిక పూర్తి పాఠాలు ఈ గ్రంథంలో పొందుపరిచారు. ఈ రెండు నివేదికల ద్వారా తెలంగాణకు సంబంధించిన వివిధ విషయాలను పాఠకులు, రాబోయే తరాలవారు తెలుసుకుంటారు.

ఇవిగాక తెలంగాణ ఐక్యవేదిక పక్షాన తోట హన్మాండ్లు రూపొందించిన పత్రం, కవులు, రచయితలు, విద్యార్థులు, లెక్చరర్ల తరఫున నిజామాబాద్ జిల్లా అభివృద్ధి కోరుతూ రేకులపల్లి చంద్రశేఖరరెడ్డి విడుదల చేసిన 20 పేజీల పత్రం, నిజామాబాద్ జిల్లా జాయింట్ ఏక్షన్ కమిటీ పత్రం, కొన్ని లేఖలు ఈ గ్రంథంలో చోటుచేసుకున్నాయి. నిజామాబాద్ జిల్లా జెఎసి వారి 40 కరపత్రాలు, రెండు ప్రెస్‌నోట్లు. మలి దశలో విస్తృతంగా జరిగిన కార్యక్రమాలను, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను తెలియచేస్తున్నాయి.

ఇవన్నీ చదువుతున్న క్రమంలో కాళోజీ అన్న మాటలు "ప్రాంతేతరులు దోపిడీ చేస్తే ప్రాంతం అంచులదాకా తన్ని తరుముతాం! ప్రాంతంవాడే దోపిడీ చేస్తే ప్రాంతంలోనే పాతర పెడతాం!" గుర్తుకు వస్తున్నాయి. ప్రస్తుతం 'దొర' పాలన పోయి, కాంగ్రెసు పాలన వచ్చినా దోపిడీ కొనసాగుతూనే వుంటుంది. వివిధ రూపాలలో భౌగోళిక తెలంగాణ కాదు, ప్రజాస్వామ్య తెలంగాణ కావాలనేవారి గొంతుకలు బలహీనంగా వినిపిస్తున్నాయి.

మలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కొందరు తమ భాషను అవమానం చేస్తున్నారనే ఆరోపణ చేశారు. భాషకు సంబంధించి 'తెలుగు తల్లి' విగ్రహం ఏర్పాటు చేస్తే, దాన్ని పూర్వపక్షం చేస్తూ భౌగోళికమైన 'తెలంగాణ తల్లి'ని రూపొందించారు. మీ ఆంధ్రం వేరు, మా తెలుగు వేరు అని అశాస్త్రీయమైన వాదనలు చేశారు. ప్రపంచంలో ఎక్కడైనాసరే మెరుగైన నీటి సదుపాయాలు ఏర్పడి వున్నచోట దాని ద్వారా సంపద పోగుపడి దానిద్వారా విద్య, వార్తాపత్రికలు, సినిమాలు, సాహిత్యం విలసిల్లుతాయి. అది గమనించకుండా $2^1/_2$ జిల్లాల భాష ప్రామాణికం చేసి, ఇతర జిల్లాల, ప్రాంతాల మాండలీకాలను, యాసలను 'ఆంధ్రోళ్ళు' ఈసడించారని ప్రచారం చేశారు. నిజానికి జరగాల్సిందేమిటంటే ఇప్పుడు ప్రామాణికంగా చెల్లుబాటౌతున్న భాషలోకి ఇతర ప్రాంతాలవారు తమ తమ మాండలీక పదాలను విరివిగా ప్రవేశపెట్టి ప్రచారం చేయాలి. గురజాడ ఆ పని చేశాడు. రావిశాస్త్రి ఆ పని చేశాడు. నామిని, సడ్లపల్లె చిదంబరరెడ్డి, అల్లం రాజయ్య, పోరంకి దక్షిణామూర్తి, తెలిదేవర భానుమూర్తి, భూతం ముత్యాలు, జూపాక సుభద్ర మొదలగువారు మాండలీకాలలో రచనలు చేశారు. అయితే ఇప్పుడు తెలంగాణ సాహితీవేత్తలు, తెలంగాణ తెలుగులోని అర్థవంతమైన అనేక పదాలను తమ వ్యాసాలలో, వార్తాపత్రికలలో, సినిమాలలో, కవితలలో - వివిధ సాహిత్య రూపాలలో వాడటంలేదు. నాకు తెలిసినంతవరకు సోయి, పావురం వంటి కొన్ని పదాలు మాత్రమే విరివిగా వాడుతున్నారు. కరీంనగర్‌కు చెందిన మలయశ్రీ కోస్తా జిల్లాల సాహిత్య సభల్లో చక్కటి తెలంగాణ యాసలో, మాండలీకంలో మాట్లాడితే ఎవరూ తప్పు పట్టలేదు. గద్దర్, గోరటి వెంకన్నల పాట, మాటలను అన్ని ప్రాంతాలవారూ ఆస్వాదించారు. అన్ని జిల్లాలవారు తమ తమ మాండలీక పదాలను, తమ రచనలలో పత్రికలలో ఉపన్యాసాలలో విరివిగా వాడటం ద్వారానే తెలుగుభాష మరింత సంపద్వంత మౌతుంది. భౌగోళిక తెలంగాణా రూపం వంటిదయితే, ప్రజాస్వామ్య తెలంగాణా సారం వంటిదని జనసాహితి మొదటి నుండి చెప్పినట్లు ప్రస్తుతం సారంలాంటి పాత సామాజిక వ్యవస్థే కొనసాగుతున్నందువల్ల ప్రాంతాలు విడివడినా పాత మౌలిక సమస్యలే కొనసాగుతున్నాయి.

(తెలంగాణ ఉద్యమ సాహిత్యం (ఉమ్మడి నిజామాబాద్ జిల్లా) సంకలనం : తుర్లపాటి లక్ష్మి - ఎనిశెట్టి శంకర్. స్నేహ ప్రచురణలు. ప్రథమముద్రణ : ఫిబ్రవరి 2024. 1/8 డెమ్మీ 360 పుటలు. వెల : రూ.500/- ప్రతులకు : 98666 30739, 97042 25469)

**(ఇంకా వున్నాయి)** ✣

# గోండి భాషాపండితుడు కోట్నాక్ జంగు మరణం



*("ప్రజాసాహితి" 2014 మార్చి సంచికలో జయధీర్ బృందం గోండీ భాష గురించి చేసిన కృషిపై ఒక వ్యాసాన్ని ప్రచురించాం. 2019 మార్చి సంచికలో ఆదివాసీ భాషల రక్షణపై జయధీర్ వ్యాసంతోపాటు, గోండి లిపిలోని అచ్చులు, హల్లుల పట్టిక, గోండీ లిపిలో కేలండర్ నమూనా, గోండీ వాచకాల ముఖచిత్రాలు ప్రచురించాం. ఆ సంచిక చిత్రాలలో కోట్నాక్ జంగు కూడా ఉన్నారు. - సం॥)*

అదిలాబాద్ జిల్లాలోని నార్నూర్ మండలం గుంజాల గ్రామానికి చెందిన కోట్నాక్ జంగు తన 90వ యేట 22-9-2024న మరణించారు.

ఆయన గోండి, తెలుగు, ఇంగ్లీషు, మరాఠీ భాషల్లో 7వ తరగతి వరకు చదువుకున్నారు. అదృశ్యమౌతున్న గోండీ భాషకు లిపిని ఆయన సృష్టించారు. గోండీ సంఖ్యలు, వ్యాకరణం రూపొందించారు. గోండీ భాషలో తన స్వీయచరిత్ర రచించారు. గోండుల సాంస్కృతిక మూలాలను ఆయన వివరించేవారు. గోండుజాతి పుట్టుకకు సంబంధించిన కథల సేకరణకు సహకరించారు. గుంజాల గోండి లిపిని యూనికోడ్ ప్రమాణంలోకి తీసుకురావడంలోనూ, ఫాంట్‌ను ఆవిష్కరించడంలోనూ, గోండీ భాషలో వాచకాల రూపకల్పనలోనూ ఆయన ప్రముఖపాత్ర వహించారు.

ఆదివాసీ లేక మూలవాసీ సంస్కృతిపై కేంద్రీకరించి కృషిచేస్తున్న ఆచార్య జయధీర్ తిరుమలరావు, ఆచార్య గూడూరు మనోజల బృందం చేసిన పరిశోధనలకు కోట్నాక్ జంగు బహుధా సహకరించారు.

కోట్నాక్ జంగు మరణానికి 'ప్రజాసాహితి' సంతాపాన్ని తెలియచేస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటిస్తోంది. ✣

# ప్రసిద్ధ భారతీయ ఆంగ్ల కవి కేకి.ఎన్. దరువాలా మరణం



**సుప్రసిద్ధ** ఆంగ్లకవి కేకి. నస్సర్‌వాంజ్ దరువాలా తన 87వ యేట 27-9-2024న మరణించారు. పార్శీ కుటుంబానికి చెందిన ఆయన 24-1-1937న లాహోర్‌లో జన్మించారు. వారి కుటుంబం 1945లో దేశ విభజనకు ముందే జునాగఢ్‌కు ఆ తర్వాత రాంపూర్‌కు వలస వెళ్ళింది. దరువాలా తండ్రి లాహోర్ ప్రభుత్వ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేశారు.

కేకి. ఎన్. దరువాలా చండీఘర్‌లోని పంజాబ్ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు సాహిత్యంలో ఎం.ఏ. చదివారు. ఆక్స్‌ఫర్డ్‌లో ఒక ఏడాది వున్నారు. 1958లో ఇండియన్ పోలీసు శాఖలో చేరి వివిధ హోదాలలో పనిచేశారు. 1984లో సాహిత్య అకాడమీ అవార్డు, 1987లో కామన్‌వెల్త్ కవితాబహుమతి అందుకున్నారు. 2014లో పద్మశ్రీ పురస్కారం లభించింది. 2015లో రచయితల పట్ల ఆనాటి ప్రభుత్వ వైఖరులను నిరసిస్తూ సాహిత్య అకాడమీ బహుమతిని తిరిగి ఇచ్చేసి తన నిరసన తెలియచేశారు.

వివిధ ప్రాంతాల్లో పనిచేసిన అనుభవంతో ఆయన భారతీయ జీవితంలోని పరస్పర విరుద్ధమైన వాస్తవాలను అర్థం చేసుకున్నారు. "స్వాతంత్ర్యానంతర భారతదేశం ఒక అర్థరహిత ప్రదేశం" అన్నారు ఒకచోట. "నీ తల్లిపాలతో పాటు నేర్చుకున్న భాషలోనే నీవు కవిత్వం రాయగలవు" అని ప్రకటించారు. ఎమర్జన్సీలో రాజ్యం ప్రజలపై చలాయించిన అధికారంపై రాసిన కవితలను "వింటర్ పోయమ్స్"గా ప్రచురించారు. ఆయన 11 కవితాసంపుటాలు, కథాసంపుటాలు, నవలలు, లేఖాసాహిత్యం ఆరు సంపుటాలుగా ప్రచురించారు. ✣

# 8113 ఎన్టీపీసీ ఉద్యోగాలు

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రైల్వేజోన్లలో ఎన్టీపీసీ (నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. దీనిద్వారా 8113 చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్, స్టేషన్ మాస్టర్, గూడ్స్ రైలు మేనేజర్, జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ ఖాళీలను భర్తీచేయనున్నారు. డిగ్రీ అర్హత ఉన్న అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అయితే టైపిస్ట్ పోస్టులకు ఇంగ్లిష్, హిందీ టైపింగ్ తెలిసి ఉండాలి. రెండు దశల రాతపరీక్షలు, స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఉద్యోగాల భర్తీ చేపట్టనున్నారు. ఈ పోస్టుల భర్తీకి సెప్టెంబరు 14 నుంచి అక్టోబరు 13 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. అక్టోబరు 16 నుంచి 25 వరకు దరఖాస్తుల సవరణకు అవకాశం కల్పించనున్నారు. పరీక్ష తేదీలను తర్వాత ప్రకటిస్తారు. ✣

కవిత

ఇది లెనిన్ శతవర్ధంతి సంవత్సరం....

# లెనిన్

- దివికుమార్



లెనిన్ లెనిన్ లెనిన్
వ్లాదిమిర్ ఇలీచ్ లెనిన్
లెనిన్ బాట లెనిన్ మాట
పల్కునీ ధరిత్రి నోట
లెనిన్ లెనిన్ లెనిన్

లెనినంటే పోరాటం
లెనినంటే ఉత్తేజం
లెనినంటే విశ్వశాంతి
లెనినంటే... లెనినంటే
విప్లవ క్రాంతి!

అతివాదం తెగనరికి
రివిజనిజం నడ్డివిరచి
పట్టు విడుపు ఎత్తుగడతో
నిలకడైన పోరు నడిపి
పీడిత మానవ నేతా!!!
లెనిన్ లెనిన్ లెనిన్

శ్రామిక ఆశా సౌధం
కార్మిక కర్షక సేద్యం
సమతా మమతల రాజ్యం
నిర్మించిన సూత్రధారి
మహా ఉపాధ్యాయ స్ఫూర్తి!

పెట్టుబడికి తుది రూపం
వ్యక్తి ఆస్తి చరమాంకం
పరాన్న భుక్కుల అంతం
వర్గయుద్ధ ఆదర్శం
ఇదే లెనిన్ సిద్ధాంతం

లెనిన్ లెనిన్ లెనిన్
వ్లాదిమిర్ ఇలీచ్ లెనిన్
లెనిన్ బాట లెనిన్ మాట
పల్కునీ ధరిత్రి నోట
లెనిన్ లెనిన్ లెనిన్

22-4-1999 ✤

PRAJA SAAHITI October 2024 (TELUGU) Rs. 20/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2024-2026
No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month




ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada

A PUBLICATION OF JANASAAHITHI